భారతి

నవంబరు 1972

వ్యవస్థాపకులు:

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

వెల ఒకరూపాయి

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938–1972)

★

నవంబరు 1972

సంపుటము : 49 : సంచిక : 11 :

విడిపత్రిక వెల ఒక రూపాయి

వి ష యా ను క్ర మ ణి క

నవంబరు 1972

కన్యా కుమారి	శ్రీ నోరి నరసింహ శాస్త్రి	1
సంశోధిత మహాభారత ముద్రణము	శ్రీ నిడుదవోలు వేంకటరావు	9
శివోదయం !	శ్రీ కళాధర్	25
బాలవ్యాకరణ ఘంటా పథ వ్యాఖ్యా పరిశీలనము	శ్రీ శలాక రఘునాథ శర్మ	28
కిరణమాలి	శ్రీ కె. శివారెడ్డి	39
'వచన పద్యం' ఛందో విభాగం కాదు	శ్రీ చేకూరి రామా రావు	41
మారుతూన్న కాలం – 'మాలపల్లి'	శ్రీ రామమోహన రాయ్	50
భయం	శ్రీ కె. యస్. వి. నరసింహం	57
తెలుగులో ఉన్నత విద్యాభ్యాసం	డా. గవరసాన సత్యనారాయణ	67
గ్రంథవిమర్శలు		70

కన్యాకుమారి

శ్రీ నోరి నరసింహ శాస్త్రి

గంగానదీజలము కావేరీ జలములతో కలుపుటకు ఉద్దేశించినట్లు పత్రికలలో చదివిన 1957 లో దీనిని ప్రారంభించి, అది సాధ్యమని నిపుణులు నిర్ధారణ చేసినట్లు ప్రకటించిన 1972 లో ఈ రచన పూర్తిచేయబడినది.

1

పాంథుడు

ఏకమై మున్నీరు
    ఎగిరిపడు నీచోట
రంగురంగుల నీను
    రత్నాల గట్టుపై
ఒంటరిగ గూర్చుండి
    ఊర్పులు నిగిడ్చెదవు
ఎవరు నీ హృదయంబు
    నెరియించు కన్యకా?
ఎవరి రాకకు నిరీ
    క్షింతువె కుమారికా?

కుమారి

ఇంత వాత్సల్య మేపారు నిట్టియమృత
కంఠమున బల్కరించెదు కాయమెల్ల
జల్లు జల్లుజల్లురని సుధ జాలువారు
చున్న దెవరయ్య పరమపూజ్యుడవు నీవు?

పాంథుడు

చీమ చిటుకన్నచో
    చెవులొగ్గి యాలింతు,
గాలి మలసిన మాత్ర
    కనులెత్తి తిలకింతు
చలపత్ర మటు లురక
    చలియింతు నడు నడుమ,
పలుకవె కుమారికా
    తలిదండ్రు లెవ్వరో,
పేరేమి ఊరేది?
    కోరికేమే కన్య?

కుమారి

కర్ణగోచరమైన నీక్రమవాణి
పొంగి నాయెద తనువెల్ల పులకవారు
పుణ్యభాగీరథీపయః పూతతనుడ,
కేశవుడవొ హరుడవొ భగీరథుడవొ?

పాంథుడు

ఎంత బేలవు కన్య
    ఇటు లాడగా నీవు,
శివుడ నైతే గంగ
    శిరమందు పొంగదా,
గళసీమ మెరయదా
    గరళ నీలాంకంబు,
వామార్థభాగమున
    భామ వెలుగొందదా?
హరినైన పాదమున
    పరువెత్తదా గంగ,
హృదయమున శ్రీదేవి
    పదపీఠ ముండదా,

సిగయందు బహువర్ణ
శిఖిపింఛ మాడదా,
నీలరత్నచ్ఛాయ
నింపదా దిశలెల్ల?
ఇక భగీరథుడనే
ఏ నైన నావెంట
గంగ వాకలు గట్టి
కదలి రాకుండునా
బహుకాల దీక్షతో
బడలియుండద ఒడలు,
ముడులువడి శిరసుపై
జడలు కట్టవ నెరులు
కరములను పాదముల
పెరిగియుండవ గోళ్లు?
ఎంత బేలవు కన్య
ఇటు పల్కగా నీవు?

కు మా రి

సౌమ్యమయి నీదు మూర్తి హర్షమ్ము గూర్చు
శ్రవణపర్వము నీవాణి సత్యమట్లు
ఆప్తహితుడట్లు ప్రశ్నింతు వాదరమున
జలదరించెడి తనువు నీ పలకరింత!

పాం థు డు

నెమ్మి కటు తనువెల్ల
నిండినవి నీ కనులు
మిలమిలని మెరసెడిని
మీలవలె నీ కనులు
నిర్నిమేషంబు లై
నిలిచినవి నీ కనులు
మృగి యకు లటు ముఖము
మారినవి నీ కనులు
గిరి కన్యవో—నీవు—జల కన్యవో,
సుర కన్యవో—కాక—వన కన్యవో?

కు మా రి

హరుడు కాదందు, కాదందు హరివి గాని
అల భగీరథు డేని కాదందు వైన
పలుకు జల జలమని గాంగజలము భంగి
చలువగూర్చు జనుఃకల్మషంబు దొలచి

నీవు కన్పించినది మొదల్ నిఖిల దిశల
గుబులుకొని జాహ్నవీ పద్మకోశ విమల
సౌరభంబులు హృదయంబు దూరి మెల్ల
వివశతం గూర్చె వెన్నెల విరుల యట్లు!

నీదు రూపు భాగీరథీ నిర్మలంబు
స్వచ్ఛహిమవన్నగేంద్ర నిష్పన్న సుషమ
గాంగ ధవళ తేజస్సు నీకనుల వెలుగు
ఏర్పరుపరాక యుంటి నీ వెవరవయ్య?

పాం థు డు

ఏలనే కన్యకా
ఇటుల నను ప్రశ్నింతు,
పలుకు సంగీతమై
పర్వె నా శ్రవణముల,
పెదవులు మెదల్పగా
బింబ రోచులు చెలగు,
రదన కాంతులు దిశల
వెదజల్లు వెన్నెలలు,
ఎవరవె కుమారికా
ఏల చెప్పవె కన్య,
పలుకవె కుమారికా
తలిదండ్రు లెవ్వరే
ఊరేమి పేరేమి
కోరికేమే కన్య?

కు మా రి

ఎవరు నీవు, పేరేమి పనేమి యిచట
ఏల ననుగూర్చి ప్రశ్నింతు విన్నిగతుల?
చిరునగవు వెన్నెలలు పయి జిమ్ముకొనగ
పలుకరింతు వుత్తర మీవు పలుకవేమి?

పాం థు డు

తలచితిని బేల వని
పలుకరించిన మొదట
సందేహమగు నిపుడు
చాల ప్రౌఢ వటంచు

మొదలు ప్రశ్నించినది
ముగుద నీవా నేన?
నీ కథలు విప్పకయె
నా కథల నడిగెదవు !

*   *   *

అయ్యొ, కన్యా, యిట్లు
లైతివే క్షణములో
చిత్తరువు పోలికిని
రిత్తవడి నిలిచితివి
నిడుద యూర్పు నిగుడ్చి
నెరి తూలితివి కన్య,
నే నన్న దానిలో
నిష్ఠురం బున్నదా
తెలుపుమా కన్యకా
తెలిసికొని సవరింతు,
మన్నించి కన్యకా
మాటాడి కరుణింపు !

కు మా రి

అయ్యయో సఖ నీ వట్లులాడవలదు,
కలుగునే తప్పు నీయెడ కలుషరహిత !
ఏమి చెప్పగవలయునో ఎరుగ రాక
ఇట్లులైతిని లేదు నీయెడల దొసగు !

ఎరిగినది యెల్ల చెప్పెద నిదిగొ వినుము
ఎవరు తలిదండ్రులో నాకు నెరుకలేదు
నే నెరింగిన దాది ఈ నిలిచియున్న
గట్టుపై నీవు చూచుచున్నట్లులుంటి.

ఇచట నన్నెవరుంచిరో ఏ నెరుంగ
ఇంతవర కీవుగాక నన్నెవ్వరైన
పల్కరించియు నెరుగరు పరమమిత్ర !

పవలు రేయును మున్నీట పడుచులేచు
అలల నవ్వడి యెక్కలే యాలకింతు !

ఎదురుగా సూర్యభగవాను డిరులు చీల్చి
శిరముపై నెక్కి వేడిమి నెరియజేసి
వెనుకవైపున మెలమెల్ల మునిగి చనును
చిమ్మచీకట్లు నాచుటు జీబుకొనగ !
ఇంతకంటెను తేటగా నెదియు గనను !

ఇరులు క్రమ్మెడిచో నంతరిక్ష వీధి
చుక్క లొక టొక్కటే వచ్చి చూచి పోవు,
తనకు తోచినవేళ సుధాకరుండు
చలువవెన్నెల పండువు సలుపవచ్చు !

మరియునొక చిత్ర మున్నది మధ్య మధ్య
మలయ పవమాను డెడమగా మలసి మలసి
గుసగుసలు పల్కు చెవులలో ముసరు కొనగ
పూత భాగీరథీ గాంగ పుణ్యకథలు!

ఇప్పుడెరిగింతువా సఖా, ఎవరు నీవు,
ఏలవచ్చితి విచ్చటి, కెటులురాక,
ఏమి నీపేరు, తలిదండ్రు లెవరు నీకు,
ఏల చిరునవ్వు వొలికింతు వెల్లయెడల?

పాం థు డు

ఏమందు నీవలెనె
ఎరుగనే నాపేరు
తలిదండ్రు లెవ్వరో
తెలియనే నేగూడ
ఏల వచ్చితి నెట్లు
లెరుగ నన నను నమ్ము!

ఎరగియుండిన దాది
తిరుగులే ఎరుగుదును
నిలిచి యుండుట యన్న
నిముష మెరుగను కన్య
నిన్ను జూచిన క్షణమ
నిలిచి పోయితి నిచట!

చల చెల చ్చంచలా
సంతానమను నేను,
అచల పుత్రిక నీవ
టంచు తోచెడి, కన్య,
హరు వేడి తెత్తునా
కరము పీడింపంగ ?

కు మా రి

అంత సౌభాగ్య పదవి కే నర్హగాను
పార్వతీదేవి పరశివ పత్నిగాదె !

పాంథుడు

మున్నీరు నీ చుట్టు
మొనసి యున్నది కన్య,
అచల పుత్రిక వంచు
నమకొనుట పొరపాటు
జలధి కన్యవు నీవు
సందియం బికలేదు
హరివేడి కొని తెత్తు
కరము పీడింతువా ?

కుమారి

అట్టి సౌభాగ్య పదవి కే నర్హగాను
శ్రీ రమాదేవి శ్రీ హరి చెలువ గాదె !

పాంథుడు

అట్లందు వేమొకో
అసదు కాదిది కన్య
కన్య ఎప్పటికైన
కాంతు సొత్తేకదా !
నీ కెవ రభీష్టువెా
నీవె చెప్పుము తెత్తు,—
ఏమి యోచన నిన్ను
నే శ్మాగ నొనరించె?

కుమారి

అన్న, వినుమోయి ఎన్నాళ్ల చన్న కథయొ
పూర్వమొకమారు పెండ్లికి పూనుకొనియె
నెవ్వరో సాగరుడొ పర్వతేశ్వరుండొ
వరు డెవరు సమకూడె నే నెరుగ నయ్య !

అర్ధరాత్రము లగ్నమై యమరె నంట
ఇచట నా పెండ్లి యత్నంబు లెల్ల జరిగె
అచట వరుడును నాయితం బయ్యెనంట
నన్నును నలంకరింప యత్నములు సాగె

ఎవరు పంపిరొ ఇంతలో నెక్కడిదియొ
కోడికూసెను లగ్నంబు పొడరె నని
వరు డుపేక్షించె, పెండ్లికౌ వస్తుజాత
మంతయును వార్ధిపాల్సేసె నలిగి పెద్ద!

చూడుమిప్పుడు నీగుట్టచుట్టు బలసి
పప్పులును బియ్యము సమస్తవస్తుచయము
నబ్ధి జలముల వేల తేలాడి మెరయు
నిత్య కన్యాకుమారిక నే తదాది!

పాంథుడు

ఎట్లు తెలిసినది నీ
కీ వృత్త మంతయును
కదల కున్నావుగా
గట్టుపై కన్యకా?

కుమారి

మలయపవనుండు నామయి మలయుచుండు
ఆలకించితి నీకథ అతని నోటదల!

2

పాంథుడు

పాణిగ్రహము నీకు
వల దనుచు నున్నావు,
ఒరు కోరికే మున్న
మరి తీర్తు తెలుపువా !

కుమారి

అచలముగ నిట్లు నిల్చు నా యంతరమున
ఏమి కోర్కులు గలుగునో ఈవె తెలుపు!
అప్పుడవు గాన చెప్పెద నైన గాని
అంత రాంతముల నొక్క టడగి యుండు!

మలయ పవమాను డెపుడు పై మలయుచున్న
మరి మరి నిరంతరము పల్కు మధుర ఫణితి
హరి పదమునుండి శంభుని శిరము నుండి
భువి వియద్గంగ వెలసిన పుణ్యకథలె !

గంగ యెట్టుల నుండునో గద యటంచు
గంగ జలమెంత చల్లనో గద యటంచు
గంగ రూపెంత స్వచ్ఛమో గద యటంచు
గంగ తానెంత పూతమో గద యటంచు

కలలు గనుచుండు బహుభంగి గంగ గూర్చి
గంగ కౌగిట నొదిగిన గన్నతల్లి
యొడిని తలదూర్చు నానంద ముప్పతిల్లు !
గంగ నిటువైపు తోడిరాగలవె, సఖుడ !

పాం థు డు

ఎంత బేలవు కన్య,
వింత కోరిక గంటి,
గంగ నిటు తెచ్చుచో
కష్టంబు కనకుంటి!

కు మా రి

వింత లై నీదు నుడువులే వినగ నయ్యె
హరిని దెచ్చెద నిటకు నే హరుని దెత్తు
వరు నెవరినైన దెచ్చెద మరియు నంటి
గంగ గొనితెచ్చుటే మించు కష్టమవునె?

పాం థు డు

ఎంత బేలవు కన్య
ఇటు పల్కగా నీవు!
మూడడుగు లిడుచు హరి
భువనత్రయము మించె,
హరుడు శర మొకటి గొని
హరియించె త్రిపురములు,
అంత మహిమలు గలవె
ఆకాశ గంగకును!
హరి హరులు భక్తులకు
నతిసులభు లన వినవె
గంగ యంటే మిగుల
కఠినాత్మురాలు సుమి,
దివి నుండి భువి లోకి
దిగుటకు భగీరథుని
ఎన్ని త్రిప్పులు పెట్టె
నెరుగవె కుమారికా!

కు మా రి

అన్నియు నెరుంగుదును గాని యడుగు మంటి
వందుచే నంటి నీ కసాధ్యంబె యైన,
ఏమిచేయుదు, నిట్టులే ఎల్లవేళ
కలలు కనుచుందు వినుచుందు గంగకథలె!

ఐన నొకమాటచెప్పెద నార్య, వినుము
మహిమలో గాని కారుణ్యమతిని గాని
గంగ హరి హరులకు తీసి కట్టటన్న
ఇంచు కే నొప్ప నీ వెంత హితుడవైన!

హరుని శిరమున నడయాడు నెంబయెట్లు
అలతి యన జెల్లు మహిమలో హరి హరులకు!
విష్ణుపదజాత గద గంగ, విష్ణుపదము
కంటె నత్యూర్ధ్వ పదములు గలవె యెందు?

శ్రవణ గోచరమగు గంగ జల జల జల
తల్లి యమృతంబు కనవచ్చు తాక వచ్చు
సురభి రుచులు పంచేంద్రియ సులభగతుల!
అట్లు ప్రత్యక్ష గమ్యులే హరి హరులును?

వలదు కఠినాత్మురాలని పలుక గంగ,
ఆమె రూపము పరమ దివ్యామృతంబు,
స్వచ్ఛ రసవాహినీ ధుని యామె యాత్మ,
ఆమె దేలేకపో గాని, యామె నసకు!

పాం థు డు

అట్లు నిష్ఠురము నీ
వాడిన భరింప లే
నైన జెప్పెద చిక్క
లామె రావించుటను
ఆ పైన నీ యిచ్చ
నడుగు మింకొక కోర్కె
గంగ పారును రెండు
గట్లమధ్యను, కన్య
ఇటు సాగుచో వింధ్య
నెగిరి రావలె ముందు!
తపతియును నర్మదయు
తప్పకొని వచ్చినను
మరియొక్క మలుపులో
మలగిన మహానదిని
గోదావరీ దేవి
కూర్చుందు నడ్డమై
గోదావరీ గంగ
కాదె గంగమ కక్క,
అక్క బిగికౌగిటను
అడగి పోవదె చెల్లి!

అదియెట్లో దాటినను
అల చెల్లి కృష్ణమ్మ
ఆతిథ్య మొసగుచో
నదియెట్లు తప్పుకొను?
గంగా మహాదేవి
కడ గొట్టు చెల్లెండ్రు
పెన్నయును కావేరి
పిన తామ్రపర్ణియును
వారి బిగి కౌగిళుల
వారింప దర మౌనె?

అన్ని దాటిన నెట్లొ
అల యగస్త్యాశ్రమము
నాన దాటగ నలవి
యౌనె ఎవ్వరికైన?
జహ్ను మునివలె కాదు
సరస వాత్సల్యుండు
మునిపేరు తలచిననె
తనువు వడవడ వణకె!

ఈ చిక్కులను దాటి
ఎటు రాగలుగు గంగ!
ఈ విఘ్నములు గడచి
ఎటు తే గలను గంగ!

న న్నసత్యమునుండి
కన్నె, రక్షింపుమా,
ఇంకొకటి కోరుకొని
ఏను చేయంగలది!

కు మా రి

నను బరీక్షింప నెంతువా, యమగు సఖుడ,
కాక గంగా మహత్త్వమే కాన లేవా!
పేరు హిమవంతు లెదుర్కొడ్డ వీరివచ్చె,
అడగి పడియున్న వింధ్యంబు గడవ లేదొ!

అక్కసెల్లెండ్రు రందువా, యాప్తమిత్ర,
వారు కరుణా రస తరంగ వాహినులని
కనవొ, వారల యడ్డు తాత్కాలికమని!

సాగరులు తెచ్చి తెచ్చిన సాగరంబు
తన జలము తోడ నింపిన తల్లి మహిమ
ఎరుగవో, వినియుండవో, మరచినావొ?
వాహినులు చేయు విఘ్నముల్ పాటిగావు!

ఒకటి మనవి యొనర్చెద నో వయస్య,
ఆ యగస్త్యుని ననబోకు మట్టిమాట
అట్టి కరుణా మహాంభోధి యన్యు డేడి,
పాపహరు డాతడీ దక్షిణా పథముకె!

అతడు కాశిని విడనాడి నాది గాగ
కలలు కనుచుండు నావలె గంగ గూర్చి
కాశియే యగు, నిజమిది గంగ రాక,
మన కగస్తి శుభంయుండు మాన్యతముడు!

పాం థు డు

ఎంత చెప్పిన వినవ
ఏ మనందును నిన్ను,
ఒకమాట చెప్ప నిం
కొకమాట నడ్డెదవు,
ఏమి చేయగ లాడ
నిక తప్పదే నాకు
ఆప్తురాలవు, కన్య,
ఆజ్ఞగా పాలింతు!

నిశ్చంచలం బైన
నీ కోర్కి వినినంత
హరిహరులు నన్నిప్పు
డావహించిరి కన్య,
ఆపాదమస్తకం
బాడుచున్నది గంగ!
జీవనాడి గదమ్మ
జీవకోటికి గంగ!
నీ బోంట్ల తపము లివి
నిఖిల క్షేమం కృతులు!
కాశికిం జని కృతులు
గంగ చెంబులు తేర
విని మేళ తాళముల
చని తోడి తెత్తురే,
గంగ చెంబుల గొల్తు
రంగనా మణు లిండ్ల

ప్రత్యక్షముగ గంగ
ప్రవహించుటం గాంచి
ఆ బాల గోపాల
మానంద మందెదరు
ఆ సేతు శీతాచ
లావర్తి జన మంద
రానంద నాట్యంబు
లాడంగ నేకమై,
ధన్యవాదంబులను
దనియింప కవి బుధులు
దారిలో వనగిరులు
దరి నదీ నదములును
జనపదంబులు పురులు
జయ జయ ధ్వను లీన
అడు గడుగునను మౌను
లగ్గింపగా మనల
గంగమ్మ తోడుకొని
కదలి వచ్చెద నిటకు!
హరినామము లసించె
నాకాశమున గరుడి!
హం భా రవ మొనర్చె
హర వృషభ మదె ప్రీతి!
సాగరుడు ఘోషించు
సఫల మౌ నని యాత్ర
తల యూచు నీ నిల్చు
శిల తథాస్తన్నట్లు
జయఘోష నిన దించు
సకలాశలను నిండి!
శుభవాక్కు పలుకవే
శుభమను కుమారికా!
అనతి కాలంబుననె
అనుగమింపగ గంగ
వత్తునే మరల నీ
పదపీఠముమ జేర!
సెలవీయవే కన్య
సెలవీ కుమారికా!

కు మా రి

ఎవరో ఆప్పుడ వని ముందె ఎరుక కలిగె,
కాని నాహృదివే యుని కానమైతి
కదల కిచ్చట గూర్చున్న కన్య నేను,
ఎపుడు కదలాడి తిరుగు నాహృదయ మీవు!

పాం థు డు

కన్యా కుమారికవు
కాదు కాదే తల్లి
గడ్డకట్టిన పుణ్య
గంగమూర్తివి గాని,
నమో దేవి గంగే
నమో మాతృ గంగే!

కు మా రి

ఈవు కర్తవ్య మెరుగుదు వేను నైన
చెప్పెదను సముత్కంఠమై, చెలువుడ, విను,
ముందు కదలుము కాశికా పుణ్యపురికి
నర్చసేయు ఢుంఠీశ్వరు నాది నచట!

అన్నపూర్ణేశు విశ్వేశు నంత గొలుము,
బిందు మాధవు సేవింపు పిదప భక్తి,
కాశికను కాశి వసియించు కాలభైర
వాదు లగు వేల్పు లందర నర్చ సేయు!

జాహ్నవిని జేరి యంతట జహ్నుతనయ
కాళ్లకడ్డంబుగా బడి కదల నీకు!
నీ కుమారిక యార్త కన్యాకుమారి
నిన్ను రమ్మన్న దని వార్త విన్నవింపు!

నిన్ను జూడ పలవరించు చున్న దనుము,
నిన్ను నిత్యంబు ధ్యానించు చున్న దనుము,
మిన్ను పడుచోట తిన్నపై కన్నకూతు
విడిచి యుంట భరంబని విన్నవింపు!

పాం థు డు

గంగమ్మ మనతల్లి
కరుణా తరంగిణి యె
మన మడిగిన నంతనే
కనికరించును సుమీ
తాపత్రయము తీర్చి

తనియంగ ప్రజలెల్ల
కదలి వచ్చును సుమీ
గంగ వాకలు గట్టి
సంకల్పమాత్రమున
జల జలని జల లడరు
కదలంగ దలచుచో
గంగ కడ్డులు గలవె?
గంగమ్మ దోడుకుని
కదలి వచ్చెద నిటకు
సెలవిమ్ము శుభవాక్కు
సెలవిచ్చి కన్యకా!

కుమారి

గంగ యెడద నొదుగ కాచి యుండెదనయా
గంగ గూడి మరల కదలిరమ్ము
ఎంతయాప్తుడ వగు హృదయమిత్రుడవనా
శుభము నిర్మలాత్మ, శుభము, శుభము!

'పాపాపహారి దురితారి తరంగధారి
శైలప్రచారి గిరిరాజ మహావిహారి
ఝుంకార కారి హరిపాద సరోజవారి
గాంగం పునాతు భువనం శుభకారి వారి!'

పాంథుడు

కన్యా కుమారికా యిక
నన్యధ్యానంబు మాని యనవరతంబున్
ధన్యాత్మ జేయు గంగా
పుణ్యధునీ స్వాగతమున భువనత్రయమున్!

'గాంగం వారి మనోహారి
మురారి చరణ చ్యుతమ్
త్రిపురారి శిరశ్చారి
పాపహారి పునాతుమామ్!'

'మాత శ్శైలసుతాసపత్ని వసుధా
శృంగార హారావళి
స్వర్గారోహణ వైజయంతి భవతీం
భాగీరథీం ప్రార్థయే
త్వత్తీరే వసతః త్వదంబు పిబతః
త్వద్వీచిషు ప్రేంఖతః
త్వన్నామ స్మరతః త్వదర్పిత ధియః
స్యాన్మే శరీరస్థితిః'



సంశోధిత మహాభారత ముద్రణము

శ్రీ నిడుదవోలు వేంకటరావు

ఉస్మానియా విశ్వవిద్యాలయము వారిచే ప్రకటితమైన మహాభారత సంశోధిత ముద్రణము ఆది సభా ఆరణ్య పర్వములు రెండు సంపుటములు గత జూలై, ఆగస్టు భారతి సంచికలలో సమీక్షింపబడినవి. సమీక్షాకర్తలు శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి గారు.

ఈ గ్రంథసమీక్షలో అవతారిక గాక —

1. నన్నయ ప్రామాణికత.
2. అనువాద విధానము.
3. పాఠ నిర్ణయము—పూర్వ ముద్రణములు.
4. చిల్లర విషయములు—

అను శీర్షికలున్నవి. 32 పుటలలో నున్న యీ సమీక్ష సావధానముగా చదువగా, నిందు మహాభారత సంశోధిత ముద్రణమునకు నేమాత్రము సంబంధము లేని విషయములే యున్నవని పొడగట్టక మానదు.

గ్రంథ సమీక్షయందు మొదట తెలుపవలసినది గ్రంథ స్వరూపము. మహాభారత విషయమున నిది చాలా అవసరము. మహాభారత మీవఱకే ముద్రితమై యందఱకు పరిచితమైనదే—అయినను మహాభారత సంశోధిత ముద్రణము అనగా నేమో పాఠక లోకమునకు తెలియవలెను. ఇదివఱకు ప్రచారములో నున్న భారతమునకన్న దీని విశిష్టత యేమో లోకమునకు వ్యక్తపఱుపవలెను. అందునకు వివరణ మావశ్యకము. ఆ వివరణ మీ సమీక్షలో లేదు—కావున తెలుపుచున్నాను.

గ్రంథ వివరణము

ఈ రెండు సంపుటములును నితఃపూర్వము ప్రకటింపబడిన భారతము రీతిగానే ముద్రితమైనది—అయినను నిందు ప్రతిపుటయందు పై భాగమున మూల గద్యపద్యములు—క్రింద—ఆయా తాళపత్ర గ్రంథములనుండి సేకరింపబడిన పాఠభేదములు, ఆ తాళపత్ర సంకేతాక్షరములతో నీయబడినవి. తాళపత్ర గ్రంథపాఠములేగాక, తెలుగున వ్యాకరణ చ్ఛందోలక్షణ గ్రంథములలో నుదాహరింపబడిన పాఠభేదములు సూచితములైనవి. వలసినచోట్ల, ఆ పాఠములనుగూర్చిన విమర్శ గలదు. పాఠనిర్ణయమునకు కొన్నిచోట్ల సంస్కృత మూలశ్లోకము లీయబడినవి. ఇట్టివి ప్రతిపుటయం దించుమించుగా సగముభాగము నాక్రమించియుండును.

ఇట్లు పాఠభేదములతో మూలము ముద్రితమగుటయేగాక, ఈ రెండు సంపుటములలో ప్రథమ సంపుటమున ఆంగ్లభాషలో తాళపత్ర గ్రంథసేకరణాది వివరములు ముప్పది పుటలలోను, తెలుగున 128 పుటలలోను గలవు. రెండవ సంపుటమున—నన్నయనుగూర్చి 59 పుటలు, ఎఱ్ఱనను గూర్చి 19 పుటలుగల కవితా విమర్శ పూర్వకమగు ఉపోద్ఘాతము కలదు. ఈ రెండు సంపుటములకు, ప్రతిపర్వమునకు గద్యపద్య ప్రథమ పాద సూచిక యీయబడినది. మొదటి సంపుటమున 883, రెండవ సంపుటమున 813 పుటలుగల బృహత్సంపుటములు—

ఇంతవఱకు ఆంధ్రసాహిత్య ప్రపంచమున మహాభారతమున కిట్టి సంశోధిత ముద్రణము వెలువడలేదు.

సంశోధిత ముద్రణ ప్రత్యేక విశిష్టత

మహాభారతము ముద్రితమై ప్రచారములో నున్నను అందలి పాఠములు, బహువిధములుగానుండి వాదోపవాదములకు, చర్చలకు గుఱియైనవి. ముద్రణలోనున్న పాఠములను పండితులు, పరిష్కర్తలు,

తమ యిచ్చువచ్చినట్లు దిద్దిరి. ప్రాచీనకావ్యముల పాఠ నిర్ణయమునకు, తాళపత్ర గ్రంథములే ప్రామాణికములు, పరమాధారములుకాని, ముద్రితప్రతులు కావని, మొదట సాహిత్యలోకముదృష్టిని, తాళపత్ర పాఠముల వైపు మఱల్చినవారు—గిడుగు రామమూర్తిపంతులు గారు. వారు భారతమును ముఖ్యముగా తెలుగుభాషలో తొలి కావ్యమైన నన్నయభారతమును నామూలాగ్రముగా, ప్రత్యక్షర పరిశీలనచేసి, తాళపత్ర పాఠముల మూలమున నెట్లు నన్నయకాలమునాటి భాషాస్వరూపము నిర్ణయింపగలమో దానిని తమ వ్యాసముల మూలమున వివరించినారు. నన్నయనాటి భాషా లక్షణముల నేర్పఱిచినారు. గిడుగువారి అడుగు జాడలలో చిలుకూరి నారాయణరావుగారు, నన్నయ కాలమునాటి భాష (11 వ శతాబ్ది తెలుగు భాష)ను గూర్చి విశేష పరిశ్రమచేసి ఒక గ్రంథముగా రూపొందించి మదరాసు విశ్వవిద్యాలయమున పట్టము బడసినారు[1]. అంతేగాక గిడుగువారి యాదేశమున నన్నయ భారతమున 'సుపర్ణోపాఖ్యానము' 97 తాళపత్ర ప్రతులతో పాఠభేదములు సంప్రతించి ప్రకటించినారు[2]. నన్నయ భారతమునే కాక, కవిత్రయ భారతమున పాఠభేదములను గూర్చి కడచిన ఏబదేండ్లుగా, ఎంతో వ్యాసంగము జరిగినది. ఆ కాలమున సంవత్సరాది సంచికలలో నన్నయ ఛందస్సునుగూర్చి వ్యాసములు గలవు. అందుపాఠభేద ప్రసక్తియున్నది.[3]

కైలాసవాసి కాశీనాథుని నాగేశ్వరరావుగారి వలన, ఇటీవలనే శివసాయుజ్యమునందిన శ్రీ శివలెంక శంభుప్రసాదుగారివలన—భారతమునుగూర్చిన సాహిత్య విమర్శలు పాఠభేదములనుగూర్చిన వ్యాసములన్నింటిని నేకైకముగా ప్రకటించుచున్నది. 'భారతి' 'ఆంధ్ర భారత భారతి' స్వరూపము చాలవఱకు వ్యక్తము చేసినది, భారతి పత్రికయే యనుటలో అతిశయోక్తి లేదు. ప్రస్తుత సంపాదకులును, భారత వ్యాసంగమునకు ప్రోత్సాహము నిచ్చుచున్నందువలన, సాహిత్య ప్రపంచము వారి యెడల నెంతగానో కృతజ్ఞత చూపదగి యున్నది.

1924, 1925 భారతి సంపుటములలో ఎఱ్ఱన అరణ్య పర్వశేషమునుగూర్చి, 1936 భారతిలో 'నన్నయ యతులు కొన్ని గతులు'[4] అన్నవిషయమును గూర్చి వ్యాసములు గలవు. ఆ కాలమున పరిశ్రమ చేసిన విద్వాంసులందఱు, ముద్రిత ప్రతిగాక, తాళపత్ర ప్రతిపాఠములనే ఆధారము చేసికొని, పరిశ్రమ చేసి, వాని ప్రాముఖ్యమును లోకమునకు వెల్లడించిరి.

ఇంతవఱకు జరిగిన భారత పాఠ పరిశోధనలను పురస్కరించుకొనియే, నేటి సంశోధిత మహాభారత ముద్రణము వెలువడినది. తాళపత్ర ప్రతులనుండి పాఠ భేదము లెట్లుదాహృతములైనవో ఇంతకుముందే వివరించి యున్నాను. మూలపాఠము ముద్రితమై పుట యడుగున, తాళపత్ర ప్రతిపాఠములు ప్రదర్శితము లగుట వలన—దేశమునగల పండితులు, పరిశోధకులు, భాషా వేత్తలు — ఈ పాఠములు పరిశీలించి — 'ఈ పాఠ మిట్లుండవలెను' ఈ పాఠమే మూలములో నుండవలెను'అని పాఠనిర్ణయము చేయుట కవకాశము గలుగుచున్నది.

శతాబ్దులుగా భారతములో పాఠము లెంతగా మాఱినవో ప్రదర్శించి పాఠనిర్ణయమునకు దోహదము గల్పించుటయే—సంశోధిత ముద్రణము ముఖ్యాశయము—దీనినిబట్టి సంశోధిత ముద్రణ సమీక్ష—అనగా

'భారత పాఠ సమీక్ష'—అని గ్రహింపవలెను.

---

1. చిలుకూరివారే తెలుగు భాషలో మొదట 'పి. హెచ్. డి.' పట్టము పొందినవారు. ఇప్పుడున్న, కాబోవు 'పి. హెచ్. డి' లందఱకు పితామహులు (1929).

2. చూడుడు. వారి ఆంధ్రభాషా చరిత్ర ద్వితీయ సంపుటము—(1933) ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రకటితము.

3. విస్తరభీతిచే—వివరము లీయలేదు.

4. ఈ ప్రశస్త వ్యాసము కీ. శే. వడకుదిటి వీరరాజు గారిది. ఇంకను ఇట్టివి చాల వ్యాసములు గలవు. విస్తరభీతిని విరమించితిని.

ప్రస్తుత సమీక్షకులకు, ప్రాచీన కావ్యపరిష్కరణమన నేమో, పాఠభేదములన నేమో, అవి యెట్లేర్పడినవో, ముద్రిత పాఠమువలన నేర్పడిన అవ్యవస్థ యెట్టిదో తాళపత్రపాఠముల విలువ యెట్టిదో ఈ షన్మాత్రము నవగాహన చేసికొనలేకపోవుటవలన—ఈ రెండు సంపుటములలో, పదునాల్గువందల పుటలలో, ప్రతిపుట యందున్న పాఠభేదములను గూర్చి యొక్క మాటయైనను వ్రాయలేదు.[5] ఇందువలన — ఈ సమీక్ష

సంశోధిత మహాభారత ముద్రణ

సమీక్ష—

ఎంతమాత్రమును కాదు — మఱి యేమి? సమీక్షాకర్తలకు మూలగ్రంథ పాఠభేద పరిజ్ఞానము బొత్తిగా చాలమి, దానిని పూర్తిగా విడిచి, సమీక్షా వ్యాస పూరణార్థము, రెండవ సంపుటమున నున్న ఉపోద్ఘాతమునందలి విషయములను గ్రహించిరి. అవి సంశోధిత గ్రంథముద్రణకు నెంతమాత్రము సంబంధించినవి కావు—అవి నన్నయ, ఎఱ్ఱన కవితా విశేషములనుగూర్చిన విమర్శలు — సాహిత్య విమర్శకు సంబంధించినవి. ఇందువలన నీ సమీక్ష—

సంశోధిత మహాభారత ముద్రణ సమీక్షగాక,
సంశోధిత మహాభారత ముద్రణోపోద్ఘాత సమీక్ష

మాత్రమే యగుచున్నది. దీనిచే భారతి పాఠకులకు సంశోధిత మహాభారత ముద్రణ ప్రత్యేకత విశిష్టత యెట్టిదో, తెలుసుకొను నవకాశము లేకపోయినది. భారతి సమీక్షా విధానమునకు ప్రత్యక్షరము విరుద్ధమైనది.

ఇది యింతటితో నాగలేదు. ఈ 32 పుటల వ్యాసమున ప్రతివిషయము ఖండనీయమే. అయినను భారతి పత్రికా గౌరవమును, సంప్రదాయమును పురస్కరించుకొని, పై శీర్షికలలో నొక్కొక్క దానిని విమర్శించుచున్నాను.

అ వ తా రి క

సమీక్ష ప్రారంభమున అప్పకవి చెప్పిన యీ క్రింది పద్యము లుదాహరింపబడినవి.[6]

‘ఉ॥ ఆదిని శబ్ద శాసన మహాకవి చెప్పిన భారతంబులో
నేది వచింపగా బడియె నెందును దానినె గాని సూత్ర సం
పాదన లేమిచే తెనుగు పల్కు మఱొక్కటిగూర్చి చెప్పగా
రాదని ద్రాక్షవాటి కవిరాక్షసుఁడీ నియమంబు చేసినన్.

క. ఆ మూఁడు పర్వములలో
నామాన్యుఁడు నుడువు తెనుగు నరసి కొని కృతుల్
తాము రచించిరి తిక్క సు
ధీ మణి మొదలైన తొంటి తెలుగు కవీంద్రుల్’

నన్నయ మూడు పర్వములలో వాడిన తెలుగు మాటలనే తప్ప తక్కినవి వాడరాదని ద్రాక్షవాటి కవిరాక్షసుడు నియమము చేసినాడని అప్పకవి చెప్పినాడు. కాని, ఈ కవిరాక్షసుని గ్రంథమేదో పై పద్యము లెందున్నవో, అప్పకవి చెప్పలేదు. తక్కిన గ్రంథము లుదాహరించి, వానినుండి పద్యముల నుద్ధరించిన యప్పకవి కవిరాక్షసుని గ్రంథము పేరైన నుదాహరింపక—ఆతడట్లు చెప్పినాడని వ్రాయుటవలన—నిది కేవలము కల్పితము—అప్పకవి కాక మఱి యేలాక్షణికుడైన యీ విషయము తెల్పినాడా? అదియునులేదు—కాబట్టియే యిది అప్పకవి కల్పన—ఇది యట్లుండ నిండు—

అప్పకవి క్రీ. శ. 1656 ప్రాంతమువాడు. నన్నయ క్రీ. శ. 1050 ప్రాంతమువాడు—క్రీ. శ. 1050 ప్రాంతముననున్న నన్నయకు, మఱి 600 యేండ్లకు తరువాతనున్న అప్పకవి ప్రమాణమా? ఈ

---

5. సమీక్షలో పాఠనిర్ణయము పూర్వముద్రణములు—అనియున్నవి గదా, అని పాఠకులకు సందేహము గలుగ వచ్చును. కాని యా శీర్షికయం దిచ్చిన పాఠములు సమీక్షాకర్తల స్వంతముగాదు—అది వారి తాతగారైన వేంకటరాయశాస్త్రులుగారివి. వీనినిగూర్చి ఆ శీర్షికలో చూడుడు.

6. అప్పకవీయమున నెచ్చట నున్నవో, ఆ అకరములు తెలుప బడలేదు.

ఆఱు శతాబ్దులలో నన్నయనుగూర్చి — కవులుగాని లాక్షణికులుగాని చెప్పనే లేదా? నన్నయకాలము నుండి అప్పకవికాలమువఱకు, నన్నయను ప్రమాణీకరింపని, కవికాని లాక్షణికుడు గాని లేడు — సమీక్షాకర్తల కీ విషయ మగమ్యము—ఇంతేకాదు. ముందు నేను వివరించిన వారందఱు:ను—నన్నయభారతమును గూర్చి పరిశ్రమ చేసినపుడు అప్పకవిని గ్రహింపనే లేదే? విశ్వవిద్యాలయములలో జరిగిన పరిశ్రమవాట యటుంచి—భారతి పత్రికలో ప్రకటితమైన వ్యాసములనైన సమీక్షాకర్తలు చూచినట్లులేదు. ఇందువలన సాహిత్య ప్రపంచమున భారతమునుగూర్చి యెట్టి కృషి జరిగినదో, వీరికి తెలియలేదు. కావుననే, యీ సమీక్ష ఎట్టి యవ్యవస్థకు పాల్పడినదో, ఎట్టి అపమార్గమున నడచినదో వివరించుచున్నాను.

(1) నన్నయ ప్రామాణికత

సమీక్షాకర్త లీ విషయమై చర్చించి, తుదకిట్లు వ్రాసినారు. 'ఈ విధముగా శ్రీనాథుని కాలమునకుకూడ ఏర్పడని ప్రామాణికత నన్నయకు తర్వాత కదా వచ్చియుండవలెను'. (పుట 29)

దీనినిబట్టి తెలుగు వాఙ్మయమున నన్నయకు—శ్రీనాథునికాలమువఱకు ననగా క్రీ. శ. 1450 ప్రాంతమువఱకు ప్రామాణికత లేదనియే గదా! ఇది యెంత యప్రామాణికమైన వ్రాతయో చూడుడు. ఆంధ్రమహాభారత సంశోధిత ముద్రణ సమీక్షలో పై శీర్షిక యుండుటవలన—సమీక్షాకర్తలకు నన్నయనుండి శ్రీనాథునివఱకుగల సాహిత్యపరిణామముగాని, కావ్యములుగాని తెలియవనియు, నాంధ్రవాఙ్మయ చారిత్రక పరిజ్ఞానము పూజ్యమనియు మన మనుకొనవలెను. ఈ సందర్భమున - కవి కాలక్రమముకూడ పాటింపబడకపోవుటచే, వీరి నా విషయమై కూడ సంశయింపవలసివచ్చుచున్నది. మొదట తిక్కన, తరువాత కేతన, ఆవెనుక విన్నకోటపెద్దన——చివఱ ఎఱ్ఱన[7]—వీరినిగూర్చిన వ్రాసినతరువాత—'ఇంతవఱకు నన్నయకు లేని ఏకైకప్రామాణికత బాలసరస్వత్యాదులకు తర్వాతనే వచ్చియుండవలెను' (పుట .30) అని వ్రాసిరి. బాలసరస్వతి 17 వ శతాబ్దివాడు కాబట్టి—17 వ శతాబ్దివఱకు, నాంధ్రసాహిత్య ప్రపంచమున నన్నయకు ఏకైకప్రామాణికత లేదన్నమాట! అట్లయిన—నన్నయ ప్రామాణికత, 18, 19, 20 శతాబ్దములలోనే వచ్చినదిగదా, అది యెవరిమూలమున వచ్చినది? ఆ విషయము తెలుపనేలేదు.

ప్రస్తుతము పైని చెప్పిన—తిక్కన, కేతన, పెద్దన (విన్నకోట) ఎఱ్ఱనలను గుఱించి వీరు వ్రాసిన వ్రాతలను ఖండించుటకుముందు క్రీ. శ. 11 వ శతాబ్దినుండి నన్నయ ప్రామాణికత యెట్టిదో నిరూపించుచున్నాను.

నన్నయ-శివకవులు

నన్నయ యుగము వెనువెంటనే అవతరించినది శివకవియుగము — శివకవిత్రయమగు, మల్లికార్జున పండితారాధ్యులు, నన్నెచోడుడు, . పాల్కురికి సోమనాథుడు నన్నయ ననుసరించినవారే.

మల్లికార్జున పండితారాధ్యుడు శివతత్త్వ సారమున కందపద్యరచనలో నన్నయనే యనుసరించినాడు. నన్నయవలె, నాల్గవ పాదమున జగణముతో కందములు రచించినాడు. అంతేకాదు—పదజాలము నన్నయనుండి గ్రహించినాడు. 'ఆదికర్త—అలరి—ఉల్ల—ఎరఁగు—ఏడుగడ—తదర్థము-బోరన-మొల్లమి—వరవుడు- వాచఱచు—నడిసేను మొదలగునవిఠి అట్టివి.

నన్నెచోడకవి

నన్నయను, పదములలో, పదబంధములలో, సమాసములలో పద్యముల యెత్తుగడలలో తూ చా తప్పక యనుసరించిన కవి, నన్నయకు నన్నెచోడ కవి

---

7. సమీక్షాకర్తల ననుసరించి, ఎఱ్ఱన—విన్నకోటపెద్దన తరువాతివాడు—వాఙ్మయ చరిత్రకారులు గమనింపుడు.

8. చూడుడు. శివతత్త్వసారము. నా ద్వితీయ ముద్రణ పీఠిక—పరిష్కరణము, కృష్ణాపత్రికా ప్రచురణము 1968.

రాజునకు—వ్యాకరణము, ఛందస్సు, జాతీయములు—భావములు—వీని యన్నింటియందును పోలికలు గలవు. పద్యముల యెత్తుగడ లిరువురిలో 30 పద్యములలో నొక్కరీతిగా నున్నవనినచో—నన్నెచోడడు నన్నయ నెంతగా ననుకరించెనో తెలియగలదు. విస్తరభీతి నుదాహరణ లీయలేదు.9

పాల్కురికి సోమనాథుడు

పాల్కురికి సోమనాథుని ప్రథమ రచనయగు అనుభవసారము. నన్నయకవిత ననుసరించిన పద్య కృతి—చతుర్వేదసారమున, పండితారాధ్య చరిత్రమున నన్నయ పద్యముల కనుకరణములు గలవు.[10] శివకవులు శివేతర కవుల నుతింపరుగావున నన్నయ ప్రశంసలేదు.

నన్నయ ననుసరించియు, కావ్యరచనా పథకమున స్వతంత్రమార్గమును ప్రవర్తింపజేయుటయే శివకవుల యందలి విశేషము—నన్నయ కవితాలక్షణములనేగాక, భాషాలక్షణములను గ్రహించుటకు - శివకవుల కృతులు హెచ్చుగా తోడ్పడును.

శివకవి యుగము తరువాతిది తిక్కన యుగము.

తిక్కన

'తిక్కన భారతములో నన్నయనుగూర్చి 'ఆదరణీయ' పద్యమున అతడు భారతములో 'ఆదిదొడంగి మూడు కృతు 'లొనర్చెదనన్నాడేగాని అతని ప్రామాణికతనుగూర్చి యొకమాటకూడ అనలేదు' (పుట 28) దీనినిబట్టి సమీక్షాకర్తలా పద్యమున నేమున్నదో యెఱుగరనుట నిశ్చితము—తిక్కన నన్నయ ప్రమాణికతను గూర్చి—ఒకమాటయైన యనలేదనిగదా, పైని వివరింపబడినది. ఆ పుటలోనే—'నన్నయ స్తుతిభారతమున చేసినాడు...అందులోకూడా ఎక్కువగా ఏమియు చెప్పలేదు'అని కలదు. కాని పద్యము చూడుడు.

'ఆదరణీయసార వివి
ధార్థ రసస్ఫురణంబుగల్గి య
ష్టాదశపర్వ నిర్వహణ
సంభృతమై పెనుపొందియుండ నం
దాది దొడంగి మూడు కృతు
లాంధ్రకవిత్వ విశారదుండు వి
ద్యా దయితుండొనర్చె, మహి
తాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్.'

ఈ పద్యమున (1) ఆంధ్రకవిత్వ విశారదుండు. (2) విద్యాదయితుండు, (3) మహితాత్ముఁడు, (4) దక్షతన్—అను నీ నాలుగు విశేషణముల కర్థమేమి? ఇవియన్నియు వ్యర్థములేనా? తిక్కన పాదపూరణమునకైన వ్యర్థపదము లుపయోగింపడని కదా ప్రతీతి—ఇంతేకాదు—'అతని పల్కు లాగమములు'—(ఏముఖంబునఁ దాఁ బల్కిన బల్కు లాగమములై పొల్పొందు—ఎఱ్ఱన హరివంశము పూ. భా. 1—9) తిక్కనయే తన భారత ప్రారంభమున—'ఆంధ్రకవిత్వ విశారదుండు'అని బాహాటముగా ప్రశంసించినప్పుడతడు—నన్నయ ప్రామాణికత నంగీకరించినట్లేగదా—తిక్కనకు నన్నయయందు ప్రామాణిక బుద్ధియే లేనియెడల—నాలుగు విశేషణము లాతని గూర్చి వ్రాసియేయుండడు. భారతమున తొలి మూడు పర్వము లింతకుముందే నన్నయ రచించియున్నాడు అని ముక్తసరిగా చెప్పియుండెడివాడు. ఇది 'ఆదరణీయ' అన్న పద్యము నవగాహన చేసికోలేనందువలన వచ్చిన యవ్యవస్థ. ఇది యింతటితో నాగలేదు.

నన్నయ భారతమును తిక్కన చదువలేదనియే సమీక్షాకర్తల యభిప్రాయము చూడండి.

'తిక్కన ఎంతవఱకు నన్నయ్యను చదువుకొనెనోగాని' (పుట 25). తిక్కన నన్నయను పఠించి కవిత నేర్చుకొనలేదుగదా. (పుట 28).

పై వాక్యద్వయమువలన వీరు తిక్కన భారతము నెన్నడును చదివియుండలేదని నిర్వివాదముగా నేర్పడుచున్నది. తిక్కన భారతము చదివినవారి కందఱకు నన్నయ నాతడు పఠించియే, తాను రచించినాడని యీపాటికే వ్యక్తపఱచియున్నారు. ఈ విషయము

---

9. నన్నియ నన్నిచోడ కవులు — భారతి— సం. 40–సం. 5 మే. 1963 పుటలు 58–63.

10. బసవపురాణ పీఠిక—1952. ద్వితీయ ముద్రణము—ఆంధ్ర గంధమాల.

వీరెఱిగియుండిన నిట్లు వ్రాసియుండరు. ఉదాహరణకు నన్నయను, తిక్కన యెట్లనుసరించినాడో చూపుచున్నాను.

న న్న య

శా. విద్వన్ముఖ్యుఁడు ధర్మమూర్తి త్రిజగ
ద్విఖ్యాతతేజుండు కృ
ష్ణ ద్వైపాయనుఁ డేగుదెంచె సుత శి
ష్య బ్రహ్మ సంఘంబుతో
సద్వంద్యుండు సదస్యుఁ డయ్యె ననినన్
శక్యంబె వర్ణింప సా
క్షాద్విష్ణుండవు నీవు భూపతులలోఁ
గౌరవ్య వంశోత్తమా.
(ఆది 2—227.)

తి క్క న

శా. విద్వత్సంస్తవనీయ భవ్యకవితా
వేశుండు, విజ్ఞాన సం
పద్విఖ్యాతుఁడు సంయమిప్రకర సం
భావ్యాను భావుండు కృ
ష్ణ ద్వైపాయనుఁ డర్థిలోక హిత ని
ష్ఠంబూని కావించె ధ
ర్మాద్వైతస్థితి భారతాఖ్యమగు లే
ఖ్యంబైన యామ్నాయమున్.
(విరాట. 1—3.)

విరాటపర్వ ప్రారంభములోనే, అనగా, 'ఆదరణీయ' పద్యమునకుముందే నన్నయ, ఎత్తుగడతో, అదే ప్రాసతో తిక్కన పద్యము రచించినప్పుడు, నన్నయ భారతమునే వరవడిగా పెట్టుకొని, తాను విరాటపర్వాదిగా భారత రచనము మొదలిడినాడని విశదమగుచున్నదిగదా! ఇంకను మఱి రెండు.

న న్న య

చ. చదివితి నెల్ల వేదములు
సత్క్రియఁ జేసితి నూఱు యజ్ఞముల్
(ఆరణ్య 4—120)

తి క్క న

చ. చదివితి నెల్లవేదములు
జన్నము లొప్పఁగ జేసితిన్
(శల్య. 2—230.)

న న్న య

క. ....
మానుగవచ్చితి నీకును
భానునిభా శిష్యవృత్తిఁ బనిసేయంగన్
(ఆది 3—108)

తి క్క న

క. ....
మానిత గతి నీకును నగు
భానునిభా! నీ యశంబు బరగును నీకున్
(అనుశాసనిక 3—82)

ఇంకను గలవు గ్రంధవిస్తరభీతి నీయలేదు.

పై యుదాహృతులనుబట్టి—నన్నయను పఠించి కవిత నేర్చుకొనలేదన్న వాక్యము పూర్తిగా పరాస్తమగుచున్నది.

కే త న

కేతనను గుఱించి వ్రాసిన వాక్యములన్నియు కేతన కృతులను సరిగా చూడక వ్రాసినవే. చూడండి.

'కేతన దశకుమార చరిత్రను చూచిన తర్వాతనే తిక్కన మొదట నిర్వచనోత్తర రామాయణమున చేయని నన్నయస్తుతి భారతమున చేసినాడు'.........
'పూర్వాంధ్ర కవుల స్తుతికి కేతన మార్గదర్శకుడు'
(పుట 28.)

అసలు దశకుమార చరిత్రమున—
'పూర్వాంధ్ర కవిస్తుతియే లేదు'

క. వాక్శా (క్రమపర్ణి) కవితా
మౌకి క (మణితార) హార మండనులగు త
త్ప్రాక్తన సుకవుల నియమా
త్యక్తుల వాల్మీకి కాళిదాసులఁ గొల్తున్
(1—9)

'అని యిష్టదేవతా ప్రార్థనంబును సుకవి చరణాభివందనంబునుం జేసి' అని మాత్రమే యున్నది. ఆంధ్రకవిస్తుతియే దశకుమార చరిత్రమున మృగ్యమైనపుడు 'కేతన పూర్వాంధ్ర కవిస్తుతికి మార్గదర్శకుడు' అనుట 'వంధ్యాపుత్ర న్యాయమునకు లక్ష్యముగా'నున్నది.

'కేతన చూపిన కృత్యవతారికా సంప్రదాయములను చూచియే తిక్కన అనుకరించి, కొంతమార్చి, షష్ఠ్యంతాదులను రచించి తన పద్ధతులను మార్చుకొనెను. నిర్వచనమున లేని పద్ధతులు భారతమున కెక్కినవి గదా.' (పుట 28)

నిర్వచనోత్తర రామాయణమునలేని పద్ధతులు భారతమున కెక్కినప్పుడు, తిక్కన నన్నయ ఘట్టనే అనుసరించినట్లు స్పష్టముగా తెలియుచుండగా, కేతన చూపిన సంప్రదాయమునే తిక్కన యనుసరించినాడని యెట్లు వ్రాసిరో దురూహ్యము. తెలుగున, కావ్యములలో, ఆశ్వాసాద్యంతములు సంబోధనతోడను, విభక్త్యంతములతోడను,[11] రెండు విధములుగా నుండును. తిక్కన, తొలికృతియగు ఉత్తరరామాయణమున—విభక్త్యంత పద్ధతిని పాటించి, ఆవెనుక—నన్నయ భారతము సంబోధనలతో నుండుటచే నా పద్ధతి ననుసరించినాడు. ఈ యనుసరణము నన్నయనుండి గ్రహించినదేగాని కేతననుండి గాదు.

షష్ఠ్యంతములు కేతనను చూచి గ్రహించెననుమాట యసంగతము. షష్ఠ్యంతములు కేతనకు ముందు మల్లికార్జున పండితుని శివతత్త్వసారమున[12]—నన్నెచోడని కుమారసంభవమున గలవు. నన్నయలో షష్ఠ్యంతము లెందుకు లేవో, కుమారసంభవమున నుండుటకు హేతువులేవో వాని నివఱకు చర్చించియే యున్నాను.[13]

తిక్కన భారతములో—నిర్వచనముగా వ్రాయుటను గొప్పగా చెప్పుకొన్నవాడు ఆ పద్ధతిని కూడ మార్చుకొని భారతమున వచనములను 'సమృద్ధిగాను ప్రౌఢముగాను చేర్చినాడు.' (పుట 28.)

ఈ వాక్యముల కర్థమేమి? తిక్కన రచించిన భారతము, విరాటపర్వమునుండి ప్రారంభమైనది. అంతకుముందే నన్నయ, ఆది, సభా, ఆరణ్యపర్వరచన చంపూ పద్ధతిలో నవగా గద్యపద్య మిశ్రితమైనదిగా నున్నది. ఇట్టి సందర్భమున—తిక్కన భారత రచన ప్రారంభించి నిర్వచనముగా రచించిన, అది చంపూ పద్ధతిలోనున్న పూర్వపర్వములతో నెట్లు తుకుకొనునో వీరూహింప లేకపోవుట చిత్రముగా నున్నది! ఏ కావ్యములోనైన కొంత భాగము, గద్యపద్య మిశ్రితమైన చంపూ పద్ధతిలోను, కొంత భాగము, నిర్వచనముగాను నుండునా? ఒకే రీతిలో నుండవలెను.[14] దీనినిబట్టి సమీక్షాకర్తలకు, తెలుగున కావ్యరచనా నిర్మాణము గాని, తత్సంప్రదాయములుగాని యవగాహన కాలేదనుట స్పష్టము.

నన్నయ ప్రారంభించిన భారతముతో సమాన స్థాయిలో నుండుటకు, నాతని పద్ధతి ననుసరించి తిక్కన తాను విరాటాది స్వర్గారోహణము వఱకు భారతమునంతను చంపువుగా రచించియున్నాడు. తిక్కన ఉత్తర రామాయణము నెందుకు నిర్వచనముగా రచియించెనో, నన్నయ భారతమును నెందుకు చంపూ పద్ధతిలో ప్రారంభించెనో వీరికి తెలియదు. రామాయణము మూలముగాని, భారతము మూలము గాని

---

11. విభక్త్యంత రచన, చిన్నయసూరి కాలము వఱకు నున్నదని నా ఉదాహరణ వాఙ్మయమున చూపియున్నాను.

12. శివతత్త్వసారము — ద్వితీయ ముద్రణము—నా విపులపీఠికా పరిష్కరణములతో కృష్ణాపత్రికాధిపతులు ముద్రించినారు.

13. షష్ఠ్యంతముల పుట్టుపూర్వోత్తరము లనుగూర్చి పై నా ఉదాహరణ వాఙ్మయచరిత్ర చూడ నగును.

14. తెలుగున నిర్వచన కావ్యములు వ్రేళ్లపై లెక్కపెట్టదగినవిగా నున్నవి. ఆధునిక యుగమున కొక్కొండ వేంకటరత్నము పంతులుగారి బిల్వేశ్వరీయము నిర్వచన కావ్యములో మకుటాయమానమైనది.

వీరెన్నడూచూచి యుండరు. రామాయణమంతయు, ననుష్టుప్పులో నున్నది. భారతము నందట్లుగాదు. వృత్త వైవిధ్యము, ఉపజాతి వృత్తములు మొదలైనవి కలవు. కావుననే లోకజ్ఞుడును, ఉభయభాషా కావ్య రచనాభిశోభితుడు నగు నన్నయ చంపూపద్ధతిలో భారత రచన ప్రారంభించినాడు. నన్నయకుముందు కన్నడమున పంపభారతము చంపూ పద్ధతినే యున్నది. తెలుగున చంపూ పద్ధతిని ప్రవేశపెట్టుటకై భారతము నన్నయ యీ పద్ధతిలో ప్రారంభించెను. తిక్కనకేకాదు, తరువాత తెలుగు కవులందఱికి, నన్నయ మార్గమే అనుసరణీయమైనది.

తిక్కన నన్నయను పఠించి కవిత నేర్చుకొన లేదుగదా—అంతకన్న విచిత్రము కేతనయు నంతే. అది కేతన తన యాంధ్రభాషా భూషణములో నన్నయను ప్రమాణీకరింపకపోవుటయే.........నన్నయ పేరెత్తడు. (పుట. 28)

ఆంధ్రభాషాభూషణములో 'నన్నయ పేరెత్తడు' అనిగదా యీ పుటలో వ్రాసిరి. కాని వీరే 31 వ పుటలో నేమి వ్రాసినారో చూడుడు.

'తనకుముందు వ్యాకరణమే లేదను కేతన మాట అసత్యములా? 'నన్నయభట్టాది కవిజనంబుల కరుణన్' అన్నవానికి చింతామణిని గుఱించి యొక మాట చెప్పుట కష్టమైనదా.'

'నన్నయభట్టాది కవిజనంబుల కరుణన్' అనునది కేతనది యని వీరే వ్రాసినప్పుడు ముందు 'కేతన నన్నయ పేరెత్తడు'అని వ్రాసినది పరస్పరము విరుద్ధము. పై వాక్యము కేతనదే—పాఠకులకొఱకు పూర్తి పద్యము నిచ్చుచున్నాను.

క. మున్ను తెనుఁగునకు లక్షణ
మెన్నఁడు నెవ్వరును జెప్పరేఁ జెప్పెద వి
ద్వన్నికరము మది మెచ్చఁగ
నన్నయ భట్టాది కవిజనంబుల కరుణన్.'

'అది కేతన తన యాంధ్రభాషా భూషణములో నన్నయను ప్రమాణీకరింపకపోవుటయే'అన్న వాక్యము విచారింతము. దీనినిబట్టి ఆంధ్రభాషాభూషణ మెందులకు రచితమైనదో వీరికి తెలియలేదు. ఆంధ్రభాషాభూషణము వ్యాకరణము—లక్షణగ్రంధము. లక్ష్యమున్నగాని లక్షణ మేర్పడదు. నన్నయభారతభాగము వెలసినతరువాతనే, అది లక్ష్యముగా కేతన వ్యాకరణము రచించినాడు. కేతన వ్యాకరణ లక్షణమునకు నన్నయది లక్ష్యమైనప్పుడు, కేతన నన్నయభట్టును ప్రమాణీకరింపక, వేఱెవరిని ప్రమాణీకరించును? ఇది ఆంధ్రభాషాభూషణమును చదవకుండగానో లేక చదివిన నవగాహనము కాకపోవుటచేతనో వ్రాసిన వ్రాత. ఆంధ్రభాషా భూషణములో సమాసములను గుఱించి చెప్పునపుడు— కేతన

క. 'వాఁడి మయూఖము లనఁగా
వేఁడి పయోధారలనఁగ వింజామర నా
మూఁడస్త్రంబు లనంగాఁ
బోఁడిమి కఱకంఠ నామమున్ బోలి తగున్।

అని లక్ష్యము నిచ్చినాడు. వీనిలో, వాఁడిమయూఖములు, కఱకంఠుడు—ఎక్కడివి? నన్నయ భట్టారకుని భారతములోనివి—

వాఁడిమయూఖములనునది కచునికథలోనిది.

'వాఁడి మయూఖముల్ గలుగు
వాఁడపరాంబుధిఁ జొచ్చె.'
(ఆది—3—112)

కఱకంఠుఁడు — అనునది. కిరాతార్జునీయ ఘట్టములోనిది.

'క. కఱకంఠా! క్షమియింపుము
నెఱి నెవ్వరి కెఱుఁగ నగునె నీ చరితంబుల్'
(ఆరణ్య 1—327)

ఈ యుదాహరణముల వలన పై వ్రాత నిర్మూలమైనది.

ఈ సందర్భమున మఱియొక వాక్యము నుపలక్షింతము.

'తిక్కనవంటివాడు నన్నయను ప్రమాణ బుద్ధితో పఠించి కవిత నేర్చియుండిన కేతన

కా వార్గము పనికి రాకపోయినదా?' (పుట 28) అనగా, తిక్కన భారతము రచించిన తరువాత కేతన దానినిచూచి, అది సరి కాదని వేఱుమార్గమును త్రొక్కినాడని గదా అర్థము. అప్పుడు తిక్కన భారత రచనానంతరమే కేతన ఆంధ్ర భాషా భూషణము రచించినాడన్న మాట. అప్పుడాంధ్ర భాషా భూషణమున తిక్కన భారతమునుండి లక్ష్యముల నేల గ్రహింపలేదు? తిక్కన భారత రచనానంతరమున కేతన యున్నాడని వీరు నిరూపింపగలరా? ఇదియంతయు వీరికి లక్ష్యలక్షణ పరిజ్ఞానము లేదనుటకు ప్రబల ప్రమాణము.

విన్నకోట పెద్దన

కావ్యాలంకార చూడామణి కర్త విన్నకోటపెద్దన స్మరింపలేదట—అయిననేమి. పెద్దన కాలమునాటికి—(క్రీ. శ. 1400 ప్రాంతము) మహాభారతము పూర్తియైన సంగతి సమీక్షాకర్తలకు తెలియక, కవిత్రయములో నొకడైన ఎఱ్ఱనకుముందు విన్నకోటపెద్దనను గురించి వ్రాసినారు. పెద్దనకాలముననే, ఆంధ్రమహాభారతము పూర్తియై నన్నయ ప్రామాణికత స్థిరపడగా, నీ సందర్భమున పెద్దన ప్రసక్తి అప్రస్తుతము—పెదన కేతన వంటి ప్రామాణికుడా?

ఎఱ్ఱన

మహాభారతము – నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలనెడి కవిత్రయ సంప్రదాయ మెట్లేర్పడినదో ఎఱుగని వీరు, ఎఱ్ఱననుగూర్చి వ్రాసినది చూడుడు.

'ఎఱ్ఱన మాత్రము అరణ్యపర్వశేషపూరణమున 'తద్రచనయకా' చేయుటకును అతని సరస సారస్వతాంశను అలవఱచుకొనెను. చక్కని అనుకరణము.'

ఎఱ్ఱనకు నన్నయ యందే ప్రమాణబుద్ధి లేనిచో నాతనినే యెందుల కనుకరింపవలెను అన్న ప్రశ్న వీరికి కలుగనే లేదు. ఎఱ్ఱన నన్నయ ననుసరింపక కవిత చెప్ప లేని యసమర్థుడా? జయంతి రామభట్టు నిర్వచనోత్తర రామాయణమును పూరించినట్లు తాను స్వంతముగ నరణ్యపర్వశేషము రచించి, తన గద్యతోడనే వెలయించెడి వాడు—అట్లుగాక, ప్రత్యక్షరము నన్నయ ననుసరించి రచించి తుదకు గద్యకూడ నాతని పేరనే వ్రాయుటచేత—నన్నయ ప్రామాణికతను గూర్చి ఎఱ్ఱన కెంత ప్రత్యయమున్నదో మనకు తెలియగలదు. అంతే కాదు నన్నయ తిక్కనల నతడెట్లు స్తుతించినాడో చూడుడు.

ఉ. భాసుర భారతార్థ బహు
 భంగుల నిక్కమెఱుంగ నేరమిన్
గాసట బీసటే చదివి
 గాథలు త్రప్పు తెలుంగువారికిన్
వ్యాసముని ప్రణీత పర
 మార్థము తెల్లగఁ జేసినట్టి య
బ్జాసన కల్పులం దలఁతు
 నాద్యుల నన్నయ తిక్కనార్యులన్
 (నృసిం. 1—10.)

నన్నయ తిక్కనల నబ్జాసన కల్పులని చాటినాడు. నృసింహపురాణముననందే, 'నన్నయ భట్ట తిక్క కవినాథుల కెక్కిన భక్తిపెంపునన్' అని తాత చెప్పినట్లుగా వ్రాసి యున్నాడు.

(1—15)

నృసింహ పురాణముననేగాక—హరివంశమున నన్నయ తిక్కనల ప్రశంసలు చూచిన — నన్నయ తిక్కనల భారతమున కెఱ్ఱన నాటి కెట్టి ప్రామాణ్యత వహించినదో తెలియగలదు.

'నన్నయభట్టు తిక్కకవినాథులు చూపిన
త్రోవ పావనం బెన్న'

అని, నన్నయ తిక్కన కవితా పథకమును పేర్కొని వారిని ప్రత్యేకముగా పద్యములతో నిట్లు స్తుతించినాడు. కవిస్తుతిలో, నన్నయనుగూర్చి, తిక్కనను గూర్చి వేర్వేఱుగా పద్యములు వ్రాసిన వారిలో ఎఱ్ఱనయే ప్రథముడు.

నన్నయ

ఉ. ఉన్నత గోత్ర సంభవము
 నూర్జిత సత్త్వము భద్రజాతి సం

పన్నము నుద్ధతారి పరి
భావి మదోత్కట మున్నరేంద్ర పూ
జోన్నయ నోచితంబు నయి
యొప్పెడు నన్నయ భట కుంజరం
బెన్న నిరంకుశోక్తి గతి
నెందును గ్రాలుట ప్రస్తుతించెదన్.

(పూ. భా. 1—8)

ఈ పద్యమున నేనుగుతో నన్నయను పోల్చుటచే, నన్నయయే, ఆంధ్రకావ్యరచనకు ప్రారంభకుడనుమాట నిర్వివాదమైనది. నన్నయ కవిత మత్తేభగమనము కలదని కొందఱు విమర్శకులు తలచిరి. అది యెంతమాత్రము సరికాదు. ఏనుగు నడచిన దారిని మఱి యే యితర జంతువు నడచినను ఆ మార్గములో నంతర్భూత మగుచుండును.

'జంతు పదము లెల్ల దంతి పదంబులో
నడఁగు క్రియ' (భార. శాంతి. 5—135)

అనగా నన్నయ కవితామార్గము ననుసరించి తరువాతి కవులందఱును పయనించిరి. అతడే మార్గదర్శకుడు అని యర్థము.

తి క్క న

మ. తను కావించిన సృష్టితక్కు
రులచేతం గాదు నా, నే ముఖం
బునఁ దాఁబల్కిన బల్కు లాగ
మములై పొల్పొందు నావాణి న
త్తను నీతఁడొకరుండు నాఁజ
ను మహత్త్వప్తిన్ గవి బ్రహ్మనా
వినుతింతుఁ దగ తిక్కయజ్వ
నిఖిలోర్వీ దేవతాభ్యర్చితున్—

(హరి. పూ. 1—9)

తిక్కనను కవిబ్రహ్మగా నుతించిన ప్రథమకవి యెఱ్ఱనయే. ఎఱ్ఱనచేసిన పై నన్నయ తిక్కనల కవిస్తుతులను బట్టి ఎఱ్ఱన కాలము నాటికి నన్నయ ప్రామాణికత సుప్రతిష్ఠిత మగుటయేగాక, తిక్కన భారత రచనతో, భారతము తర్వాతి వాఙ్మయమునకు కవులకు నుపజీవ్యమై భాసించినది. దీనినిబట్టి శ్రీనాథుని కాలమువఱకు నన్నయ ప్రామాణికత సిద్ధింప లేదను మాట నీళ్లమూటయైనది—

కవిత్రయ సంప్రదాయము

ఎఱ్ఱనతో కవిత్రయ సంప్రదాయ మాంధ్ర వాఙ్మయమున నవతరించినది—అరణ్యపర్వశేష రచన చేతనే గాక, భారత ఖిలపర్వమగు హరివంశ రచనము చేనతనికి కవిత్రయమున స్థానము లభించినది [15] దానితో కవిత్రయ సంప్రదాయ మేర్పడినది.

ఈ సందర్భమున వీరు వ్రాసిన వ్రాతచూడుడు - 'ఎఱ్ఱన మాత్రము అరణ్యపర్వశేష పూరణమున...... బలపఱచుకొనెను. చక్కని యనుకరణ అట్లుండియు వెను వెంటనే కవిత్రయ ప్రామాణికత యేర్పడినట్లు కాన రాదు' (పుట 30) ఎఱ్ఱన వెను వెంటనే కవిత్రయ ప్రామాణికత యేర్పడలేదనుట నిరాధారము.

ఎఱ్ఱనకు వెనుక, ముప్పది నలుబదేండ్లకే కవిత్రయ ప్రామాణ్య మేర్పడినది. క్రీ. శ. 1370 ప్రాంతమున నున్న జక్కన, తన విక్రమార్క చరిత్రమున, నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలనుమాత్రమే స్తుతించి, కవిత్రయ స్తుతికి నాందీ ప్రస్తావన గావించినాడు.

న న్న య

ఉ. వేయి విధంబులందుఁ బది
వేవురు పెద్దలు సత్ప్రబంధముల్
పాయక చెప్పిరిట్లు రస
బంధుర వాగ్విభవాభి రామ ధౌ
రేయులు శబ్దశాసన వ
రేణ్యులు నాఁగఁ బ్రశస్తి కెక్కిరే

15. కవిత్రయమున నెఱ్ఱనకు నెట్లు స్థానమేర్పడినదో, ఆవిషయ మంతయు—'తెలుగుకవుల చరిత్ర 'తిక్కన—ఎఱ్ఱనల యుగము' అను నా గ్రంథమున పూర్తిగా వివరించినాను. అది అముద్రితము. చూ. పరిశోధన సంచిక—జూన్—జులై 1956. కవిత్రయం—ఎఱ్ఱనపెట్టిన పద్ధతి—38—46 పుటలు.

నే యెడ నన్న పార్యుగతి
నిద్ధర? నట్టి మహాత్ముఁ గొల్చెదన్
(1–12)

తిక్కన

చ. పరువడి భారతాఖ్య గల
పంచమ వేదము నాంధ్రభాష సు
స్థిరత రచించుచోఁ గృతి ప
తిత్వముఁ గోరి ప్రసన్నుఁడైన యా
హరి హరనాధుచేఁ బడసె
నవ్యయ సౌఖ్యపదంబు నెవ్వఁడా
పురుషవరేణ్యుఁ దిక్కకవిఁ
బూని నుతింతుఁ గృతార్థవరోత్సవున్
(1–13)

ఎఱ్ఱన

ఉ. ఈ త్రయిఁదాఁ ప్రబంధ పర
మేశ్వరుఁడై విరచించె శబ్దమై
చిత్ర నరణ్యపర్వమున
శేషము, శ్రీ నరసింహ రామ చా
రిత్రములున్ బుధవ్రత గ
రిష్ఠత నెఱ్ఱయశంభుదాసుఁడా
చిత్రకవిత్వ వాగ్విభవ
జృంభితుఁ గొల్చెద భక్తియుక్తితోన్.
(1–14)

నాటినుండి కవులందఱును కవిత్రయమును స్తుతించియే యున్నారు. శ్రీనాధుడు, అనంతుడు, కొఱవి గోపరాజు, నిశ్శంక కొమ్మన, పిల్లలమఱ్ఱి పిన వీరభద్రుడు, నందిమల్లయ ఘంట సింగయకవులు— కవిత్రయమును స్తుతించిన వారే—వీరందఱు శ్రీనాథ యుగమువారు. శ్రీనాథయుగము వెనుక కృష్ణరాయ యుగమున, అల్లసాని పెద్దన, చింతలపూడి ఎల్లన, మాదయ్య గారి మల్లన, శంకరకవి, పింగళి సూరన మొదలగు కవులు కవిత్రయమును పేర్కొన్నారు.

ఆ స్తుతు లిచ్చట పేర్కొనినచో గ్రంధ విస్తరభీతియగునని విరమించితిని.

అనగా క్రీ. శ. 1600 ప్రాంతమునకే— భారత కవిత్రయ ప్రామాణ్యము స్థిరపడినది.

ఇట్లుండ వ్యాసకర్తలు—'అట్లుండియు వెను వెంటనే కవిత్రయ ప్రామాణికత ఏర్పడినట్లు కాన రాదు. ఏలయన పూర్వకవిస్తుతిలో కొందఱు ఎఱ్ఱ నను, కొందఱు అతనివదలి నాచన సోమనాధుని స్తుతించియున్నారు' (పుట 30) అట్లు స్తుతించిన కవు లెవ్వరు? ఒక్క కవిపేరుకూడ చెప్పలేదే? అప్పుడు పైవాక్యమే అప్రమాణికము; అసంగతము.

తరువాత—'ఇంతవఱకు నన్నయకు లేని ఏకైక ప్రామాణికత బాలసరస్వత్యాదులకు తర్వాతనే వచ్చి యుండవలెను—' (పుట 30) అని మఱియొక ప్రతి పాదన—బాలసరస్వత్యాదులు 17 వ శతాబ్దివారు. నేను పైన క్రీ. శ. 1600 వఱకు నంతకుముందు రెండు శతాబ్దులకుపైగా కవిత్రయ సంప్రదాయము నన్నయ ప్రామాణికత— యవిచ్ఛిన్నముగా వచ్చుచున్నదని నిరూపించియే యున్నాను—అప్పుడు పైవాక్య మే మైనట్లు? అసలు నన్నయ ఆంధ్రశబ్ద చింతామణి కర్తృత్వమే వివాదగ్రస్తమైనప్పుడు[16] నన్నయప్రామాణి కత దానివలన ఏర్పడనుటకంటె హాస్యాస్పదమైన విషయము వేఱొకటిలేదు—

నన్నయ శబ్దశాసన బిరుదము

సంశోధితముద్రణ సంపాదకీ యోపోద్ఘాత ములో—'అతనికి శబ్దశాసన బిరుదము కల్గెనని యూహింపవచ్చును' అన్నవాక్యము పురస్కరించుకొని

---

16. ఆంధ్రశబ్ద చింతామణి నన్నయకృతము గాదని —ఆంతరంగిక, బహిరంగ పరీక్షచేసి సోపపత్తిక ముగా నిర్ధారణ చేసితిని. చూడుడు 'నన్నయవాగను శాసనుడా' అన్న నా వ్యాసములు—

1. భారతి సం. 40. సం. 6. జూన్ 1963. 40–45 పుటలు.

2. భారతి సం. 40. సం. 8. ఆగస్టు 1963 10–14 పుటలు.

వీరును దానిని బిరుదముగానే భావించిరి. కాని శబ్దశాసనుడు అన్నది బిరుదమే కాదు. దీని నిది వరకే నా తెలుగుకవుల చరిత్రమున ప్రామాణికముగా నిరూపించినాను.[17] అది విద్వదామోదము బడసినది. సంగ్రహముగా దెలుపుదును.

(1) నన్నయ, తననుగూర్చి కులబ్రాహ్మణుడు. అనురక్తుడు, అవిరళ జపహోమతత్పరుడు మొదలగు విశేషణములు చెప్పికొన్నట్లే శబ్దశాసనుడు, అనునది యొక విశేషణముగా చెప్పుకొన్నాడుగాని బిరుదముగా చెప్పుకొనలేదు.

(2) శబ్దశాసనుడనునది బిరుదమే అయిన యెడల, అది ఆశ్వాసాంతగద్యయం దుండవలెను. అది అపవాదములేని సూత్రము—నన్నయలో నట్లులేదు గాన బిరుదము కాదు.

(3) నన్నయకు శబ్దశాసన బిరుదమున్నట్లు, తరువాతి కవులెవ్వరును పేర్కొనలేదు. కేతన, తిక్కన, ఎఱ్ఱన, మారన, మంచన, శ్రీనాథుడు మొదలగు ప్రాచీనులేగాక తరువాతివారెవ్వరును బిరుదముగా చెప్పలేదు. తర్వాతి ప్రబంధయుగకవు లంతకంటె చెప్పలేదు.

(4) బిరుదమునకు పర్యాయపదములుండవు. శబ్దశాసనుడనుదానికి, 'వాగనుశాసనుడు' అనునది పర్యాయపదము. కాని నన్నయను వాగనుశాసనుడని క్రీ. శ 1570 లో రామరాజభూషణునికి ముం దే కవియు చెప్పలేదు. వాగనుశాసనుడను పదమే లేనప్పుడది శబ్దశాసన బిరుదమునకు పర్యాయపదమగుట యెట్లును సంభవింపదు.

కావున శబ్దశాసనుడు అన్నది బిరుదుకాదు. అని సిద్ధాంతము.

ఈ సందర్భమున వీరింకొక వాక్యము వ్రాసినారు.

'కవులు గ్రంథములు వ్రాయుచు కొంత ప్రచారము చేయుచు అంకితాంక కావ్యభాగములను చివర వ్రాయుట యలవాటు......ఆంధ్రమహాభారత రచన చేతను, ఒకపాటి ప్రచారముచేతను నన్నయ విపుల శబ్దశాసనుడు.' (పుట 29.)

దీనినిబట్టి మహాభారతము మొదట నన్నయ కృత్యావతారిక లేకుండా, భారతమును రచించి, అది కొంత ప్రచారములోనికి వచ్చినతరువాత కృత్యావతారిక వ్రాసెనని గదా వీరి యభిప్రాయము.

'శబ్దశాసనుడు' అనునది నన్నయకు బిరుదమే కాదు. అదియొక విశేషణము మాత్రమే—ఇది బిరుదమే యైన యెడల నన్నయ, 'అనురక్తు, నవిరళ జపహోమ తత్పరు' మొదలైన విశేషణములతో, విపులశబ్దశాసనుడు—అను విశేషణమును చేర్చినాడు. ఇచట 'విపుల' అను పదము, విస్తృతిని సూచించును.

ఇంతకన్న నజ్ఞాన విలసితమగు విషయము మఱి యొకటి యుండబోదు. మొదటనే భారతరచనకు పూనుకొన్న నన్నయ కృత్యాది నెంతకాలమునకు రచించెను? దానికైన గ్రంథ మారంభించిన తరువాత కొంత భాగము పూర్తియైన వెనుక, కృత్యవతరణిక రచించె ననుకొంద మన్న నది నన్నయ విషయములో నంతకంటె పొసగదు—నన్నయభారతము, హఠాత్తుగా అరణ్యపర్వము 4—132 పద్యముతో నాగినది—అట్టిసందర్భములో నన్నయకృత్యాది నెప్పుడురచించెను? అట్లయిన భారతము కృత్యాదిన నన్నయ—

'దుర్గమార్థజల గౌరవ భారత భారతీ సముద్రము
దరియంగ నీదను విధాత్రునకైనను బోల నేర్చునే'

భారత సముద్రము నీది దరిజేరుటకు— అనగా భారతము తెనుగున రచించి, దానిని పూర్తి చేయుటకు బ్రహ్మకైన తరముకాదు—ఇక నావంటి వానికెట్లు సాధ్యము— అని చెప్పుట యెట్లు తటస్థించినది? నన్నయయే, మొదట భారతము రచించి, తరువాత అవతారిక రచించెనేని, అప్పుడు, ప్రస్తుతము మనకు లభ్యమగుచున్న—అవతారిక నన్నయదికాదని

17. నన్నయభట్టు —(1950) పుటలు—136—143.

చెప్ప వలెను—అది మఱి యెవరిచేత రచింపబడి మూల మునకు చేర్చబడినది?

గ్రంథముల్ వ్రాయుచు, కొంత ప్రచారమైన వెనుక చివర అవతారిక వ్రాయు నలవాటట! అట్లైయిన, మహాభారతమున పదిహేను పర్వములు మొదట రచించి, అది ప్రచారములోనికి వచ్చినతరువాత విరాట పర్వ కృత్యావతారిక వ్రాసి, హరిహరనాథునకు కృతి నిచ్చెనన్నమాట-గ్రంథము పూర్తియైనవెనుక హరహర నాథుడు స్వప్నమున తిక్కనకు దర్శనమిచ్చి, కృతి పతిత్వము నర్థించెను గాబోలు! తెలుగున కావ్యము లన్నియు నీరీతిగానే రచింపబడినవా? పైవిషయ మొక్కటియే సమీక్షాకర్తకు, కావ్యావతారికా సంప్ర దాయము, గహనమైనదని వెల్లడించు చున్నది—ఈపుట లైదును వ్యర్థములు.

పై వ్రాతను గూర్చిన విమర్శ పరకలోకమునకే వదలుచున్నాను—

అనువాద విధానము

సంశోధిత ముద్రణమున—భండార్కరు సంస్థ వారు శ్రీ సూక్థంకరు సంపాదకత్వము క్రింద ప్రక టించిన సంస్కృత భారతమునే గ్రహించినట్లు, అది పర్వ పీఠికలో వివరింపబడినది. మూలమును గ్రహించు టయేగాక, తెలుగున భారతానువాద మెట్లున్నదో నిర్ణ యించుటకు, విషయసూచిక యందే గాక గ్రంథ మధ్య మున నాయాశీర్షికలయందు పర్వ, అధ్యాయ, శ్లోక సంఖ్య లీయబడినవి. ఉదా. విషయ సూచిక.

ఆదిపర్వము—ప్రథమాశ్వాసము.

అవతారిక

భారత కథా ప్రస్తావన	1–1– 8
పర్వాను క్రమణిక	1–2–34
పర్వ సంగ్రహము	1–2–71
గ్రంథమధ్యము —ద్రౌపదీ వస్త్రాప హరణము	1–190– 5
ఆది	
సభా—శిశుపాల వధ	2– 42–21
ఆరణ్య 3 ఆ. నలోపాఖ్యానము	3– 49–29
ఆరణ్య 7 ఆ. యక్షప్రశ్నలు	3–287–20

ప్రస్తుతము ప్రకటితములైన మూడు పర్వ ములను, పైరీతిగా మూలమును సూచించుటయేగాక, యీ సంశోధిత ముద్రణమున—శ్రీ పి. పి. యస్. శాస్త్రి గారి - దాక్షిణాత్య భారత సంహిత (The southern Recension of Mahabharata) అను సంస్కృత భారత ప్రతిని ప్రామాణికముగా గ్రహింపబడినది. నన్నయ అనువాద విధానము గ్రహించుట కిది యెంతయు నుపయుక్తము. ఇదియును, పాఠభేదముల సందర్భ మున చూపబడియేయున్నది. ఇంకను చిత్రశాలా నీల కంఠీయవ్యాఖ్యా ముద్రణములు సూచితములైనవి.

ఇట్లు మూలప్రతులు మూడు విశదీకరింప బడగా, సమీక్షాకర్తలు, పైవానినిగూర్చి యొక్క మాటయైన వ్రాయలేదు. దీనినిబట్టి వీరు, గ్రంథ మునగల పాఠభేదములను గూడ పరిశీలింపనట్లు స్పష్టము. తక్కినవానిమాట యటుండనిచ్చి, మదరాసు లోనే వావిళ్లవారు ప్రకటించిన, 19 సంపుటముల పి. పి. యస్. శాస్త్రిగారి దాక్షిణాత్య భారత సంహితను కూడ చూడకుండుట శోచనీయమైన సంగతి—

సంస్కృత మూలప్రతులను గూర్చి సంశోధిత ముద్రణమున నున్న పైవిషయముల నేమాత్రము స్పృశింపక—1922 లో శ్రీ వేదము వేంకటాచలయ్య గారు ప్రటించిన 'A study of the preliminary Chapters of the Mahabharata to separate the original from the spurious' అను గ్రంథము నుండి 4 పుటలాంగ్ల భాషలోని భాగముల నుదాహ రించి, యీ శీర్షికను పూర్తిచేసిరి ఈ నాలుగు పుట లలో నుదాహరించిన విషయములన్నియు, భండార్కరు సంస్థ ప్రామాణిక ముద్రణముతో నేనాడో గతార్థము లైనవి—అదియునుగాక, పై ఆంగ్లగ్రంథము సమ కాలికముగా 'మహాభారతచరిత్ర'—'మహాభారత మీ మాంస—' మొదలగువ్యాసము లాంధ్రసాహిత్య పరి పరిషత్పత్రికలో ప్రకటితమైనవని వీరెఱుగరు— వానియందీ యాంగ్లగ్రంథ మునగల విషయములన్నియు

గలవు—భారత పరిశోధకులకు పరిచితమ్మైనవే-- అట్టి సందర్భమున—నీనా డా గ్రంథము నుదాహరించుట వలన ప్రయోజనము శూన్యము—ఇంతకు నీవిషయము ప్రస్తుత సమీక్షకు సంబంధించినది గాదు—ఏలననగా, సమీక్షకు సంబంధించినదైన మూల సంస్కృత వివరణము గాని, పాఠభేదములను, మూలముతోనెట్లు సమన్వయించి నిర్ణయించుట అను విషయముగాని ఇందుండ వలెను. కాని ఆవివరము లేవి యిందులేవు. అందువలన నాలుగుపుటలు వ్యర్థములు—

పాఠనిర్ణయము - పూర్వముద్రితములు

సంశోధిత ముద్రణమున పాఠనిర్ణయములను గూర్చి వ్రాయుచు పూర్వ మముద్రితగ్రంథ చింతామణిలో కీ. శే. వేదము వేంకటరాయ శాస్త్రిగారు చర్చించిన యీ క్రింది రెండు పాఠములను గూర్చి వివరము లిచ్చినారు.

1. 'మ. ధృతరాష్ట్రుండును బుత్రులు న్వ
నము గుంతీ నందనుల్ సింహముల్
మతి నూహింప న సింహమ్మైన
వనమున్ మర్దింతు రెందు న్వనా
వృత వృత్తంబులు గాని సింహ
ములకు న్వేగంబు చేటొందు గా
న తగం బొందుట కార్యమీ యు
భయమున్ సంతుష్టిమ్మై మన్కికిన్.

ఇందు నాల్గవ పాదమున 'కాన తగం బొందుట' అనుచోట ప్రాసలో కాన, కళయా, ద్రుతమా అని వివాదము.

2. క. కవ దొనలును గాండీవము
నవల నిడంబనుపు ముందఱ రదముడిగు మే
న(ను) విదపడిగి యొద శుభకర
మవు నిన్విధమట్లు సేయు మనుడు నతండున్.

ఇందు మూడవపాదమున — ప్రాసలో ఏన విదప యా ఏను బిదప యా అని వివాదము—

సమీక్షాకర్తలు వీనికొఱకు నాలుగుపుటలు (32–36) వెచ్చించి, అముద్రితగ్రంథ చింతామణి నుండి యథావాత్తుకముగా నుద్ధరించినారు. కాని పై రెండు ప్రాసలును ప్రస్తుతము తాము సమీక్షించు చున్న భారత భాగమునకు సంబంధించినవా, కావా, అను నంశము చూచుకొనలేదు. పై వివాద ప్రాసలు గల పద్యములలో నొకటి.

'ధృతరాష్ట్రుండు...
...............కా
న తగన్'

అనునది ఉద్యోగపర్వము 1 ఆ—359 పద్యము.

రెండవది—కవ దొనలును...
....ఏ
నువిదప ..అనునది శల్యపర్వము.
2 ఆ–333 పద్యము.

సమీక్షాగ్రంథమున ఆది,సభా, ఆరణ్యపర్వములు మాత్రమే గలవు. పై పద్యము లుద్యోగ శల్యపర్వములకు సంబంధించినవి — సంశోధిత ముద్రణమున తాము ప్రకటించిన పద్యములకు సంబంధించిన పాఠములనే సంపాదకవర్గము చర్చింతురుగాని ఇతర పర్వములలో నున్న పాఠముల నెప్పుడును చర్చింపరు ఇంతకు, 'కాన తగన్, ఏనువిదప'అను నిట్టి సంధిగత ప్రాసలు నన్నయ భారత భాగమున గాని, ఎఱ్ఱనలోగాని లేవు. అట్టివి యుండిన గదా, ఇతర పర్వములలో పాఠములు చర్చించుట? అట్టివి లేనప్పుడు వాని ప్రసక్తి ప్రస్తుత ముద్రణమున రానే రాదు. ఉద్యోగపర్వ సంశోధిత ముద్రణము గాని శల్యపర్వ సంశోధిత ముద్రణముగాని వెలువడినప్పుడు, చూపవలసిన పాఠభేదచర్చలను, నీ సమీక్షయందు వివరించుటచే నీ నాలుగు పుటలు వ్యర్థములైనవి.

ఈ శీర్షిక యందే మఱియొక విషయము.

'ఇక వారు (వేదము వేంకటరాయశాస్త్రిగారు) సూచించిన పాఠములు సవరణలు కొల్లలుగానున్నను స్మరింప లేదు. ఒకటి రెండు ఉదాహరణములు—అని (1) రూఢి—రూడి, (2) ఇంబుగ సర్వ లోక—ఇమ్ముగ సర్వలోక అను రెండు పాఠములను

వివరించినారు. ఈ రెండింటిలో ఇంబుగ—ఇమ్మగ అన్నది వేంకటరామశాస్త్రి గారు సూచించిన పాఠమా? వా రుదాహరించిన అ. గ్ర. చింతామణిలోనే — అది పత్రికాధిపతి సూచించినట్లుగా నున్నది. చూ. అ. గ్ర. చింతామణి.[18] పుట 10—అందే యిట్లున్నది.(1902)

'ప్రక్రియాఛందస్సున యతిప్రాసముల కుదాహరణములని యిట్లు వ్రాయబడి యున్నది.

'అంబకు మ్రొక్కి నా కలవడినట్లు
ఇమ్మగా యతి కుదాహృతులు సెప్పెదను

అని వ్రాసియున్నారు' అ. గ్ర. చింతామణిలో పై రీతిగా 10 వ పుటలో స్పష్టముగా నుండగా, సమీక్షా కర్తలు—ఉదాహరణములని (ఇది వేదము వేంకటరాయ శాస్త్రిగారిది అని వేంకటరాయశాస్త్రిగారిపేరు చేర్చినారు.) ఇట్లు ప్రాతప్రతికలలోని యంశము లుదాహరించునప్పుడు యథామాతృకముగా నుద్ధరింపవలెనే కాని, క్రొత్తగా విషయములు చేర్చిన లోకవంచన యగును.

అ. గ్ర. చింతామణిలో 5 నుండి 8 పుటల వఱకు గల భాగమంతయు నిందుద్ధరింపబడినది. అచ్చుటచ్చుట కొన్ని పంక్తులు విడువ బడినవి.

ఈ భాగమైన తరువాత 34 పుటలో నిట్లున్నది.

'తర్వాత తాతగారి పాఠమును శ్రీ కొక్కొండము వేంకటరత్నము పంతులుగారు అంగీకరించినారని శ్రీ పూండ్లవారు 38 వ పుటలో తెలిపినారు' ఈ 38 వ పుట 1, 2 సంచికలలోదేనా? అందు 28 పుటలే గలవు. ఇది 3-4-5 సంచికలలో నున్నది—

ఈశీర్షిక ప్రయోజనము సమీక్షాకారులు తమ తాతగారిని గూర్చి ప్రశంసించుటకుగాక. వేతేమియు లేదు—కేవలము వ్యక్తిగతములైన నిట్టి యప్రస్తుత ప్రశంసలు సమీక్షలలో నుండుట యసంగతము—

అ. గ్ర. చింతామణి మయూఖములలో తప్పు—వేంకటరాయ శాస్త్రిగారు వేఱుగా వ్రాసిన భారత పాఠములనుగూర్చి వీరిచ్చుటను తెలుపలేదు—అటు తెలుపక పోవుటచే నీ శీర్షిక పుటలపెంపకము కొఱకని యెఱుంగునది—

అప్రసక్త విషయములు

ఆగస్టు సంచికలో 39 వ పుట—చిల్లర విషయములు అన్న శీర్షికనుండి 41 పుట వ్యాసము చివఱవఱకు వ్రాయబడిన విషయములన్నియు గ్రంథ సమీక్షకు సంబంధించినవికావు. అవి రెండవ సంపుటమునగల పీఠికకు సంబంధించినవి—సమీక్షించవలసినది గ్రంథము గాని గ్రంథపీఠికలు గావు — పీఠికలో మూలగ్రంథములో నిచ్చిన పాఠభేదములను గూర్చి ప్రసక్తియున్నచో పీఠికకూడ విమర్శింపవలసినదే—అందా ప్రసక్తియే లేనపుడీ పుటలును నిష్ప్రయోజనములైనవి—

యతి ప్రాసలు

సమీక్షాకర్తలకు యతిప్రాసలనుగూర్చి పరిజ్ఞాన మెట్టిదో వ్యక్తపఱచుటకు నీ క్రింది యంశము నుదాహరించి, వ్యాసము ముగించు చున్నాను.

కపిలగడ్డము - కవిలగడ్డము

ఈ శబ్దములలో, ప, వ ప్రాసనుగూర్చి చర్చించు సందర్భమున నిట్లు వ్రాసిరి.

'.........సీతారామాచార్యుల వారు వబప్రాసమునే యెఱింగియుండిన 'వేవణములు'అని వాదేశమో, వేబణములు అని బాదేశమో యెట్లు నిర్ణయించుకొందురు? రెండు నశాస్త్రీయములే గదా'అని నిర్ణయించియేయుండిరి...కావున భారతమున గల పైపద్యములో నున్నట్టిది వప్రాసము గాదు గాన దానిని వప్రాసముగా నెఱుంగునది (పత్రికాధిపతి.)

---

18. అ. గ్ర. చింతామణి అనునది 'అముద్రిత గ్రంథచింతామణి'అను నామమునకు సంగ్రహరూపము,

అప్పకవి దీనిని విశేషవళులక్రింద పరిగణించి నాడుగదా (పుట 37. ఆగస్టు భారతి.)

'వళి' యనగా యతి— పై వ, ప విషయము ప్రాసకు సంబంధించినది. అప్పకవి యిట్టి ప్రాసను వళిగా పరిగణించినాడా? అప్పకవీయము చూడుడు. పుట 135.

వి శే ష వ ళు లు

గీ. ప్రౌఢకవులు కొందఱు జ్ఞకారంబునకును
ప్రథమ వర్గంబు తొలి యక్కరములు నాల్గు
నిడుదురు ప్రబంధముల నొక్కయెడ విశేష
వళులనుచు సోమయాజులు వాడు కతన—

శాంతిపర్వమునందు.

క. జ్ఞానము కేవల కృప న
జ్ఞానికి నుపదేశవిధిఁ బ్రకాశము సేయం
గా నది సకల ధరిత్రీ
దానంబున కంటె నధికతర ఫలద మగున్.

(4—255) అప్ప. 3—57.

పై జ్ఞ—క యతిని అప్పకవి స్పష్టముగా, యతిభేదములలో విశేషవళిక్రింద వర్గీకరించి లక్ష్య లక్షణముల నిచ్చినాడు - ఇది యర్థముగాక, సమీక్షాకర్తలు 'అప్పకవిదీనిని (ప వ ప్రాసమును) విశేషవళి క్రింద పరిగణించినాడుగదా' అని వ్రాయుటయెట్టిదో పాఠకలోకమే నిర్ణయింప గలదు.

యతి యనగానేమో ప్రాసయనగా నేమో తెలియని సమీక్షాకర్తలు—సంశోధిత మహాభారత ముద్రణమునకు పూనుకొనిన విజ్ఞత కూడ యెట్టిదో ప్రాజ్ఞులు తెలుపుదురుగాక—



శివోదయం!

శ్రీ కళాధర్

విమలైశ్వర్య విముగ్ధ శుద్ధ హృదిలో
వెల్గొందు చైతన్య దీ
పమవై, తూగు నిషా ఉషోదయములో
భాసించు లావణ్య జీ
వమవై, నిష్మదీయమౌ కవితలో
స్పందించు నాంతర్య గా
నమవై, భావ మనల్ప కల్పనమువై
నర్తించు విశ్వేశ్వరీ.

శిలలౌ గుండెల దిద్దితీర్చు యులివై,
శీతాంశు రేఖావళిన్
అలలౌ కన్నుల దోచునట్టి కళవై,
అందాల భావాలకున్
నెలవౌ నాయెద పిండునట్టి కలవై,
నీ యొక్కలే నవ్వు సం
జలు, నౌరా! విరబూసె దీవు చెలివై
సమ్మోహనత్వమ్మునన్.

ఇలలో నింగి వినీల నీలిమములో
నిచ్చోట నేనున్న లో
గిలిలో దూరపుకొండ సానువులలో
గిరిగంటి నాజూకులో
యలలో వీచెడి మత్తు తెమ్మెరలలో .
నాత్మీయ బంధాల తీ
వెలలో బూచెడి రాగమంజరులలో
వీక్షింతు నిన్నే సఖీ.

విధిగా జీవనమందు బారు నదిగా,
ప్రేమార్ద్ర తా వారి సా
రధిగా, మానవ మానవత్వ నిధిగా,
ప్రారబ్ధ దుఃఖాబ్ధివా
రధిగా, భావము నిత్య నూతనముగా
ప్రాప్తింపగా జేయు నో
షధిగా, నీవు వెలుంగు హృత్ప్రమిదగా,
సాహిత్యమున్ మెచ్చెదన్.

కలుగున్ సొచ్చిన గుండెలున్ వెలికిరా
కావ్యమ్ములో తీపిగా,
పులుగుల్ మానవ నైజముల్ యెగసిరా
పూబాలలో వెల్గగా,
అలుగున్ నాటెడు ద్వేషముల్ యణగి రా
నాంతర్యమున్ ప్రేమగా,
నలుగుల్ బెట్టెడి ప్రేయసీ, కదలిరా
నాలోని భావమ్ముగా.


మరులన్ బాయుచు, క్రమ్ము చీకటులలో
మార్గమ్మువై — వెల్గ మి
ణ్గురులన్ గీయుచు, జీవ మంఝురుల లో
క్రొన్నాకవై — క్రాంతి తె
మ్మెరలన్ సాగుచు, భాస్కరోదయము లో
మేల్కొల్పువై — ప్రేమ తా
మరలన్ విచ్చుచు, మా యెదన్ యెపుడు లో
మాధుర్యమై నిల్తువో.

నిలిచీ, రమ్మని సైగజేసి పిలిచీ,
నీ యొక్క చూపున్ ననున్
గెలిచీ, లో విరహమ్ము జిమ్మ తొలిచీ,
కేళీవిలాసిన్ హృదిన్

శివోదయం!

మరిచీ, అందు స్వరాల మాల మెరిచీ,
మాధుర్యమే నీవయ్యె
వెలసీ, 'ఎవ్వంగా చెప్పకో' అనెదవే!
వేయేల నా దానవే.

హృదయం బెప్పుడు నిల్చి యభ్యుదయమున్
ప్రేమించునో, యప్పుడా
హృదయం బందు నవోదయంబగు - మమున్
హేలాగతిన్ జేర్చు నా
యుదయం బెప్పుడు నిల్చి స్వార్థత మమున్
యోడించునో, యప్పుడా
యుదయం బందు శివోదయం బగు సఖీ,
యుత్తేజమే నీవయ్యె !



బాలవ్యాకరణ ఘంటా పథ వ్యాఖ్యా పరిశీలనము

శ్రీ శలాక రఘునాథ శర్మ

ఆంధ్రభాషా వ్యాకరణములలో బాలవ్యాకరణము నకుఁ గల స్థాన మద్వితీయమైనది. సూత్ర నిర్మాణము, ఉదాహరణ ప్రదర్శనము, విషయ సంగ్రహ ణము, తన లక్ష్యము మేరకు సమగ్రత మున్నగు విషయములలో చిన్నయసూరి అసమాన ప్రతిభా పాటవ మును ప్రదర్శించెను. కావుననే పుట్టిన స్వల్పకాలము లోనే యీ గ్రంథము తెలుగు భాషా బోధన రంగమున అపరిహార్యమైన స్థానము నాక్రమించు కొనినది. అంతియకాక ఇప్పటికి ఈ గ్రంథముపై సంస్కృ తాంధ్ర భాషా సాహిత్య తత్త్వనిపుణులగు పండితు లైదారుగురు చక్కని వ్యాఖ్యానముల సంతరించిరి. దీనిని బట్టియు ఈ గ్రంథప్రాశస్త్యము సువిదిత మగు చున్నది. ప్రస్తుతము ముద్రితములై లభ్యము లగు చున్న వ్యాఖ్యానములలో కడపటిది శ్రీ వంతరాం రామకృష్ణారావు గారు వ్రాసిన ఘంటాపథ వ్యాఖ్య. వారు వ్యాకరణశాస్త్రమున అభినివేశముగల కొలఁది మంది పండితులలో ఎన్నిక గన్నవారు. వారి ప్రయోగ పరిశీలనాదక్షత వారందందు ప్రకటించిన వ్యాసము లలో గోచరించును. వ్యాకరణమున కీలక ఘట్టము లలో పరిష్కారముల నొనర్చుటకు ప్రయోగ పరిశీల నము అతి ముఖ్యమైనది. వీరందు కృతకృత్యులయిన పండితులు.

వీరి ఘంటాపథ వ్యాఖ్యానము చిన్నయసూరి హృదయము నావిష్కరించుటలో, అధ్యేతలకు నిరా ఘాటముగా విషయప్రవేశమును గలిగించుటలో, సందిగ్ధాంశము లందు నిర్ణయములను సూటిగా ప్రతి పాదించుటలో సార్థకనామమైనది.

వ్యాకరణమున రూపనిష్పత్తి క్రమము చాల ముఖ్యమైనది. ఇదియొక శాస్త్రము కనుక, ఎట్లో సరిపుచ్చుకొంద మనుటకు వీలు లేదు. పూర్వాపర వైరుధ్యము, పరిభాషా వ్యతిరేకత మున్నగు దోషములు సర్వథా పరిహరణీయములు. ఈ విషయమున నీ వ్యాఖ్యా నము మిక్కిలి మెలఁకువతో వ్యవహరించినది. ద్రుత ప్రక్రియ, సమాస ప్రక్రియ, తద్ధితరూప నిరూప ణము మున్నగు విషయములలో పై విషయము మనకు చక్కగా గోచరించును. అట్లే క్రియా పరిచ్ఛేదము నందలి రూపసాధనములో పాఠకులకు కలుగు క్లేశము నీ వ్యాఖ్య దూరీకరించును.

మఱియు నీ వ్యాఖ్య కేవల విషయప్రతిపాదనము నందు మాత్రమే తృప్తిగొనక పూర్వవ్యాఖ్యల పొర పాటులను నిశితముగా విమర్శించి పాఠకులను భ్రమ ప్రమాదములనుండి మరలించుటలో కృషిచేసినది. ఈ విషయమున దీనికి పూర్వవ్యాఖ్యలలో సన్నిహితమగు రమణీయము మార్గదర్శక మన వచ్చును. విషయ వివరణము దిఙ్మాత్రముగాఁ గాక అవసరమైనంత విస్తృతముగా చేయఁబడినది. సంస్కృత పరిభాషా సమన్వయము అవసరమైనంతవఱకుఁ గావింపఁబడినది. సందేహములున్న తావులందు చాలవరకు కార్యకారణ నిరూపణ మార్గమున యోగ్యములైన పరిష్కారము లొనర్పఁబడినవి. వర్ణనాత్మక వ్యాకరణములలో ఎట్లో రూపమేర్పడిన చాలదు. సరియగు సూత్రము, క్రమము అనునంశములు ముఖ్యములు. తన్నిరూపణమున నీవ్యాఖ్య ప్రశస్తపథము నవలంబించినది. ఇట్టిది వ్యాకరణ

లక్ష్య సాధనమున పాఠకునకు రాజమార్గముగా నున్న దనుటలో సందియములేదు.

అయినను ఇందు విమర్శనీయములగు నంశములు కొన్నిగలవు. ఇది శాస్త్ర విషయమగుటచే విషయ నిరూపణములో పాఠకునకు సత్యము ప్రతిపాదింపఁబడనియెడల నాతఁడందు భ్రమప్రమాదములకు లోనగుట తటస్థించును గావున ఈ వ్యాఖ్యాత యందు నాకున్న వైయక్తికమైన గౌరవమున కే మాత్రము భంగము కలుగని పద్ధతిలో నిందలి యంశములు కొన్ని యిట పరిశీలింపఁ బడుచున్నవి. ఒక విధముగా, దీనిని పరిశీలించుట యన్న, తక్కిన వ్యాఖ్యలను పరిశీలించినట్లే యగును. ప్రస్తుత మా యంశములను ప్రకరణ క్రమము ననుసరించి పరిశీలింతును.

1. 'య ర ల వలు లఘువులని యలఘులని ద్వి విధంబులు' (సంజ్ఞ 18. సూ) అనుసూత్ర వ్యాఖ్యలో విశేషాంశములలో నిట్లుగలదు. 'అలఘుళకారమునకు, వర్ణసమామ్నాయమందలి ళకారమునకు భేదమేమి? అని కొందఱు శకింతురు. అలఘుళకారము దంత్యము. ఇది లకారము నలఘువుగాఁ బలుకుటచే నేర్పడును. శబ్ద సిద్ధ ళకారము మూర్ధన్యము' (పు. 19) సూరిచెప్పిన అలఘు లకారము దంత్యముగా ఉచ్చారణ దక్షులచేతను ఉచ్చరింపఁబడుచున్నట్లు తోఁపదు. సహజ ళకార, అలఘు లకారములకు లిపిభేదములేనట్లే, ఉచ్చారణ భేదము కూడ వినికిడిలో లేదు. ఏళులు, పాళులు మున్నగు వానియందు దానిని మూర్ధన్యముగనే ఉచ్చారణాభినివేశము గలవారు సయితము పలుకుదురు. కేవల సూత్రసమర్థనమునకై నేఁడు ఉచ్చారణములో భేదమును తేఁజాలము. కనుక 'ళ' మూర్ధన్యము, అలఘువు, ల—దంత్యము లఘువు. లకారమున కే మాత్ర మలఘుత్వము కలిగినను నది మూర్ధన్యముగ నుచ్చరింపఁబడుటయే అనుభవసిద్ధ విషయము—అని సామాన్యాకారముగ చెప్పుటకు వీలుగలదు. అయినచో దీనిని వర్ణాంతరముగ పరిగణింపఁ బనిలేదు కదా! యన్నచో తక్కిన వర్ణములకంటె దీనికొక విశేషము గలదు. తక్కిన య, వ, ర అను వాని లఘ్వలఘు భేదములకు స్థాన భేదములేదు. ఈ వర్ణమునకుమాత్రము కన్పట్టుచున్నది. దానిని సూచించుటకై యిది వర్ణ సమామ్నాయమున వర్ణాంతరముగ పరిగణింపఁబడినది. సూరి యీ యభిప్రాయమును సమ్మతింపక స్థాన భేదమును బట్టి శబ్ద సహజ ళకారము లఘ్వలఘు లకారములకంటె భిన్నమైన వర్ణాంతరముగా పరిగణించి, యాదేశరూపమైన దానికి అలఘుత్వమును సంభావించెను. ఆ తాత్పర్యముతోడనే ఉచ్చారణమునందును, లిపి యందును నే మాత్రము భేదము లేని అలఘు లకార సహజ ళకారములను భిన్నవర్ణములుగా భావించి యుండు ననుట సముచితము. మఱియు ళకార మాదేశమగు మూడు వర్ణములలో రెండు మూర్ధన్యములు. దానిని బట్టికూడ నాదేశ ళకారము మూర్ధన్యమే యనుట యుక్తము. మఱియు ద్రావిడ భాషా బహువచన ప్రత్యయమగు కళు, గళు, ళు, ళ్ అను వాని యందలిది మూర్ధన్యమే యనుట గుర్తించినచో తెలుగునఁడల రల కాదేశమైన ళకారము కూడ మూర్ధన్యమే యగు ననుట స్పష్టమగును. ఒకవేళ దానిని దంత్యముగనే భావింప వలయు నన్నచో కొన్ని ప్రాంతములం దనాగరకులలో గల 'ఊల్లు'వంటి యుచ్చారణ శైథిల్యమును వ్యాకరణ మంగీకరించినట్లు చెప్పవలసి వచ్చును. ఈ కారణములను బట్టి, ఈ వ్యాఖ్య నిర్దేశించినట్లు అలఘు లకారము దంత్యమనుకొనుట పొసఁగదు.

(2) బాల. వ్యా. సంధి. 39 వ సూత్రము 'అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచోఁ గానంబడియెడి' అనుదాని వ్యాఖ్యలో విశేషము లందు 'కెంపు పూవు శబ్దముల కన్యముల ధర్మములు లేవు. ఇవి ప్రాంతాదులలోఁ జేర్పఁబడియుండుటచేతను, నన్యములలోఁ జేరవు. కొందఱు వీని నన్యములలోఁ జేర్పవగు నని సెలవిచ్చుట సరికాదు.' (పు. 71) అని కలదు. కేవలములగు కెంపు, పూవు శబ్దముల కన్యముల ధర్మములు లేనిమాట నిజమే. ఒకానొక శబ్దము పరమగు నపుడు మాత్రము వీనికా ధర్మము లన్నట్లు నిర్ణయింపక తప్పదు. రమణీయ వ్యాఖ్యలో 'కెమ్మోవి, పుప్పొడి

మున్నగు రూపముల కీ సూత్రమే సాధకముగాఁ గన్పట్టును' (పు. 233) అను వాక్యము కన్పట్టును· ప్రస్తుత వ్యాఖ్యా వాక్య మీ రమణీయ వాక్యమునే సరి దిద్దునదియైన యెడల ఆ రూపముల సాధనమార్గము నీ వ్యాఖ్య చూపి యుండవలసినది. **ప్రోతాది శబ్దము** లలో దేనికైన పరుషములు పరములగునపుడు నుగాగమము వచ్చును. కొన్ని యెడల నుగాగమము, కొన్ని యెడల మీఁది హల్లునకు ద్విత్వమును వచ్చుట క్రొత్తశబ్దమునకు మాత్రమే విహితమైనది. కెమ్మోవి యను దానియందు స్థిరాక్షరము పరమైనది. పుప్పొడి అనుచోట పరుషము పరమైనది. మొదటిదానియందు నుగాగమమునకు ప్రసక్తిలేదు. రెండవదానియందు నుగాగమము క్రొక్కారు మొదలగువానియందువలె నుగాగమము రాలేదు. రెంటికిని ద్విత్వమే వచ్చినది. ఇట్లు ద్విత్వము వచ్చుట క్రొత్త శబ్ద విషయముననే కాఁగా, ద్విత్వము కెమ్మోవి, పుప్పొడియను వానికిఁ గన్పట్టుచుండఁగా కెంపు, మోవి యనువానికి అన్యముల ధర్మములు లేవనుట యెట్లు పొసఁగును? ఈ సూత్ర మిచట వర్తింపదనుకొనుటకు ఈ వ్యాఖ్యలో వ్రాయఁబడిన యీ వాక్యములు కారణములై యుండనోపు. 'నిండు, నెఱ శబ్దములకేదో యొకటే శబ్దము పరమయినపుడు కాక యెక్కువ శబ్దములు పరమయినప్పుడు లోప ద్విత్వములు కలుగుచున్నవి. కావున నొక శబ్దమున కొకటికంటె నెక్కువ శబ్దములు పరమగునప్పుడు లోప ద్విత్వములగునని' గ్రహింపవలెను.(పు. 70, 71) సూరి చూపిన యుదాహరణములనుబట్టి ఈ వ్యాఖ్యాత లీ యభిప్రాయమునకు వచ్చి యుండవచ్చును. కాని కెమ్మోవి, పుప్పొడియను నీ రెండుదాహరణములనుబట్టియే యీ వాక్యములను బ్రత్యాఖ్యాతములగు చున్నవి. ఉదాహరణము చూపని మాత్రమున పై నిర్ణయము చేయుట సరికాదు. ఇవి కెంధూళి కెంజడల వంటివికావు. పరుషేతరము పరమగునపుడు నుగాగమము వచ్చుట విశేషము. పరుషముగాని పరుషేతరముగాని పరమగునపుడు ద్విత్వము వచ్చుట సామాన్య విషయమే. కావున నీ రెండుదాహరణములకై కెంపు, పూవు శబ్దములను ప్రోతాదులయందున్నను, అన్యములయందును జేర్పక తప్పదు.

(3) తత్సమ పరిచ్ఛేద ప్రథమ సూత్ర వ్యాఖ్యా విశేషములో నిట్లు వ్రాయఁబడినది. 'డు ప్రత్యయము 22 వ సూత్రమునను, ము ప్రత్యయము 39 వ సూత్రమునను, వు ప్రత్యయము 48, 50 సూత్రములలోను బ్రత్యేకముగా విధింపఁబడును. లు ప్రత్యయము 12 వ సూత్రమునఁ జెప్పఁబడును. కావున నిది విధి సూత్రమని కొందఱు చెప్పుట సరికాదు' (పు. 83)

రమణీయమున తత్సమ పరిచ్ఛేదము నందలి మొదటి యేడు సూత్రముల తర్వాత వివరణములో 'ఈ సూత్రము లేడింటిని సంజ్ఞా సూత్రములు గనే కాక విధి సూత్రములుగఁ గూడ గ్రహింపవలయును' అని కలదు. (పు. 237) ఆ వాక్యము నీ వాక్యమాక్షేపించుచున్నది. ఇది కాక తక్కిన ఆఱు సూత్రములను సంజ్ఞా సూత్రములుగా మాత్రమే కాక విధి సూత్రములుగ నీ వ్యాఖ్యయు నంగీకరించియున్నది. ఉదాహరణమునకు 'ద్వితీయా విభక్త్యంతములను సాధింపవలసివచ్చినపు డీ సూత్రముచేతనే ను వర్ణకము ప్రాతిపదికలపై నిలుచును' (పు. 83) మొ॥వి. కావున 'డు ము వు లు ప్రథమ' అను సూత్ర విషయమునందే విధి సూత్రమనుకొనుట పొసఁగదని యీ వ్యాఖ్యయొక్క తాత్పర్యము. కాని అది సత్యముకాదు. డు ము వు ల విధానమునకు 22, 39, 48, 50 సూత్రములున్నను లు ప్రత్యయమునకు విధి సూత్రము బాలవ్యాకరణమున లేదు. ఉన్నదని యీ వ్యాఖ్య వచించిన 12 వ సూత్రము 'లు' అనుదానికి బహువచన సంజ్ఞను గలిగించునదియేకాని లు విధాన సూత్రము మాత్రము కాఁజాలదు. పూర్వాపర సూత్రములనుబట్టి యీ యంశమును నిర్ణయింపవచ్చును. 'డు ము వు న లేక వచనంబులు. త. 11'. 'లు వర్ణంబు బహువచనంబు' త. 12. 'తక్కినవి యుభయంబులు' త. 13. వీనిని పరిశీలించినచో నివి ప్రత్యయముల ఏకవచనత్వ బహువచనత్వములను నిర్ణయించునవియే కాని ప్రత్యయ

విధాయక సూత్రములు కావనుట స్పష్టము. కావున లువర్ణక విధానమునకు వేఱొక సూత్రము లేని కారణము నను, తక్కిన యాఉ సూత్రములును విధి సూత్రములుగఁగూడ పరిగణింపక తప్పదు కనుకను ఈ సూత్రముకూడ విధి సూత్రమే యని యంగీకరింప వలయును. అట్లు చెప్పుటచేః గలుగు ప్రయోజనములు వర్ణమునకు మాత్రమే అయినను, తక్కినవాని కిది వర్తింపకున్నను నదియొక సమస్య కాదు. 'అణాది త్స వర్ణస్య చా ప్రత్యయః' అను సంస్కృత పరిభాషా సూత్రము నందలి అణ్ ప్రత్యాహారస్థములైన హ, ర వర్ణములందు ప్రయోజనము లేనివే యయ్యును, ఎట్లు పరిహరణీయములు కావో, అట్లే విధి విషయమున 'డు, ము, వు' అనునవి ప్రయోజనము లేనివైనను సంజ్ఞావిషయమునఁ బరిహరింపఁబడఁజాలవు. బా. వ్యా. క్రియా పరిచ్ఛేదమునందలి 50, 59 సూత్రములలోని వక్రపద మొక్క ఎకారమునే గ్రహించి తక్కినవాని నుజ్జగించుచున్నది. కావున నిది విధి సూత్రమనుట సరికాదనుట సరికాదు.

(4) తత్సమ పరిచ్ఛేదమునందలి 'ఇకారంబు మీఁది కునువు క్రియావిభక్తుల యుత్వంబున కిత్వం బగు' (26) అను సూత్రమున కీఁబడిన మూఁడవ యుదాహరణ విషయమునఁ గొంత సందిగ్ధత కలదు. కొందఱది జలపర్యాయ వాచకమైన సంస్కృత వారి శబ్దమనిరి. ఈ వ్యాఖ్య దానిని తచ్ఛబ్దార్థకము యొక్క మహద్బహువచన రూపమే యని కొన్ని యుపపత్తులను జూపినది. సర్వనామ ప్రక్రియ సూరి చెప్పనే చెప్పఁడనుట పొసఁగని మాటయేయైనను ప్రకృతోదాహరణ ముభయ సామాన్యముగ నిచ్చినాఁడని తలంప వచ్చును. సంస్కృత శబ్దమనుకొనుటలో విశేషమేమి? యను ప్రశ్న పొడమ వచ్చును. ఒక పులింగ శబ్దమును (హరిని) ఒక స్త్రీలింగ శబ్దమును (శ్రీని) చూపిన సూరి యొక నపుంసక లింగశబ్దమునుగూడ నుదాహరించె ననుటలో సామంజస్యము లేకపోలేదు. దాని నాచ్ఛిక సర్వనామముగఁగూడ భావించుటలో విప్రతిపత్తి లేదు. సర్వనామ మగుటయే యిట సూరి హృదయమని ఖండితముగాఁ జెప్పఁజాలమని నా యుద్దేశ్యము.

(5) తత్సమ పరిచ్ఛేదమునందలి 27 వ సూత్రము వ్యాఖ్యలో ఈ క్రింది వాక్యములు గలవు. '(iv) 'ఈఁకు' అనునది యుష్మదర్థక మని కొందఱు వ్యాఖ్యానించినారు, క్రియయు యుష్మదర్థము నగునని కొందఱు సెలవిచ్చినారు. కాని యీ రెండు పక్షములు సరికావు. ఏలన అచ్ఛిక 24 సూత్రోదాహరణములను బట్టి నీకు—అను యుష్మదర్థ మొక్కటి మాత్రమే సూరి మతమునఁ గలదు. ఈఁకు అనునది లేనేలేదు. కావున ఈఁకు—అనునది క్రియా రూపము మాత్రమే యన్నది సూరి హృదయమనుట స్పష్టము. చూ. అచ్ఛిక 24 వ్యాఖ్య' పు 98.

ఈ యభిప్రాయమును పరిశీలింతము. సూరి అచ్ఛిక. 24 వ సూత్రోదాహరణములలో యుష్మదర్థమునకుఁ బ్రథమైక వచన బహువచనములో నీవు—ఈఁవు, మీరు-మీరలు, ఈఁరు-ఈఁరలు అను రూపములను జూపియున్నాఁడు. తృతీయా విభక్తి వఱకే రూపములను బ్రదర్శించి యున్నాఁడు. విభక్తి నిమిత్తకమైన మార్పులున్నంతవఱకుఁ జూపుటయే యాతని ఉద్దేశ్యము కాని యున్నరూపముల నన్నింటికి నన్ని విభక్తులలో రూపములను బ్రదర్శించుట తన లక్ష్యముకాదు. కావున ప్రథమా విభక్తిలో నకార విరహితముగనున్న ఈఁవు—ఈఁరు అను రూపములనుబట్టి షష్ఠీ విభక్తిలో 'ఈఁకు' అను రూపమును బ్రయోగానుసారముగ నంగీకరించుటలో దోష మేమియు లేదు. తక్కిన విభక్తులలో నకారములేని రూపము ప్రయోగ దృష్టము కాదు గాని షష్ఠిలో దీనికి ప్రయోగము గలదు.

'ఎంత చెప్పిన విన రేమి 'ఈఁకు' మాకు
హరుని యాజ్ఞయ బల వంత మల్ప మెట్లు'

(శివ. మా. 4.63) ఇది రమణీయమునఁ జూపఁబడినది. కవి ప్రయోగమునకు గతి కల్పించుట కేదేని మార్గమున్నచో నది యుపాదేయమే కాని పరిత్యాజ్యము

కాదు. కావున నీ సూత్రమునందలి 'ఈకు' అను నుదాహరణము క్రియారూపముతోపాటు యుష్మదర్థమునగు ననుకొనుట సమంజసమే యగును.

(6) తత్సమ పరిచ్ఛేదమునందలి నలువదవ సూత్రమగు 'వానికి ము వర్ణకేతరంబయిన విభక్తి పరమగునపుడు ముగాగమంబగు' అనుదాని వ్యాఖ్యలో వానికి—అను సర్వనామముచే కొందఱు ప్రథమైక వచనమున ము వర్ణకము వినఁబడువానికి అను సొంత వాక్య ముపాత్త మగుననుట కృతకమని యీ వ్యాఖ్యలోఁ జెప్పఁబడినది. (పు. 108). కాని యిది కృతక మేమాత్రమును గాఁజాలదు. ఈ యర్థమును జెప్పక తప్పదు. ము వర్ణకేతర విభక్తి యనుదానిచే నీ యర్థమును సాధింపఁజాలము. ము వర్ణకేతర విభక్తి యనఁగా లు మొదలగువానితోపాటు డు వు లు, వాని లోపమును గూడ గ్రహింపఁబడవచ్చును. అప్పుడు లత + లు అనుచోట 'ప్రథమా విభక్త్యేక వచనమున ము ప్రత్యయము వినఁబడు నమహన్నపుంసకములకు' అను నర్థమును జెప్పనియెడల ముగాగమ మనివార్య మగును. ఇట్టి యర్థమును జెప్పుట యీ వ్యాఖ్యకును సమ్మతమే. కాని యీ యర్థమును సిద్ధింపఁజేయు మార్గము మాత్రము భిన్నము. పరిశీలింపుఁడు— 'ము వర్ణకేతరంబయిన—అనుటచేఁ బ్రథమైక వచనమున ము వర్ణకముతోఁ గూడికొనియుండు అదంతము లగు నమహన్నపుంసకములకే ముగాగమ మగునని వ్యాఖ్యానింపనగును.' (పు. 108) ఈ యర్థమును 'వానికి'—అను పదముచే సాధించుటయే సహజము. 'ము వర్ణకేతరంబయిన' అనుదానిచే సాధించుటయే కృతకమని పైని నిరూపింపఁబడినది.

(7) భగవానుఁడు, హనుమానుఁడు అను రూపముల సాధన విషయమున నీ వ్యాఖ్య 'మతుప్తు కారమున కనుటచే ఆనాదేశ పక్షమున సంస్కృత ప్రాతిపదికమును గ్రహింపవలెనని సూచన' అని వ్రాసినది. (పు. 133) ద్వితీయైక వచనాంత తుల్య రూపమును ప్రాతిపదికముగా గ్రహించినచో 'హనుమంత' అనుచోటనున్న 'త' అను దానిని తకారముగా (త్) గ్రహించుట బాలవ్యాకరణ సమ్మతముకాదని నిరూపింపఁబడినది. అయినను ద్వితీయైక వచనాంత తుల్యరూపముతో దీనిని సాధింపవచ్చును. 'హనుమంత' అనుదానిలో తకార హల్మాత్రమునకే ఆనాదేశము చేసినను వైరూప్యము సంభవింపదు. హనుమంత్ + అ హనుమం + ఆన + అ—అపదాది స్వరసంధి. హనుమం + ఆన. స్వరపూర్వక బిందువు తెలుఁగున నుండదు కావున లోపించును. హనుమ + ఆన. పిదప నపదాది స్వరసంధియు నుత్త్వదుఙ్లు రాఁగా హనుమానుఁడు సిద్ధించును. ఇట్లే భగవానుఁడును. ఇట్టి ప్రక్రియతో ద్వితీయైక వచన రూపముతోఁగూడ నిష్టరూప సిద్ధియగును. కాని యిది ప్రక్రియా గౌరవము మాత్రమేకాక చాలకృతకమైన ప్రక్రియయు నగును. కావున నీ వ్యాఖ్యలో చెప్పఁబడిన మార్గమే సుకరము. (సంస్కృత ప్రాతిపదిక తుల్య రూపమే తెలుఁగునఁ బ్రాతిపదికమగుననుట). కాని యిట్టి వాక్య విన్యాసమేగల 80, 81, 82, 83 సూత్రములలో నీ వ్యాఖ్య ఈ పద్ధతిని—సంస్కృత ప్రాతిపదికము తెలుఁగున ప్రాతిపదికమగు ననుదానిని అంగీకరింపలేదు. 'సాంతంబుల తుది సకారంబునకు లోపంబు బహుళంబుగా నగు' అను తత్సమ, 80 వ సూత్రము వ్యాఖ్యానమున 'తుది సకారంబున కనుటచేఁ బ్రథమైక వచనమునందలి తుది విసర్గమును సకారముగ మార్చి ప్రాతిపదికము చేయవలెను' (పు. 139) అని వ్రాయబడినది. దాని విశేషాంశములలో 'కొందఱు 'తుది సకారంబునకు' అను దానినిబట్టి సంస్కృత ప్రాతిపదికమును గ్రహింపవలె నందురు. కాని 'తుది సకారంబునకు' అనునది విసర్గమును సకారముగ మార్పవలెనని సూచించు నన్నదే సంప్రదాయ సిద్ధమగు నర్థము. 'అత్ర ప్రథమైక వచన తుల్యత్వేపి విసర్గస్య ద్విత్వా సంభవాత్తత్ స్థానినః సకారస్యైవ గ్రహణమ్. అప యః ప్రభృతే రితి సూత్రప్రయోగశ్చ శబ్దశాసన స్యాత్ర మానమ్' అని యహోబల పండితుఁడు స్పష్ట పఱిచి యున్నాఁడు. అసలు 67 చే ప్రథమైక వచనాంతములు ప్రాతిపదికము లగును,

68 చే—ఆ ప్రథమైక వచనాంత తుల్యముల తుది హల్లునకే, ఉగాగమము ద్విత్వము నగును. సంస్కృత ప్రాతిపదికముల తుది హల్లునకుఁగాదు, కావున సంస్కృత ప్రాతిపదికమును గ్రహింపవలె ననుట సరి కాదని చెప్పదగును. ఇట్లే 81, 82, 83 సూత్ర ములయందును గ్రహింపఁదగును'—(పు. 139, 140.) అను వాక్యములు గలవు.

మతుప్త్కారమున కనుటచే లాఘవమును అపే క్షించి సంస్కృత ప్రాతిపదిక తుల్యరూపమును గ్రహించినపుడు తుది సకారంబున కనుటచే సాంత ముల విషయమున ప్రాతిపదిక తుల్యరూపము నేల గ్రహింపరాదు? ముందది ప్రథమాంత మనుకొని దాని తుది విసర్గమును సకారముగ మార్చి పిదప దానికి ద్విత్వము చేయనేల? 67 వ సూత్రము సాంతముల విషయమునఁ బ్రవర్తింపదనుకొనుట సంప్రదాయ విరుద్ధమైనచో 70 వ సూత్రము భగవానుఁడు, హనుమానుఁడు అనువాని విషయమునఁ బ్రవర్తింప దనుకొనుటయు సంప్రదాయ విరుద్ధమే యగును. అది సార్వత్రికము నిది క్వాచిత్కము గదా యన్నచో నొక సులువైనమార్గ మొకచో నవలంబించినపుడు తక్కిన సందర్భములందును నవలంబించుటలో సార్వ త్రికము, క్వాచిత్కము నను భేదములతో పనిలేదు. కావున సాంతముల విషయమున ప్రథమాంత రూపము లనే గ్రహింపవలయునన్న ఆగ్రహమున్నపుడు హను మానుఁడు మున్నగు రూపములలో ద్వితీయైక వచ నాంత తుల్యరూపమునే గ్రహింపవలయును. అచట సంస్కృత ప్రాతిపదిక తుల్యరూపమును గ్రహింతమన్న నిచటను నదియే పరిగ్రాహ్యము. ఒకే విధముగా నున్న రెండు తావులలో రెండు భిన్నమార్గముల నవలం బించుటకంటె కుదిరినప్పు డొకేమార్గము నవలం బించుట యుక్తతరము. అహోబల పండితీయమున నున్న విధానములన్నియు సూరికి సమ్మతములు కానక్కరలేదు. అహోబల పతి యభిప్రాయములను సూరి ఖండించిన తావులును గలవు. అవి యీ వ్యాఖ్యలోఁగూడ ప్రదర్శింపఁబడినవి. దానినిబట్టి యిది సంప్రదాయము కాఁబనిలేదు. ఇంతకు నీ రెంటను తావు లలో నొకే మార్గము నవలంబింపవలయుననియే నా తాత్పర్యము కాని విసర్గమును సకారముగా మార్చు కొనుట తప్పనికాదు. ఈ రెండు తావులయందును విశేషాంశముగా సంస్కృత ప్రాతిపదిక తుల్యరూపము లను దెలుగునఁ బ్రాతిపదికములుగా గ్రహించుటయే ప్రక్రియా లాఘవమున కనువైన మార్గము.

(8) 'రాజన్' శబ్దవిషయమున నీ వ్యాఖ్య త్రొక్కిన మార్గ మపూర్వము. ప్రథమైక వచన రూపసాధనమునకు ప్రాతిపదిక స్వరూప నిర్ణయము చేయఁబడలేదు. 'రాజు' అనునది ప్రథమా విభక్త్యేక వచన స్వరూపముగా నిపతింపఁ బడినదిగా నిం ర జెప్పఁబడినది. ప్రథమా బహువచనాది ప్రత్యయము లకు ప్రాతిపదికము 'రాజా' అనునది గ్రహింపఁబడి నది. కాని 'రాజు' అనునది సూరిచే ప్రాతిపదికముగనే నిపతింపఁబడెననుట లెస్స. కాని యీ వ్యాఖ్యాత కీ యభిప్రాయము సమ్మతముకాదు. చూడుఁడు. 'విశే. (i) రాజు—అను ప్రథమాంత రూప మిట నిపతింపఁబడినది. కొందఱు రాజు—అనునది ప్రాతి పదికముగ నిపతింపఁబడెనని సెలవిచ్చిరి. కాని యది సరికాదు. రాజు + డుజ్—అనుచో డుజ్ఞులోపించుటకు దారి యేమియులేదు.........' (పు. 138). తత్సమ పరిచ్ఛేదమునందలి నిపాత విధానమును పరిశీలించినచో నీ యభిప్రాయము సరికాదని స్పష్టమగును. 51 వ సూ. చే విధింపఁబడిన క్రుదువ, 62 చే నిపతింపఁ బడిన భువి, 63 చేనగు నావ, 82 చే సిద్ధించు వేధ, పురోధ—84 చే నేర్పడు దివి, హృది—ఇవి యన్నియు ప్రాతిపదికములుగనే నిపతింపఁ బడినవి. ప్రథమాంత నిపాత మొక్కటియును లేదు. అట్టి యెడ 'రాజు' అనుదానిని కూడ ప్రాతిపదిక నిపాతముగా భావించుటయే యుక్తము. అయినచో ప్రథమైక వచనమున 'రాజుఁడు' అను ననిష్టరూప నివారణ మునకు మార్గము లేదుగదా! యని శంకింపఁబనిలేదు. ఈ నిపాత సామర్థ్యముననే 'డు' ప్రత్యయమునకు లోపమువచ్చును. 'రాజుఁడు' అనునది యిష్టరూప

వైనచో నీసూత్రమే యక్కఱలేదు. 'రాజా' అను ప్రథమైక వచన తుల్యరూపమును సామాన్యాకారముగ ప్రాతిపదికముగ గ్రహించినచో నీ రూప మేర్పడును. అటు కాకుండుటకే నిపాత విధానము. ఈ సందర్భమున రమణీయములో నుట్టంకింపఁబడిన యభిప్రాయమునుగూడ నిటఁ బరిశీలింపఁదగును. 'నిపతించుట ప్రయోజన శూన్యమగును గావున దీనిపైని వు, డు ప్వర్ణకములు గలుగవని యొకకల్పన పేటికా టీకలోఁ గానవచ్చును. ఆ కల్పన యీ తావున నసిపడునది కాదు. ఈ నిపాతము వారన్నట్లు ప్రయోజనశూన్యము కాదు. ప్రాతిపదిక స్వరూపము 'రాజ' అని కాకుండ 'రాజు' అని యగునని తెలుపుచు ఈ నిపాత విధానము సప్రయోజనమే యగుచున్నది. ఏ ప్రయోజనమును లేక సూత్రము వ్యర్థము కావలసిన పరిస్థితిలో సూత్రమే వారు సూచించిన సామర్థ్య కల్పన చెల్లును. విధానమునకుఁ బ్రయోజనము గల యిట్టి చోటులందు ఆ కల్పన సుకరముగాదు'—(రమ. 292 వ పుట). ఈ యభిప్రాయము ప్రామాదికము. రాజులు మున్నగు ప్రథమా బహువచనాది రూపముల సిద్ధిలో నీ సూత్రమున్నను లేకున్నను ఒక్కటియే. 'రాజు' ఎట్లేర్పడు నన్నదియే యిందు సమస్య. 'రాజుఁడు'అను ననిష్టరూపమును నివారించుటలో ప్రయోజనము లేనంతవఱకు (అనఁగా రాజు శబ్దము డు మంతముగా నివారింపఁబడనంతవఱకు) ప్రాతిపదిక స్వరూపము 'రాజ' అనునదియా? 'రాజు' అనునదియా? యను విచారణము ప్రయోజన శూన్యమే యగును. ప్రాతిపదిక స్వరూప నిర్ణయమే ప్రయోజనశూన్య మనుకొన్నచో దానిని సాధించు సూత్రమెట్లు ప్రయోజనవంతమగును? కావున నీనిపాత విధానము వ్యర్థమగుచు ప్రథమైక వచన ప్రత్యయ లోపమును సాధించుచున్నదని చెప్పనేవలయును. కావున సూరి నిపతించిన 'రాజు' అనునది ప్రాతిపదిక స్వరూపమే యగును. ఆ పద్ధతిలో రూపములన్నియు కుదురును. ప్రక్రియా లాఘవమను ప్రయోజనముకూడ సిద్ధించును.

(9) 'కా ప్రత్యయము మీఁది బహువచన లకారంబునకు లఘ్వలఘు రేఫంబులును, లఘు రేఫంబునకుముందు బిందుపూర్వక డకారంబు నగు' (ఆ. ప. 7 వ సూ) ననుదాని వ్యాఖ్యలో నిట్లు గలదు. 'బిందు పూర్వక—అని యీ సూత్రమునఁ గలదు. 6 వ సూత్రమునుండి పూర్ణ శబ్దము ననువర్తింపఁ జేయ నగును. లడాగమ లకారము తత్సమ 31—చే విభక్తి లకార మగును, కావున విలుకా + లను=విలుకాండ్ + ర్ + అను=విలుకాండ్రను ఇత్యాదులు సాధ్యములగును.' (పు. 153). నిజమున కిందుఁ బూర్వ సూత్రమునుండి పూర్ణశబ్దము ననువర్తింపఁబనిలేదు. 6 వ సూత్రమునఁగూడ పూర్ణశబ్ద మనవసరము. ఖండబిందువు వచ్చినను 'సమాసపదంబునందు సంయోగంబు పరంబగు నపుడెల్లచో ఖండబిందువునకుం బూర్ణంబగు' (అచ్చి—15) ననుసూత్రముచే పూర్ణబిందువు సిద్ధించును. కాని తనంత తాను విధించెడిదిముందు ఖండబిందువు కానేల? దానికి మఱల నింకొక సూత్రమునుదెచ్చి పూర్ణత్వము నాదేశింపనేల? యను తాత్పర్యముతో 6 వ సూత్రమున సూరి 'పూర్ణ'శబ్దము నుంచెను. ప్రక్రియా నిర్వహణ వినోదులకు మఱియొక సూత్రముకూడ కలదు సుమా! యని సూచించుట కన్నట్లు ఈ సూత్రమున (7 వ) పూర్ణశబ్దము పరిహరింపఁబడినది. అట్లే 11 వ సూత్రమందును. మఱల దూరముననున్న 33 వ సూత్రమునను పూర్ణశబ్దము గ్రహింపఁబడినది. ఈ పద్ధతిని పరిశీలించినచో 7, 11 సూత్రములలో సూరి బుద్ధిపూర్వకముగనే 'పూర్ణ' శబ్దమును పరిహరించెనని చెప్పనగును. ఈ రెండు తావులందును పూర్ణబిందువు దీర్ఘము మీఁదను నిలువవలయును. 'దీర్ఘము మీఁద సాధ్యపూర్ణము లేదు' (సంజ్ఞా. 15) అను సూత్రమును సరిచేయుటకు 15 వ సూత్రమున నిలుపఁబడిన 'ఎల్లచో' అనుపదమున కచట చూపిన 'తేంట్లు' మున్నగునవియే కాక విలుకాండ్రు, ఆండ్రు మున్నగునవి కూడ కలవని చూపుటకే యిచట సూరి పూర్ణశబ్దమును విడిచి యుండెనని తలంప వచ్చును. ఈ విషయమునుబట్టి 7 వ సూత్రములోనికి పూర్ణశబ్దము

ననువర్తింపఁజేయుటగాని, 11 వ సూత్రములో ప్రక్రియా సౌలభ్య దృష్టితో పూర్ణబిందువును మాత్రమే చేసికొని రూపములను సాధింపవలయు ననుటగాని సూరి హృదయము కానోపదని గ్రహింప నగును.

(10) 'ఇయకు మాఱుగా నామాంతంబున కెత్వంబు బహుళంబు గానగు' (ఆ. 23) అను సూత్రమున 'నామాంతంబు' అనుదాని కవసరమును బట్టి 'నామమధ్యము' అనునర్థమును గూడ వివక్షించి నచో చెల్లియలు—చెల్లెలు మున్నగు రూపములు సిద్ధించు నని కొందఱు చెప్పిరి. ర. వ్యాఖ్య అది సరి కాదను చున్నది. 'నామాంత మనఁగా నామ మధ్యమును గావచ్చునని కొందఱు సెలవిచ్చుట సరిగాదు' (పు. 167) ఏల సరికాదో. కానిచో చెల్లెలు రూపమును సాధించుట యెట్లో యీ వ్యాఖ్య నిరూపింప వలయును. ఉపపత్తి చూపక యే పూర్వ వ్యాఖ్యాతల వాక్యములను ఖండించుట సంప్రదాయము కాదు. ఈ రూపము నీ వ్యాకరణము సాధింపదని కాని, ఆ రూప మీ వ్యాకర్తకు సమ్మతముకాదని గాని సమాధానము చెప్పకొని తృప్తిపడుటకంటె సూత్రమున నే కొంచెము వీలున్నను సాధించుటయే సంప్రదాయము. నామ మధ్యమున కన్నచో నేవేని శబ్దముల విషయమున ననిష్టరూపము లేర్పడు ప్రమాద మున్నచో బహుళ గ్రహణము శరణము కానగును. అయినను ఈ విషయమున ఈ వ్యాఖ్యాత యభిప్రాయము స్పష్టము కాలేదు.

(11) 'ప్రథమాంతంబులగు యుష్మ దస్మద్విశేషణంబుల కేకత్వంబున వు ను లు ను బహుత్వంబున రు ము లు నంతాగమంబులు ప్రాయికంబుగా నగు' 'ఈ యాగమంబులు పరంబులగునపు డుత్వంబున కత్వంబగు' అనుకారక. 33, 34, సూత్రముల యుదాహరణములలో 'ఆర్తిహరుఁడవౌ నినుఁ గొల్తునంబు జాక్ష' అనునది వివాదాస్పదమైనది. రమణీయము దీనిని కృతక ప్రథమాంతమునకు 'అవు' వచ్చుట కుదాహరణముగాఁ బరిగణించినది. ఘంటాపథము దీని నంగీకరింపక యిట్లు చెప్పచున్నది. చూడుడు. 'ఆర్తిహరుఁడవౌ నిను—అని ప్రథమ ముద్రణము. ఆర్తిహరుఁడవు + ఔ నిను అని గ్రహించి, నీవు ధన్యుఁడవు అనుదానితో దీనిని ముడిపెట్టుటలో సందర్భశుద్ధిలేదు. కావున ఆర్తిహరుఁడవు నిను—అసలు పాఠమయి యుండునను పక్షమే యుక్తముగఁ గన్పట్టును'—(పు. 223) అనిచెప్పి దీనిని ప్రాయిక గ్రహణముచే రక్షితములు కావలసిన వానిలో మొదటిదిగా నీ వ్యాఖ్య పరిగణించినది. దీని తత్త్వ మరయుదము. ఈ రెండు వ్యాఖ్యల యందును నిది కవి ప్రయోగమని చెప్పఁబడలేదు. ప్రాయికగ్రహణ రక్షితముల గర్వ గరిష్ఠుండగు నమ్మ, మీరలు పెద్దలు అనున వరుసగా నిర్వచనోత్తర రామాయణ కళాపూర్ణోదములలోనివిగా రెండు వ్యాఖ్యలు వ్రాసినవి. తాఁ ప్రత్యేక మొక యుదాహరణమును దన సూత్రమునకు విరుద్ధముగాఁ గల్పించి దానిని ప్రాయికగ్రహణముచే రక్షింపఁజేయునంతటి క్లేశము సూరికేల కలుగవలయును? ఆ ఉదాహరణము లేకుంట లోపమా? కావున నొక విశేషార్థమును సూచించుటకే దీని నుదాహరించె ననుట సమంజసము. సూరి చెప్పకయే యుదాహరణములను ప్రత్యేక దృష్టితో నొసఁగుట అందఱికిని తెలిసినదియే. ఉదాహరణమునకు అవ్యుత్పన్నము, కృదంతము, తద్ధితాంతము, సమాసము—అని ప్రాతిపదికములు నాల్గు విధములుగా నున్నవని సూచించుటకు తత్సమ 21 వ సూత్రమున డిద్థ, రామ, భార్గవ, రాజపురుష అను నాలుగు ప్రాతిపదికముల నుదాహరించెను. అట్లే 'సర్వంబునకుం బ్రేరణంబు నందించుక్కగు' (క్రియా. 70) నను సూత్రమున కిచ్చిన యుదాహరణములలో సంస్కృత ధాతువులు రెండు, అంగలాది యొకటి, సహజములగు ఆచ్ఛిక ధాతువులు రెండుగా నుదాహరించి యా యా ధాతువుల సంఖ్యాబలమును సూరి సూచనగా వివరించెను. ఈ యంశము శ్రీ వ్యాఖ్యచే అంగీకృతములే. ఇట్టియెడ ప్రకృతోదాహరణము కృతకములైన ప్రథమాంత విశేషణములకును ఈ కార్యమగునని సూచించుట కనుటలో సందర్భ

శుద్ధి యేల లేదు? దానిని ప్రాయిక గ్రహణముచే రక్షింపఁబడు వానిలో చేర్చుట యందే సందర్భ శుద్ధి లేదు. ఎట్లన సూరి తనచే కల్పితమైన యుదాహరణము నందు ముద్రణ ప్రమాదమునకుఁగాని, స్పష్టతా దారిద్ర్యమునకుఁగాని వీలుండునట్లు వకారమును ప్రయోగించునా? 'ఆర్తిహరుఁడగు నిను గొల్తు నంబుజాక్ష' అని అగుధాతు రూపమును గకారముతో నిరేశించిన ఏ చిక్కును గలుగదు గదా! ఇచట మఱి యొక శంకను, ఈ యుదాహరణముయొక్క స్థానము పుట్టింపవచ్చును. సూరి దానిని కృతక ప్రథమాంత మగు యుష్మద్విశేషణముగా భావించినచో 'నీవు ధన్యుఁడవు' అనుదాని ప్రక్కనే దీనిని నిలుపఁడా? యనునది యా శంక. కాని యిది నిలువదు. సామాన్యాకారమున నీ యాగమములు వచ్చు నుదాహరణములను పరిపాటి తప్పక యుదాహరించెను. ఉకారాంత యుష్మద్విశేషణము—ఏకవచనము—నీవు ధన్యుఁడవు, ఉకారాంత—అస్మద్విశేషణము — ఏకవచనము —నేను ధన్యుఁడను. ఉకారాంత యుష్మద్విశేషణము—బహువచనము—మీరు ధన్యులరు—ఉకారాంత అస్మద్విశేషణము — బహువచనము—మేము ధన్యులము—ఇకారాంత యుష్మద్విశేషణము—నీవు సుకృతివి. ఇకారాంత—అస్మద్విశేషణము—నేను సుకృతిని, ఇందు ఉకారాంతములముందు చూపుటలో విధింపఁబడిన రెండు సూత్రములకు లక్ష్యము చూపినటులైనది. ఇకారాంతములలో నేకవచనమున రెండవ సూత్రమునకు ప్రసక్తి లేదు. ఈ క్రమమిట సూరిచే సంభావింపఁబడినది. ఇప్పటికి సామాన్యోదాహరణములఁ జూపుట పూర్తియైనది. విశేషోదాహరణ మొకటి చూపుట కిదియే సరియైన తావు. కావున నిచట సందర్భశుద్ధి లేదనుకొనుట పొరపాటు. అన్నిటి కంటె సూరి పర్యవేక్షణలో జరిగిన ప్రథమ ముద్రణమునం దిది ఆర్తిహరుఁడవౌ అనురూపమున నున్న దను నంశము మరువ రానిది. ప్రాయిక గ్రహణము నకై, చెప్పకపోయినను తప్పని దీని విషయమున ముద్రణ స్ఖాలిత్యమును సంభావించుట యుచితము గాదు. కాఁబట్టి 'ఆర్తిహరుఁడవు నిమ—అసలు పాఠమయియుండుననను పక్షమే యుక్తముగఁ గన్పట్టును'—అను నీ వ్యాఖ్యావాక్యము అయుక్తము.

(12) 'బహువ్రీహిని సమాసాంత కార్యంబులుం గానం బడియెడి' (సమాస. 22) అను సూత్రమున కొసఁగఁబడిన లక్ష్యములలో 'కడలి రా చూలు' అను దానికి ఈ వ్యాఖ్యలో 'కడలి రాచ యొక్క చూలు' అను విగ్రహము చూపఁబడినది. అప్పుడిది షష్ఠీ తత్పురుష మగును. అట్టిచో బహువ్రీహికి మాత్రమే విధింపఁబడిన సమాసాంత కార్య యోగ్యత దీని కెట్లు కలుగును? 'ఇవి ప్రాయికముగా నుత్తరాన్యోభయ పదార్థ ప్రధానములయి యుండు' (బా. వ్యా. 3 సూత్రవివరణము) ననువాక్యమునందలి ప్రాయిక గ్రహణముచే దీనిని రక్షింతమన్నచో తత్పురుషమును బహువ్రీహి యనుకొనవేల? దానిని ప్రాయిక పదముచే రక్షింపనేల? మఱి సమాసాంతకార్య మెట్లగు నని ప్రశ్న కలుగును. రాచ శబ్దములోని చకార లోపమున కెటును నిక్కలాది సూత్రము నుపయోగించినపుడు చివరి ఇకారాదేశమునకును నదియే గతి యగును. లేదా 'చూలి' అను శబ్దమును బిడ్డఅను నర్థమున నిఘంటువులు చూపినవి. అప్పుడు 'కడలి రాచయొక్క చూలి' అని షష్ఠీసమాసము ఏ సమాసాంత కార్యము జరుగకయే సిద్ధించును. కాని సూరి దృష్టి లో నిది బహువ్రీహి. దానికి సమాసాంతకార్యము జరుగవలయును. కావున కడలి రాచ(వాఁడు) చూలుగా (గర్భముగా) గలది యను నర్థము చెప్పుకొనుట సముచితము. గర్భమనఁగా ఉత్పత్తిస్థానమను నర్థమిచట గ్రహింప నగును. అప్పుడు బహువ్రీహి యగును. ప్రస్తుత సూత్రముచే ఇకారము సమాసాంతముగా నాదేశమగును. కావున 'కడలి రాచయొక్క చూలు'అను విగ్రహము ప్రామాదికము.

(13) తద్ధిత. 14 వ సూత్రమగు 'కా వర్ణకంబు తిర్యక్కులకుం గానంబడియెడి' అనుదానిచే విధింపఁబడిన 'కా' వర్ణకమును కయిరాదులలోఁగూడ చేర్పవలెనని కొందఱు చెప్పిరి. కాని 'ఒక శబ్దమునే వేర్వేఱు గణములలోఁ జేర్చుట సరికాదు.'(పు. 262) అని యీ వ్యాఖ్య దానిని ఖండించినది. అయినచో

ఇబ్బందిగాఁడు మున్నగునవి మహత్తులు కావు గదా! అట్టియెడ దానికి డుఁజు వచ్చు టెట్లు? అను శంకకు 'మహత్తులగు మగాదులకు—అనుటచేఁ దిర్యక్కులకును మహత్త్వ మారోపింపఁబడెనని గ్రహింపనగును.' అను సమాధానము చెప్పఁబడినది. మహత్తులగు మగాదులకు అనుటచే తిర్యక్కులకు మహత్త్వ మారోపింపఁబడెనని యేల గ్రహింపవలయును? ఒకవేళ నా విధముగా గ్రహించినచో కయిరాదిగణమును వేఱుగా చెప్పుటయేల? పనివడిన యెల్లతావులందును (కయిరాదుల యందును) మహత్త్వము నారోపించుకొని రూపసాధన చేసికొనవచ్చునే కదా! మఱియు 'కయిరఁడు మున్నగునవి అశ్వవిశేషములు. ఇవి యమహత్తులు గాన వీనికి తత్సమ 22 చే డుజ్ఞు రాదు. కనుక నీ సూత్రము చేతనే డుజ్ఞగును'అని ఆచ్ఛిక 4 వ సూత్ర వ్యాఖ్యానములో వ్రాయఁబడినది (పు. 151). అచట కయిరాదులు అమహత్తులని చెప్పుచు నిచట 'ఇబ్బందిగా' మున్నగువానికి మహత్త్వ మారోపింపఁబడెనని చెప్పుట పరస్పరవిరుద్ధము గదా! కావున కయిరాదిగణ గ్రహణము చేతను ప్రకృత సూత్రము తిర్యగ్విషయక మగుట చేతను మహత్త్వారోపణమనునది సూరి యభిప్రాయము కానోపదు. కావున తిర్యగ్విషయకమైన 'కా' ప్రత్యయాంతమును కయిరాదులలో చేర్పక తప్పదు. రూపనిష్పత్తికై యొకే శబ్దమును రెండు గణములలో పఠించుట సూరికి ఇష్టము కాకపోలేదు. క్రియా. 76 వ సూత్రమున 'ఆఁగు' ప్రభృతు లుభయగణములగు నని యాతఁడు కంఠోక్తిగా చెప్పెను. తిర్యగ్విషయక కా ప్రత్యయమును కయిరాదులలో చేర్చుటవలన తిర్యక్కులకును మహత్త్వ మారోపింపఁబడె నను వాక్యముకూడ ప్రత్యాఖ్యాతమగును.

(14) " 'వండెను' అనుచోట 17 చే ఇగాగమ మగునని కొందఱు చెప్పకపోవుట సరికాదు." అని క్రియా. 18 వ సూత్రము వ్యాఖ్యలో వ్రాయఁబడెను. (పు. 277) కాని ఇగాగమము ప్రథమ పురుషైక వచనమున వచ్చుట ప్రక్రియా గౌరవమని సూరి సంభావించి నట్లూహించుట కవకాశము కలదు. ఇగాగమము చేయనిచో వైరూప్య మేచటను సంభవింపదు. అట్లని సూత్రమున్నచో చేయకుండుట సముచితమా? యను ప్రశ్న పొడమును. ఇచట సముచితమే

యని తలంపనగును. ఇచట ఇగాగమము వచ్చి తీఱు వలయునన్న యాశయము సూరి కున్నయెడల 'భూతంబు నందిగాగమ మగు'నను సూత్రము తఱువాతనే 'లిఙ్లాట్టుల డుఙ్ఙున కెనుఁను వర్ణంబులగు' నను సూత్రమును బఠించియుండెడివాఁడు. అట్లు చెప్పకుండుటవలననే ప్రథమ పురుషైక వచనమున ఇగాగమము చేయుట యాతనికి సమ్మతము కాదేమో యను నూహ కలుగుచున్నది.

(15) 'లూట్టు డుఙ్ఙున కెడుత వర్ణంబులు ద్రుతాంతంబులగు' (క్రియా. 26) అనుసూత్రము వ్యాఖ్యలో 'ఉదాహరణ స్వారస్యమునుబట్టి ప్రథమ పురుషమున మాత్రమే ఎడు, త వర్ణకములగునని వ్యాఖ్య చేయనగును' (పు. 285) అని కలదు. అట్లు వ్యాఖ్య చేయుటకంటె తనకుఁదాను ఆశీర్వాప సంప్రార్థనములఁ జేసికొనుట సాధారణముగా నుండదు కనుకను, ఎదుటివానికిఁ జేయుట జరిగినను దానిని చెప్పుటకు ముడుఙ్ఙుల ప్రయోగము ప్రత్యేకముగా విధింపఁబడినది కనుకను, కాక అది యను తచ్ఛబ్దాను ప్రయోగమును గలదు కనుకను ఉత్తమ మధ్యమ పురుషములందీ ఎడు, త వర్ణంబులు సాధారణముగాఁ గన్పట్టవని వ్యాఖ్యానించుట సముచితము.

(16) క్రియాపరిచ్ఛేదమునందలి ఏబదవ సూత్రవ్యాఖ్యలో 'భుజియించు' రూపమును సాధించు పట్టున 'భుజ్—ధాతువు ఇది గురువిరహితము. ఏలన హల్లుతోఁగూడిన వర్ణము సంస్కృత ఛందస్సు ననుసరించి గురువు కాదు. లఘువే యగును. భుజ్ సంస్కృత ధాతువు గనుక సంస్కృతము ననుసరించి యిది గురువు లేనిదిగానే భావింపవలెను'అని వ్రాయఁబడినది. (పు. 299) ఇది ప్రామాదికము. భుజ్ ధాతువు గురు విరహితమనుటకు సంస్కృత ఛందస్సు కారణము కాదు. 'నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్' అను దానిలో 'మమ్' గురు సహితము కాదని చెప్పఁజాలము గదా! కావున సంస్కృత ఛందస్సులో సయితము హల్లుతోఁగూడిన వర్ణము గురువే యగును. అపుడు 'భుజ్' అనునది గురు విరహితమగుట యెట్లు? అను ప్రశ్నకు సంస్కృత వ్యాకరణము ననుసరించి గురువిరహితమగునని సమాధానము. పాణినీయమున హ్రస్వం లఘు, సంయోగే గురు, దీర్ఘంచ అను సూత్రములచే హ్రస్వదీర్ఘములెపు డెపుడు లఘుత్వ గురుత్వములను భజించునో చెప్పఁబడెను. సంయోగము పరమైనపుడు హ్రస్వాక్షరము గురువగును. దీర్ఘమైన వర్ణము గురువగును. అచ్చులతో వ్యవధానములేని హల్లులకు (ఒకటి కంటె నెక్కువైనవానికి) సంయోగమనిపేరు. హలోఽనన్తరాః స్సంయోగః అని పాణినీయ సూత్రము. 'భుజ్' అనుచోట ఉకారము దీర్ఘము కాకపోవుటచేతను, సంయోగము దానికి పరము కాకుండుటచేతను గురువు కాదు. కావున భుజ్ ధాతువు గురు విరహితమగును. అంతేకాని సంస్కృత ఛందమున కిచట నేమాత్రము ప్రసంగములేదు. సూరి సంస్కృత వ్యాకరణముల నుండి సంజ్ఞలను పరిభాషలను చాల విరివిగా వాడుకొనెననుట సువిదితము. గురువనునది యిచట వ్యాకరణ విహితమైన సంజ్ఞ.

ఇట్లు నా శక్తి ననుసరించి యీ వ్యాఖ్యలో పాఠకులకు భ్రాంతిజనకములగు పొరపాటులను సవరించి చూపితిని. ఇది రంధ్రాన్వేషణ దృష్టితో చేసిన విమర్శ కాదు. శాస్త్రవిషయమున పొరపాటులు వ్యాపింపరాదను తాత్పర్యమే యీ వ్యాస రచనలో ముఖ్యోద్దేశ్యము. మంచి రచనా పాటవముగల సూరి సూత్రములకు వ్యాఖ్యానము చేయుటలో నెంతవారికిని పొరపాటులు రాక మానవు. ప్రస్తుత మీ వ్యాఖ్య పఠశాలలలో కళాశాలలలో విద్యార్థులచేతను అధ్యాపకులచేతను మిక్కిలిగా సమాదరింపఁ బడుచున్నది కావున వారికి ఆయావిషయములందు యథార్థజ్ఞానము కలుగవలయు నను దృష్టి మాత్రమే యీ వ్రాతకు ఉద్బోధకము. శ్రీ వంతరాం రామకృష్ణారావుగారు తమ గ్రంథము యొక్క భవిష్యన్ముద్రణములలో నా విమర్శయందు తమకు సమ్మతిగల యభిప్రాయములను జేర్చుదురు గాక యని మనవి చేయుచున్నాను. వీరు పీఠికలో నుడివినట్లు వారి బాలవ్యాకరణ సర్వంకషలో నీ యంశములన్నియు కూలంకషముగ చర్చింపఁబడి యుండవచ్చును. ఆ గ్రంథము ముద్రితమైనదో లేదో తెలియదు. నే నది చూచుట తటస్థింపలేదు. అయినను ఈ గ్రంథము మాత్రమే యవలంబముగాఁ గొనువారికి నా పరిశీలనమువలన ప్రయోజనము కలుగునని విశ్వసించుచున్నాను. ఇందేవేని పునఃపరిశీలనార్హము లున్నచో, అవసరమయినచో నా యభిప్రాయములను దప్పక సవరించుకొనఁగలనని మనవి.

కిరణమాలి

శ్రీ కె. శివారెడ్డి

మంచంమీద పడుకున్న
బద్ధకం
కదలటానికే బద్ధకంపడి
'అబ్బ! అంతదూరం ఏం పోతాం—
ఇక్కడ శిథిలమైతే మాత్రమేం
ఆనందం కాదూ' అంటుంది.

గమనం
స్తబ్దత స్థాయికి దిగజారి
నప్పుడు బద్ధకం జననం.
చలనం
లోని విద్యుత్తు పోయి నప్పుడు
నరాలు పాము కుబుసాలయి
మృత్యువు నుంచి మాత్రమే
విముక్తి సూత్రాన్ని నేర్చుకుంటాయి.

కనుపాపలమీదకి
రెప్పల తెరల్ని లాగి
చేతనాత్మ చచ్చేంత వరకు
'రేప్'చేసి ముఖంమీదకాన
దుప్పటిలాగి పడు కున్నప్పుడే
బద్ధకం పునర్జన్మ ఎత్తుతుంది.

నిజానికి
నిరంతర చలన ప్రవాహంలో

'చావు'కూడా—అంత్య దశ కాదు
ఒక ఫుల్‌స్టాప్ మాత్రమే —

ప్రతిదీ
చలనాంతరంగ తరంగితమై
ఉరకలు పెడుతుంటే
నడుస్తున్న మనిషి
నిశ్చలనంలో ఎండిపోవటం
తిరోగమనం—కొరవాలిన తనం

పరుగెడు తున్న
నదీ హృదయంతో
ప్రాణాల్ని మోసుకెడుతున్న
కరెంటు తీగల నరాల్తో
వికసిస్తున్న చేతులు—కాళ్ళతో
భవిష్యత్తులో మనిషి—కిరణమాలి.

———



'వచన పద్యం' ఛందో విభాగం కాదు

శ్రీ చేకూరి రామా రావు

ఆంధ్రపత్రిక 1972 ఉగాది సంచికలో అచ్చయిన 'వచనపద్యం—అభాసలక్షణ నిరాకరణం' అనే వ్యాసంలో వచన పద్యం లేక వచన కవిత అనే పేర్లతో ప్రచారంలో ఉన్న కవితా రూపానికి ప్రతిపాదితమైన లక్షణాలను విపులంగా చర్చించి హేతుబద్ధంగా లేవని నిరాకరించాను. ఆ చర్చలో శ్రీ సంపత్కుమార తమ వివిధ వ్యాసాల్లో (రిఫరెన్సులు పూర్వవ్యాసంలో ఇచ్చాను.) ప్రతిపాదించిన సిద్ధాంతాలను విశేషంగా విమర్శించి అవి కూడా శాస్త్ర చర్చకు నిలవ్వని నిరూపించే ప్రయత్నం చేశాను. మళ్లీ సంపత్కుమార తమ పూర్వప్రతిపాదనలలో కొన్నిటిని సమర్థించుకుంటూ 'వచనపద్యం—లక్షణ నిరూపణ' (భారతి, జులై 1972, పేజీలు: 55–66) అనే వ్యాసం ప్రకటించారు. వారు తమ సమాధానంలో ప్రస్తావించని నా విమర్శల నన్నిటినీ వారు ఒప్పుకుంటున్నట్టు కాదు. వాటిల్లో కొన్నిటిని కాని, అన్నిటినీ కాని ఎప్పటికైనా ఖండించే హక్కు వారికున్నదని గుర్తిస్తూ, ప్రస్తుతం వారు చర్చించిన విషయాలకే ఈ వ్యాసం పరిమితం చేస్తాను.

శ్రీ సంపత్కుమార తమ వ్యాసంలో, నా పూర్వ వ్యాసంలోని కొన్నివాక్యాలను మరీ సాగదీసి వైరుధ్యాలను చూపించటానికి ప్రయత్నించారు. ఉదాహరణకు 57 వ పేజీ 4 వ పేరాలో 'అనియ తత్వం లక్షణం కానప్పుడు నియమ రాహిత్యం మాత్రం లక్షణ మెట్లా అవుతుంది?' అనే ప్రశ్న అట్లాంటిది. అట్లాంటి ప్రశ్నలకు ఈ వ్యాసంలో సమాధానా లుండవు. ఇటువంటి వైరుధ్యాలు శ్రీ సంపత్కుమార వ్యాసంలోనుంచి కూడా చూపించటానికి వీలులేక పోలేదు. అయినా ఇక్కడ ఆ పని జరగదు.

పైన పేర్కొన్న సంపత్కుమార వ్యాసంతో ఆయన చెప్పిన అభిప్రాయాలను సాధ్యమైనంతవరకు సానుభూతితో అర్థం చేసుకుంటూ ఆయన వాదాలు చర్చకు నిలుస్తయ్యా నిలవ్వా? అనేదే ప్రధాన ధ్యేయంగా పెట్టుకొని చేతనైనంత హేతుబద్ధంగా పరిశీలించే ప్రయత్నం ఈ వ్యాసంలో చేస్తాను.

నేను 'వచన పద్యం' అనే పేరును గురించి అంతగా పట్టించుకో లేదన్న విషయం సంపత్కుమార సరిగ్గా గ్రహించారు. నా చర్చకు ఈ పేరు అంత ప్రధానం కాకపోవటమే అందుక్కారణం. సంపత్కుమార ఈ పేరునే ఎన్నుకోటానికి గల కారణాలను పరిశీలించాను. ఆయన ఈ కవితా పద్ధతిని పరిశీలించిన దృక్కోణంనుంచి చూస్తే ఈ పేరు అందుకు సరిపోతుంది.

నేను నిరాకరించిన అంశాల్లో వచన పద్యానికి ప్రతిపాదించిన పాద బద్ధత అనేది కేవలం ఒక అంశం మాత్రమేకాక చాలా కీలకమైనది కూడా. అందువల్ల సంపత్కుమార గాని, నేను గాని దాన్నిగురించి విశేషంగా చర్చించాం. పద్య పాదానికి అంతర్నిర్మాణమూ (Internal structure), బాహ్యపరిమితి (External limit) ఉండాలని నా వాదన. ఆ సందర్భంలో పాదం కేవలం అక్షర సముదాయం కాదని, అవి గణాలుగా ఏర్పడాలని అన్నాను. పద్యపాదాలకు అంతర్నిర్మాణం ఉన్నదనటానికి గణ విభజనను ఆధారంగా చూపించాను. గణ విభజన కేవలం సౌలభ్యంకోసం ఏర్పడిందేనని, పద్య పాదాని కిది అవసరమైన లక్షణం కాదని సంపత్కుమార వాదించారు. గణ విభజనను గురించి మా ఇద్దరి వాదాల్లోనూ కొంత కొంత నిజం ఉంది.

వృత్తాల్లో అక్షరాల పరిమాణం, పద్యపాదంలో వాటి స్థానం (The quantity and the place of occurrence of syllables) నిర్దిష్టం. అందువల్ల గణ విభజన వృత్తాల అంతర్నిర్మాణాన్ని గుర్తుపెట్టు కోవటానికి ఏర్పరచుకున్న Mnemonic device గా మనం అర్థం చేసుకో వచ్చు. గణంలో అక్షర పరిమాణ స్థానాలు నియతం గనక ఒక గణం ఒక అక్షర క్రమాన్ని మాత్రమే సూచిస్తుంది. ఈ క్రమాన్ని గుర్తుపెట్టుకోగలిగినప్పుడు మనకు గణాలతో పని ఉండదు. అంటే వృత్తాల పాదలక్షణ నిరూపణ గణవిభజన లేకుండానే చెయ్యవచ్చు నన్నమాట. ఈ గణాలకు మూడక్షరాలనే ప్రమాణంగా పెట్టుకోటానికి కారణం సంప్రదాయం తప్ప వేరే 'లాజిక్' ఏమీ ఉన్నట్టులేదు. ఎన్ని అక్షరాలు పరిమితిగా పెటు కున్నా ాటి ప్రయోజనం పాదంలో గురు లఘు క్రమాన్ని ంకేతం చెయ్యటమే.

జాతుల్లో (గీత, సీసాది పద్యాలు) అక్షరాల సంఖ్యా, క్రమమూ నిర్దిష్టంకాదు. ఉదాహరణకు గీత పద్యపాదంలో అక్షరాల సంఖ్య 12 నుంచి 17 వరకూ ఉంటుంది. ఒక పాదంలో 288 రకాల అక్షరక్రమా లుంటై. అంటే గీత పద్య పాదంలో అంతర్నిర్మాణాన్నిగాని, బాహ్యపరిమితిని గాని గణ సహాయం లేకుండా ఏకైక పద్ధతి (Unique way) లో చెప్పలేం. ఈ పద్యాల్లో గణక్రమమూ, గణసంఖ్యా నిర్దిష్టం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే జాతుల్లో పాదాల అంతర్నిర్మాణాన్ని, బాహ్యపరిమితిని అక్షరాల సహాయంతో ఏకైకపద్ధతిలో చెప్పలేం; గణాల సహాయంతో చెప్పగలం.

ఇక మాత్రా ఛందస్సుల విషయం. మాత్రా ఛందస్సుల్లో లయ ప్రధానం. ఈలయ మాత్రాగణాను సారి. లయ ననుసరించి మాత్రా పద్యాల అంతర్నిర్మాణాన్ని చెప్పాలంటే మాత్రా గణాలను గుర్తించక తప్పదు. అక్షరక్రమం నిర్దిష్టం కాదు గనక అక్షర పద్ధతి ఇక్కడ సాయపడదు. బాహ్యపరిమితినైనా అక్షర సంఖ్యలో చెప్పలేం. ప్రాచీనులు కొందరు మాత్రా పద్యాలకు లయ విరహితంగా లక్షణం చెప్పారు. అంటే మాత్రా పద్యాల్లో అంతర్నిర్మాణాన్ని గురించి వాళ్లు పట్టించుకో లేదన్నమాట. ఆ మేరకు వాళ్ల లక్షణం అసమగ్రం. మాత్రా గణాల్లో కొన్ని చోట్ల 'జ' గణాన్ని నిషేధించటానికి కారణాన్ని ఊహించటం కష్టంకాదు. మూడు మాత్రల గణాల్లో 'లగం', నాలుగు మాత్రల గణాల్లో 'జ' గణం, ఐదు మాత్రల గణాల్లో 'య' గణం, విలోమ గతి ఉన్న గణాలు. ఈ గణాల్లో ఊనిక గురువైన రెండో అక్షరం మీద ఉంటుంది. అవే మాత్రా సంఖ్య ఉన్న ఇతర గణాలు అనులోమ గతి ఉన్న గణాలు. వాటిల్లో మొదటి అక్షరం మీద ఊనిక ఉంటుంది. అయిదు మాత్రల గణాల్లో 'తగణం'లో రెండో అక్షరం మీదా, 'సలం'లో మూడో అక్షరం మీద, కూడా ఊనిక ఉండటానికి అవకాశం ఉంది. అయితే వాటిల్లో మొదటి అక్షరం మీద కూడా ఊనిక ఉంటుంది. అనులోమ గణాలుండాల్సిన చోట విలోమ గణాలుంటే లయ భంగ మవుతుంది. అందువల నే ముత్యాలసరంలో 'లగం' 'జగణం' వాడరు. ఖండగతి పద్యాల్లో 'యగణం' అయిదుమాత్రల గణమైనా వాడరు. లయను పట్టించుకోనివాళ్లు, లయను గ్రహించని వాళ్లు కొందరు వాడితే వాడవచ్చు. అవి అపవాదాలుగానే నిలుస్తై. నేటి కవుల్లో శ్రీ శ్రీ పద్యాల్లో అట్లాంటి వ్యతిక్రమణలు కొన్ని కనిపిస్తై. శ్రీ శ్రీ అయినా ముత్యాల సరంలో 'లగం' వాడిన ('జగద్గురు శంకరుం డేడీ') చోట్లున్నైగాని 'జగణం' వాడిన చోట్లు కనపడ లేదు. ఖండగతిలో యగణాన్ని మిగతా గణాలతో పాటు ప్రసిద్ధులైన తెలుగు కవులెవరూ వాడిన ఉదాహరణలు లేవు.

అసలు పద్యాలన్నిటికీ లయ ననుసరించే లక్షణం చెప్పాలని కీ. శే. గిడుగు సీతాపతి గారి వాదం. అంటే ఛందో విభాగమంతా మాత్రాబద్ధంగా ఉండాలని వారి వాదం సారాంశం. అయితే ఉన్న పద్యాలన్నిటికీ మాత్రా పద్ధతిలో లక్షణం చెప్పటం కుదరదు. లయ నిర్దేశించని పద్యాల్లో గతి వైవిధ్యానికి


అవకాశం ఉంది. మాత్రా ఛందస్సుల్లో గతిని మార్చటమంటే పద్యాన్ని మార్చటమే అవుతుంది. అయితే ఆధునిక కవులు ఒకే గతి ఉండాల్సిన పద్యాల్లో భిన్నపాదాల్లో భిన్నగతులు పాటించిన ఘట్టాలున్నై. ఉదాహరణకు 10 మాత్రల బాహ్య పరిమితిగల పద్యాల్లో కొన్ని చోట్ల ఖండగతిని, కొన్ని చోట్ల మిశ్రగతిని (3+4+3) పాటించారు. 12 మాత్రల బాహ్యపరిమితి గల పద్యాల్లో కొన్ని చోట్ల త్రిశగతి (3+3+3+3)ని, కొన్నిచోట్ల చతురస్ర (4+4+4) గతిని పాటించారు. 16 మాత్రల బాహ్య పరిమితిగల పద్యాల్లో కొన్నిచోట్ల చతురస్రగతిని కొన్నిచోట్ల మిశ్రగతి (5+3 లేక 3+5)ని పాటించారు. ముత్యాల సరాన్ని మాత్రం 3+4+3+4 క్రమంలోనే నడిపారు. వీటన్నిట్లోనూ పాటించిన ఒక సాధారణ సూత్రం ఉంది. సరి మాత్రా సంఖ్య బాహ్య పరిమితిగా గల మాత్రా పద్యాలు రెండర్థ భాగాలుగా విరుగుతై. 14 మాత్రలను 6+8 మాత్రల గణాలుగా విభక్తమయ్యేట్టు శ్రీ శ్రీ రాసిన పద్యాలు కొన్ని ఉన్నై. ఇవన్నీ చాలా మందికి తెలిసినవే కావటంవల్ల ప్రత్యేకంగా ఉదాహరణలు చూపించటం లేదు. ఒకే పద్యంలో భిన్నగతులతో పద్యపాదాలున్నప్పుడు వాటిని విషమచ్ఛందో భేదాలుగా పరిగణించాల్సి ఉంటుందనుకుంటాను.

మాత్రా పద్యాలకు మాత్రం లయ నిర్దేశం ఎందుకు చెయ్యాలి? అని అడగవచ్చు. లయ నిర్దేశించకపోతే మాత్రా పద్యంలో అంతర్నిర్మాణం ఉండదు. అక్షరక్రమాన్ని నిర్దేశిస్తే ఇవి వృత్తాలతో సమానమవుతై. ఇంద్ర, చంద్ర గణాలను నిర్దేశిస్తే అవి జాతుల్లో భాగమవుతై. మాత్రా పద్యాలు ప్రత్యేక ఛందస్సుగా నిలబడాలంటే వాటి నిర్వచనం మాత్రా గణాల్లోనే జరగాలి. ఒక్కో పాదానికి అంతర్నిర్మాణం భేదించినా గుర్తించదగిన పద్ధతుల్లోనే (Predictable ways) భేదిస్తుంది. అంతేకాని అసలు అంతర్నిర్మాణమే లేని మాత్రా పద్యం ఉండదు.


పై చర్చ సారాంశం ఏకైక పద్ధతి (Unique way) లో అంతర్నిర్మాణాన్ని, బాహ్య పరిమితిని సూచించాలంటే వృత్తాలకు గణనిర్మాణం అవసరంలేదని; జాతులకు, మాత్రా పద్యాలకు ఇది అవసరమని తేలుతుంది. 'గణాల దృష్ట్యా పాదానికి అంతర్నిర్మాణమంటూ ఏదీ ఉండదు.' అన్న సంపత్కుమార వాక్యం వృత్తాలకు మాత్రమే అన్వయిస్తుంది.

పైన పేర్కొన్న ఛందో భేదాల్ని ఈ కింది విధంగా అంతస్తుల బొమ్మలో చూపించవచ్చు.


1. వృత్తాలు



2. జాతులు



3. మాత్రాఛందస్సులు



ఈ బొమ్మల్లో పైనుంచి కిందికిగాని కింది నుంచి పైకిగాని పోవటానికి దార్లున్నై. అంతస్తులకు కుడిపక్కన అంతర్నిర్మాణ రేఖ, ఎడంపక్కన బాహ్యపరిమితి రేఖ ఉన్నై. వృత్తాల్లో అంతర్నిర్మాణ, బాహ్యపరిమితులను అక్షరక్రమం సాయంతో చెప్పవచ్చు కాబట్టి; గణ క్రమానికి, అక్షర క్రమానికి ఒకే దారి ఉంది కాబట్టి ఇక్కడ గణాల అంతస్తుని

తొలగించినా వచ్చే ఇబ్బందిలేదు. అందువల్ల ఈ అంతస్తుకి వచ్చే అంతర్నిర్మాణ రేఖ, ఈ అంతస్తు నుంచి పోయే బాహ్యపరిమితిరేఖ విరిగిన బాణపు గుర్తుతో సూచించబడింది.

రెండో బొమ్మలో గణాల అంతస్తునుంచి అక్షరాల అంతస్తుకి దారులు మూడు చూపించబడ్డై. ఇక్కడ మూడు బహుత్వానికి సంకేతం మాత్రమే. ఒక్కొక్క గణాన్ని ఏకైక పద్ధతిలో అక్షర క్రమంగా మార్చలేము. సూర్యగణాన్ని అక్షర క్రమంగా మార్చటానికి రెండు పద్ధతులు, ఇంద్ర గణాన్ని అక్షర క్రమంగా మార్చటానికి 6 పద్ధతులూ ఉన్నై. అట్లా కాకుండా నగణం, గలం, నగ, నల, సల భ, ర, త, వంటి గణాల సాయంతో గణక్రమం చెప్తే గణక్రమం నుంచి అక్షర క్రమానికి ఒకే దారి చాలు. అప్పుడు పాదంనుంచి గణాల అంతస్తుకి దారు లెక్కువ చూపించాల్సి వస్తుంది. అంటే ఈ వైవిధ్యాన్ని ఎక్కడో చోట చూపించక తప్పదు. ఏ పద్ధతిలో అయినా గణాల అంతస్తుని తప్పించుకోలేదు. భిన్న అక్షర క్రమాల్ని అక్షరాల అంతస్తులో నిర్మిస్తే గణాల అంతస్తుని తప్పించుకోవచ్చు. అప్పుడు పాదానికి అంతర్నిర్మాణాన్ని ఏకైక పద్ధతిలో చెప్పలేము. పైన పేర్కొన్నట్లుగా గీత పద్య పాదానికి 288 రకాల అక్షర క్రమాలను చెప్పాల్సి ఉంటుంది. అందువల్ల జాతుల అంతర్నిర్మాణ బాహ్యపరిమితుల నిర్వచనానికి గణాల సహాయం అవసరమవుతున్నది.

మూడో బొమ్మ కూడా రెండో బొమ్మలాంటిదే. ఇందులో కూడా గణక్రమంనుంచి అక్షర క్రమానికి దారు లెక్కువున్నై. ఇక్కడ కూడా మాత్రాగణాలకు బదులు అక్షర క్రమాన్నిబట్టి ఏర్పర్చిన గణాల (నిసర్గ గణాలు మొ॥) సాయంతో గణక్రమాన్ని సూచిస్తే అక్షర క్రమానికి ఒకే దారి సరిపోతుంది. అప్పుడు ఇక్కడ కూడా పాదంనుంచి గణ క్రమానికి దారు లెక్కువ చూపించాల్సివస్తుంది. ఇక్కడైనా గణాల అంతస్తుని తొలగించలేం. మాత్రా పద్యాల్లో అక్షర క్రమానికి ప్రాధాన్యం లేకపోయినా ప్రయోజనం ఉండటంవల్ల అక్షరాల అంతస్తు కూడా ఇక్కడ నిర్మించబడింది. అనులోమ విలోమ గతి భేదం గురు లఘు క్రమాన్నిబట్టే చెప్పాల్సిఉంటుంది గనక మాత్రా ఛందస్సులో అక్షరాల అంతస్తు అవసరమవుతున్నది. మాత్రలు ఒకే పరిమాణం గలిగినవి గనుక వాటిల్లో క్రమం అంటూ ఉండదు. మాత్రా పద్యంలో బాహ్య పరిమితి మాత్రా సంఖ్యను బట్టి ఉంటుంది గనక అడుగు అంతస్తునుంచి కూడా బాహ్యపరిమితి రేఖ మొదలు కావచ్చు. అంతర్నిర్మాణానికి మాత్రం గణక్రమమే ఆధారం. ఈ బొమ్మల్లో కొన్ని వివరాల్లో మార్పులు అవసరం కావచ్చు. కాని తెలుగులో ప్రచురంగా ఉన్న ఛందో భేదాల్ని అర్థం చేసుకోవటానికి ఇవి సాయపడతయ్యను కుంటాను.

పద్య పాదాల సామాన్య లక్షణాలుగా నేను ప్రతిపాదించిన అంతర్నిర్మాణ, బాహ్య పరిమితులను శ్రీ సంపత్కుమార ఎక్కడా స్పష్టంగా నిరాకరించలేదు. అంతర్నిర్మాణం గణాల దృష్ట్యా మాత్రమే లేదన్నారు. పైగా ఆయన 'అంతర్విభజన' అనే మాట నేనుపయోగించిన అంతర్నిర్మాణం అనే మాటకు సమానార్థకంగానే కనిపిస్తున్నది. ఆయన ప్రతిపాదించిన భావ గణాలకు ఇంతకన్నా వేరే ప్రయోజనంలేదు. 'ఒక భావం పూర్తిగావటంతో ఒక పాదం పూర్తి కావచ్చు. ఒకప్పుడు భావాంశంతో పూర్తికావచ్చు' అని అనటంవల్ల భావంతో పూర్తిఅయిన పాదంలో భావాంశాలుంటే అంతర్విభజన సాధ్యం కావచ్చు. ఒకే ఒక్క భావాంశమే పాదంలోఉంటే అంతర్విభజన కవకాశం ఉండదు. ఒక పాదంలో ఒకటి మొదలు ఎన్నైనా భావాంశా లుండవచ్చనుకుంటాను. 'ఒక భావం పూర్తి కావటంతో ఒక పాదం పూర్తికావచ్చు' అనటంవల్ల వచన పద్యపాదం గరిష్ఠ పరిమితి ఒక భావమని సంపత్కుమార ఉద్దేశంగా గ్రహించవచ్చు, వచన పద్య పాద కనిష్ఠ పరిమితి ఒక భావాంశమని కూడా అనుకోవచ్చు. కనిష్ఠ పరిమితి భావాంశంతోనూ, గరిష్ఠ పరిమితిని భావంతోనూ సూచించారు. అంటే నిర్దిష్టమైన 'అంతర్విభజన'ని కాని, బాహ్యపరిమితిని కాని ఆయన సూచించలేదు. ఒకవేళ మాటవరసకి

భావ, భావాంశాలనే వాటిని గణాలుగా గాని, గణతుల్యాలుగా గాని అంగీకరించినా, వీటి సహాయంతోనైనా అంతర్నిర్మాణ బాహ్యపరిమితులను నిర్దిష్టంగా చెప్ప లేదు కాబట్టి వచన పద్య పాదాల కివి నిర్దిష్టంగా లేవని అనుకోవాల్సివస్తున్నది. అసలు భావ, భావాంశ విభజన, తద్వారా పాద పాదాంతర్విభజన సాధ్యమవుతుందా? లేదా? అని చర్చించేముందు సంపత్కుమార గారు నేను వేసిన కొన్ని ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలను పరిశీలించాల్సి ఉంది.

వచన పద్యానికి పాద బద్ధత ఉందా? లేదా? అని తెలుసుకోటానికి నేను రెండు ప్రయోగాల (heuristic methods) ను సూచించాను. 1. పాద విభజన లేకుండా రాసిన లేక అచ్చువేసిన వచన పద్యానికి కవ్యుద్దిష్టమైన పాదవిభజన చెయ్యటానికి ప్రయత్నించటం, 2. ఇద్దరు లక్షణకర్తలు ఒకే రకమైన పాదవిభజన చెయ్య గలగటం. ఈ రెండూ సాధ్యంకావు కాబట్టి వచన పద్యపాద విభజనకు ఏకైక పద్ధతిలేదని నా వాదం. ఈ సందర్భంలో ఆయన ఒకేసారి రెండు పద్య పాదాలుగా గణవిభజన చెయ్యటానికి వీలున్న ఈ పద్య భాగాన్ని ఉదాహరించారు.

మధుర మధురమైన మామిడి పండ్లను
పంచి యిచ్చు జనుడె మంచి వాడు

ఇది ఆటవెలది పద్యంలో అర్థ భాగమూ కావచ్చు, సీసపద్యంలో ఒక పదమూ కావచ్చు. ఈ భాగాన్ని మాత్రమే ఉదాహరిస్తే కవి ఏ పద్యాన్ని ఉద్దేశించాడో చెప్పలేం. కాని పూర్తి పద్యాన్ని ఉదాహరిస్తే చెప్పటం తేలిక. పద్యమంతా ఇట్లాగే విభక్తమయితే కవి రెండూ ఉద్దేశించాడని చెప్పవచ్చు. యాదృచ్ఛికంగా పద్యమంతా ఇట్లాగే ఉండటం జరగదు. ఇక్కడ శ్రీ సంపత్కుమార ఉద్దేశం ఏమిటంటే కనీసం కొన్ని చోట్లనైనా, కొన్ని పాదాల్లోనైనా ఇట్లాంటివి సాధ్యం కాబట్టి ఆ భాగాల్నే ఉదాహరించి నప్పుడు కవి దేన్ని ఉద్దేశించాడో చెప్పలేము కాబట్టి, వచన పద్యాల్లోమాత్రం కవి ఉద్దేశించినట్టే వేరొకరు ఎందుకు గణ విభజన చెయ్యాలి? అని. కవి ఉద్దేశించిన పాద విభజన మనకు ఎందుకు ప్రమాణం కావాలి. నిజమే, అక్కర్లేదు. ప్రాచీన పద్యాల్లో కవి ఉద్దేశించిన పాద విభజన, లాక్షణికుడు చేసిన పాదవిభజన ఒకటే ఎందుకవుతున్నై? ఇద్దరూ ఒక సూత్రాన్నే అనుసరించటంవల్ల. అనుసరించటానికి ఒక సూత్రమంటూ ఉండటంవల్ల. అచ్చులో పాదవిభజనం చెయ్యటం, చెయ్యక పోవటం అనేది అప్రధానం. శార్దూలం వంటి పద్యాల్ని చిన్న సైజు పుస్తకంలో అచ్చువేసేటప్పుడు ఒక్కోపాదాన్ని రెండుగా విరిచి ముద్రించటం మనం చూస్తున్నాం. అయినా అక్కడ సందిగ్ధత కవకాశం లేదు. వచన పద్యంలో అట్లాంటి సందిగ్ధత కవకాశం ఉంది. పైన పేర్కొన్న 'మధుర మధురమైన' చోట్ల ఉన్న సందిగ్ధత వేరు. పైన ఉదాహరించిన భాగానికి రెండు విధాలైన విభజనే సాధ్యం. ఆ రెండూ రెండు సూత్రాలు ఒక చోట converge కావటం వల్ల ఏర్పడినై. ఇది systematic convergence. అట్లాంటిది వచన పద్యంలో ఉండటానికి వీల్లేదు. system ఉన్నప్పుడు గదా systematic convergence ఉండేది. దీన్ని Metrical ambiguity అనవచ్చు. వాక్య నిర్మాణంలో కనిపించే Syntactic ambiguity (దీన్ని తెలుగులో వ్యాకరణశ్లేషఅని వ్యవహరిస్తున్నాను) లాంటిదే ఇది. ఒక వాక్యానికి కేవలం భిన్న వ్యాకరణ సంబంధాలవల్ల భిన్నార్థాలు వస్తే వ్యాకరణశ్లేష అవుతుంది. ఈ భిన్నవ్యాకరణ సంబంధాలు ఒక వాక్యంలో ఏ పరిస్థితుల్లో Converge అవుతయ్యో Predict చెయ్యవచ్చు. ఈ పని వ్యాకర్తలది. ఆధునికులు చేస్తున్న వాక్యనిర్మాణ చర్చలో ఈ పరిశీలన కొంత కనిపిస్తున్నది. అట్లాగే Metrical ambiguity ని కూడా Predict చెయ్యవచ్చు. దీన్ని వివరించాల్సిన బాధ్యత ఛందః పరిశోధకులది. శ్రీ సంపత్కుమార చూపించినవే కాక ఇట్లాంటివి ఇంకా చాలా ఉంటై. ఉదాహరణకు యతి నియమాలను పాటిస్తూ 17 లఘువులతో పద్య పాదం రచిస్తే అది గీతమూ కావచ్చు, ఆటవెలది బేసిపాదమూ కావచ్చు. ఇందు క్కారణం సర్వలఘువులున్న గణం సూర్యగణంలోనూ

ఉంది. ఇంద్రగణాల్లోనూ ఉంది. ఆటవెలది బేసి పాదంలోను గీత పద్య పాదంలోను ఇంద్ర సూర్యగణాల సంఖ్య ఒకటే, క్రమంలోనే భేదం. సర్వలఘువులున్న పాదంలో ఈ రెండు రకాలయిన విభజన అందువల్ల సాధ్యమయింది. 'సూర్య—ఇంద్ర—సూర్య—ఇంద్ర—సూర్య' అనే క్రమంలో ఏదన్నా పద్యం ఉంటే అట్లాగా విభజించవచ్చు. ఇట్లాంటివే మరికొన్నిటిని గమనించండి.

(1) U | U | U | | | | | | | U |
U | U | U | | | | U | | | |

(2) U | | | | | U | | U | | | |
U | | | | | U | | U | U |

(3) U | | | | | | | | | | | | | | U |

ఈ పై కూర్పుతో మొదటి రెండు (1) గీత పద్య పాదమూ ఆటవెలది బేసిపాదమూ కావచ్చు. తరవాతి రెండు (2) గీత. ద్విపద పాదాల్లో ఏదైనా కావచ్చు. చివరిది (3) ఆటవెలది బేసిపాదమూ, ద్విపద పాదమూ కావచ్చు. ప్రయత్నించి చూస్తే ఒకే కూర్పు ఈ మూడు రకాలు అయ్యేట్టుకూడా చెయ్యవచ్చు. పై కూర్పుల్లో మొదటి గురువు స్థానంలో రెండు లఘువులున్నా మార్పేమీ ఉండదు. ఇట్లాంటి అవకాశాల్ని పరిశీలించి పరిశోధకులు వివరిస్తే ఛందస్సును గురించిన మన అవగాహన పెరుగుతుంది.

ఇంతకీ నా ప్రధానమైన ప్రశ్న ఇది. వచన పద్యానికి కవి ఉద్దేశించినా, లక్షణకర్త ఉద్దేశించినా పాద విభజనకు పద్ధతి ఏమిటి? 'భావాన్నిబట్టి' అని సంపత్కుమార సమాధానం. పాదాంతర్విభజనకీ ఇదే సూత్రాన్ని ఆయన ప్రతిపాదిస్తున్నారు. ఒక వచన పద్యాన్ని భిన్నలాక్షణికులు భిన్న విధాలుగా విభజించటం సంపత్కుమార గారు అనుకుంటున్నట్టు పైన పేర్కొన్న 'మధుర మధురమైన మామిడి పండ్లను......' అన్నదాన్ని సీసపద్యపాదంగా, ఆటవెలది అర్ధభాగంగా విభజించటం లాంటిదికాదు. ఒకే లక్షణ కర్తగాని, భిన్నలక్షణకర్తలు దాన్ని రెండు విధాలుగా—రెండు విధాలుగా మాత్రమే — విభజించటానికి అవకాశం ఉంది. ఈ లక్షణ భిన్నత్వంకూడా క్రమబద్ధమే. వచన పద్య పాద విభజనలో భిన్నత్వానికి కారణం లక్షణ భిన్నత్వం కాదు, లక్షణా భావం. ఎందువల్లనంటే భావ, భావాంశాలను గుర్తుపట్టటానికి గాని, పరిగణించటానికి గాని, ప్రమాణీకరించటానికి పద్ధతు లేమీ లేకపోవటంవల్ల. భావానికి గాని, భావాంశానికి గాని భాషలో అస్తిత్వం వ్యాకరణ సంబంధాలవల్లనే సాధ్యం. అంటే భాషలో ఇవి వ్యస్త పదాల వల్ల గాక పద బంధాల (Phrases) వల్ల, ఉపవాక్యాల (Clauses)వల్ల, వాక్యాలవల్ల వ్యక్తమవుతై. వీటి నిర్మాణాన్ని(Syntactic Structure) అంటారు. భాషా వ్యవహారంలో—అది సంభాషణైనా, కథా కథనమైనా, పద్యమైనా, గద్యమైనా, భావ వ్యక్తీకరణ (Syntactic structure) వల్లనే సాధ్యం. వ్యాకరణంతో నిమిత్తం లేకుండా భావ, భావాంశాలను ఎట్లా పరిగణిస్తారో నా ఊహకు అందటం లేదు. వ్యాకరణ సంబంధాల కతీతంగా భావం ఉంటుందంటే అందుకు నా అభ్యంతరం లేదు. కాని అది భాషలో ఎట్లా వ్యక్తమవుతున్నదనే నా క్కావల్సింది. అది వ్యాకరణ సంబంధాలవల్లనే (పదాలకు, పదాంశాలకూ అర్థాలుంటయ్యని, భావ వ్యక్తీకరణలో వాటికి ప్రాధాన్యం ఉంటుందన్న విషయం నేను కాదనటం లేదు. వీటి సంపుటీకరణాన్ని గురించి నే నుద్దేశిస్తున్నది.) సాధ్యమవుతుందని నా అభిప్రాయం. వ్యాకరణా తీతంగా భావ భావాంశాలను పరిగణించే సూత్ర మేమిటి? అని సూటిగా అడుగుతున్నాను. 'భావాన్ని, భావాంశాన్ని బట్టి వచన పద్యంలో పాద విభజన జరుగుతుంది' అంటే చాలదు. వీటిని గుర్తుబట్టే సాధనాలు ఇయ్యనంతవరకు ఎన్ని ఉదాహరణలు ఇచ్చినా ప్రయోజనంలేదు. పాద విభజనలో పద్ధతి ఉందనటానికి శ్రీ సంపత్కుమార ఈ కింది మాటల కూర్పుని ఉదాహరించారు.

'ప్రాణాలు బిగపట్టు కొని
సాగేరు ప్రయాణీకులు

నాయకుడు తిరిగి వస్తాడనీ,
తుఫాను శమిస్తుందనీ
నది పొంగు తగ్గే ననీ
ఆశతో అహరహమూ
దేనికైనా ఉద్ధృతి ఎంతసేపు?
దానికి వ్యతిరిక్తం తప్పదాపైన'
—మాదిరాజు రంగారావు.

చివరి రెండు పాదాలు భావాన్నిబట్టి, మొదటి ఆరు పాదాలు భావాంశాలను బట్టి విభక్తమయినయ్యని శ్రీ సంపత్కుమార వివరణ. కాని ఈ భావ భావాం శాల వ్యక్తీకరణ వ్యాకరణ మూలంగా జరిగిందని, ఇక్కడ పాద విభజనకు సూత్రమేదన్నా ఉంటే అది వ్యాకరణ సంబంధి అని నా వివరణ. చివరి రెండు పాదాలూ రెండు వాక్యాలు. వాటినే సంపత్కుమార భావాలన్నారు. మొదటి రెండు పాదాలు కలిపి ఒక వాక్యం. మొదటి పాదం క్త్వార్థక క్రియాంతమైన ఉపవాక్యం. ప్రధాన వాక్యాంశమైన రెండో పాదాని కిది Manner ని సూచించే విశేషణ వాక్యాంశం లేక ఉపవాక్యం (Attributive clause). క్త్వార్థక క్రియ వాక్యంలో ప్రవర్తించే తీరుల్లో ఇదొకటి. అంటే ఒక వాక్యంలో రెండు క్లాజుల్ని రెండు పాదాలుగా విడదీశా రన్నమాట. 3—6 పాదాలన్నీ కలిపి ఒక వాక్యం. కాని ఇక్కడ క్రియ లేదు. ఉంటే ఆరో పాదంలో ఉండాలి. కాని ఇక్కడ లోపించింది. బహుశా ఇది కవి శైలీ విశేషం కావచ్చు. ఆరోపించిన క్రియకు ఆరో పాదం విశేషణం అవుతుంది. 3, 4, 5 పాదాలు ఒక గర్భి వాక్యం (Matrix sentence) లో ఇమిడిన మూడు గర్భ వాక్యాలు (Constituent sentences). ఈ వాక్యాలకు 'అని' అనే అనుకరణాద్యర్థబోధక శబ్దం చేర్చటంవల్ల ఉపవాక్యా లయినై. అంటే పైన ఉదాహ రించిన భాగంలో పాద విభజన వాక్య నిర్మాణంలో వాక్య, ఉపవాక్య విభజన జరిగే పద్ధతి ననుసరించి జరిగిందని స్పష్టం.

ఈ సందర్భంలోనే కె. వి. రమణారెడ్డిగారి 'బాధా గాథము' అనే ఖండికలో నుంచి నేను ఉదాహ రించిన భాగాన్ని శ్రీ సంపత్కుమార మళ్ళీ ఉదాహ రించి 'కొంచెం లోపం ఉండవచ్చుగాక' అందులో పాద విభజన జరిగిందని నిరూపించటానికి ప్రయత్నించారు. శ్రీ రమణారెడ్డిగారి అంగార వల్లరి అనే పుస్తకంలో నుంచి కొంత భాగాన్ని నేను గ్రహించి అచ్చులో అది ఎట్లా ఉందో అట్లాగే నా వ్యాసంలో ఉదాహరించాను. అచ్చులో అక్షరాల వరస కాయితం మీద అక్షరాలు పట్టే చోటు ననుసరించి కూర్చబడింది. రమణారెడ్డిగారు 'బాధా గాథము'లో పాద విభజన ఉద్దేశించలేదు. (అట్లా అని నాకు రాశారు కూడా) నే నుదాహరించిన భాగంలో అవి నాలుగు పాదలుగా కనిపించటం కేవలం యాదృచ్ఛికం. రమణారెడ్డిగారి 'అంగార వల్లరి' అనే అచ్చు పుస్తకాన్ని శ్రీ సంపత్కుమార చూసి ఉండ లే దనుకుంటాను. చూస్తే 'బాధా గాథము'లో పాద విభ జన జరిగిందని పొరపాటు బడే అవకాశం ఉండేదికాదు. అట్లాగే తిలక్ రాసిన 'రాత్రివేళ' అనే ఖండికలో పాద విభజన జరిగినటు నాకు నమ్మకం లేదు' 'అమృతం కురిసిన రాత్రి' తిలక్ మరణించిన తరువాత అచ్చయిన పుస్తకం. అందువల్ల కవి ఏ ఖండికలో పాద విభజన ఉద్దేశించాడో, ఎక్కడ ఉద్దేశించలేదో తెలుసుకోటానికి అచ్చయిన పుస్తకమే ఆధారం. ఈ ఆధారంతో చూస్తే ఇక్కడ కవి పాద విభజనను ఉద్దేశించినట్టు తోచదు. ఇప్పుడు కనిపించే పాద విభజన తిలక్ పద్యాల్ని కాపీ చేసినవారో, అచ్చువేసిన వారో చేసి ఉండవచ్చు. అసలు కవి పాద విభజనను ఉద్దేశించాడో లేదో పూర్తిగా తెలుసుకోకుండా అస్పష్టమైన ప్రతిపాదనల ఆధా రంగా ఏ అప్పకవినో జ్ఞాపకం తెచ్చేట్టుగా 'ఛందో దోషాల్ని' ప్రస్తావించటంలో శ్రీ సంపత్కుమార కొంచెం తొందర పడ్డా రనుకుంటాను.

పాదాల అంతర్విభజనకు సంపత్కుమార భావ గణాలను ప్రతిపాదించారు. ఈ భావగణం భావమూ కావచ్చు, భావాంశమూ కావచ్చు. పాద విభజనకు కూడా వీటినే ప్రతిపాదించారు గనక ఒక్కో పాదంతో ఒక్కొక్కసారి ఒకే గణం ఉండవచ్చు. ఆ గణం భావాంశ గణమయితే అంతర్విభజన సాధ్యం కాదన్న

మాట. భావాంశాలుగా విభక్తం కాని భావగణమున్నా అంతర్విభజన వీలుపడదు. అయినా అభ్యంతరం లేదు. గణితశాస్త్రంలో Set theory ప్రకారం, దీన్ని సమర్థించ వచ్చు. ఒక పాదం గణాల Set అయితే అందులో ఒక వస్తువు (ఒక గణం) ఉన్నా Set అవుతుంది. ఒక Set తనలో తాను అంతర్భాగం కూడా అవుతుంది. అక్షర చ్ఛందస్సుతో ఏకాక్షర వృత్తాంతర్నిర్మాణాన్ని సమర్థించే మార్గం ఇదే అను కుంటాను. కాని భావ గణాలైన ఈ భావం, భావాం శాల స్వరూపాల్ని శ్రీ సంపత్కుమార ఇప్పటి వ్యాసంలో నయినా వివరించకపోవటం విచారకరం. 'భిన్నభిన్న వచన పద్య పాదాల్లో అక్కడ భావాన్ని స్ఫురింపజేసే పదాల స్థితిని బట్టి భావ గణ విభాజక రీతి ఉంటుంది' అన్న సంపత్కుమార వివరణ చాలా అసంతృప్తి కరంగా ఉంది. ఆ 'స్థితి' ఏమిటో నిరూపించే వరకూ భావగణాలస్థితి (Exestence) ని అంగీకరించలేను. వీరు ఆధారపడ్డ భావ స్ఫూర్తి వ్యాకరణ సంబంధాల వల్ల కలుగుతున్నదని నా వాదం. ఇంతకుముందే చెప్పి నట్లుగా వ్యాకరణాంశాలు వదిలేస్తే భావాలు దొరకవు. అందుకనే వారి భావగణాలను (వాటిని గణాలు అనాల్సి వస్తే) నేను వ్యాకరణ గణాలు అన్నాను. వ్యాకరణ రూపైకత అనటంతో ప్రతిగణమూ, ఇంకో గణంతో సమంగా ఉండటం కాదు నేను ఉద్దేశించింది. కొన్ని పద సమూహాలకు వ్యాకరణ సమత్వం ఉంటుంది. అట్లాంటివి ఒక గణం కావచ్చు. సమత్వ భేదాల్నిబట్టి బహువిధ గణా లుండవచ్చు. ఇంతకీ వ్యాకరణ గణాలను వచన పద్యానికి లక్షణంగా ప్రతిపాదించటం నా ఉద్దేశం కాదు. ఛందస్సులో వాడుకోదగిన వ్యాకరణ గణా లున్నయ్యని నేను నమ్మటంలేదు. కాని సంపత్కుమార ప్రతిపాదిస్తున్న భావగణాలు వ్యాకరణాంశాలను బట్టి విభక్తమవుతయ్యని, వ్యాకరణ గణాలనటంవల్ల వాటిని వ్యాకరణం సహాయంతో గుర్తుపట్టవచ్చునని నా ఉద్దేశం. శ్రీ సంపత్కుమార 'భావస్ఫూర్తి' అన్నా, భావ స్ఫూర్తి వ్యాకరణ పరిజ్ఞానం లేకుండా జరుగదు గనక, భావగణ విభజనలో వారికి తోడ్పడింది (వ్యక్తంగా కాక పోవచ్చు) ఈ వ్యాకరణ సంబంధాల పరిజ్ఞానమే. వ్యాకరణ విరహితంగా భావస్ఫూర్తి కలిగే పద్ధతి ఒక టుంటే, అది చూపించే వరకూ వారి భావ గణాలను వ్యాకరణ గణాలు అనే అనాల్సిఉంటుంది.

సాంప్రదాయిక ఛందస్సులో రచించిన పద్యా లను చదివే పద్ధతిని గురించి సంపత్కుమార కొంత ప్రస్తావించారు. పద్యాన్ని శబ్దం మధ్యలో విరిచి చదవం— అది గణాంతమైనా సరే, పాదాంతమైనా సరే. ప్రకృతి ప్రత్యయాలను గాని, విశేషణ విశేష్యాలను గాని, కలిపి చదవటానికి చదువరికి తన భాషను గురించి వ్యాకరణ పరిజ్ఞానం ఉండటమే. చదవటంలో భావస్ఫూర్తిని కలిగించేది ఈ వ్యాకరణ పరిజ్ఞానమే. అయితే ఆ పద్యాల్లో భావగణాల ప్రసక్తిగాని, వ్యాకరణ గణాల ప్రసక్తిగాని రాదు. ప్రసిద్ధంగా వాటికి గణ విభజన ఉంది. గణాల్నిబట్టి చదవాల్సిన అవసరం లేదు. నిజానికి ఈ వ్యాకరణాంశాల పాత్రను సంపత్కుమార పూర్తిగా తిరస్కరించటంలేదని ఆయన వ్యాసంలోని ఈ వాక్యాలవల్ల మనం చెప్పవచ్చు. 'వచన పద్య నిర్మాణంలో భావ స్ఫూర్తి విషయికంగా వాక్య నిర్మాణ రీతికి ప్రవేశం ఉంది కాబట్టి, వాక్య నిర్మాణానికి, వ్యాకరణానికి సంబంధం ఉంది కాబటి వ్యాకరణ రూపైకత అక్కడక్కడా భావగణ విభజనలో కని పించటం సహజమే. అంత మాత్రాన వ్యాకరణరూపై కత వల్లనే సర్వత్రా భావగణ విభజన జరుగుతుందన టానికి వీల్లేదు.' వ్యాకరణాంశాలకి, వీరున్నయ్యంటున్న భావాంశాలకి ఏకైక సంబంధం (One to one correspondence) ఉంది కాబట్టి వ్యాకరణ విరహి తంగా భావగణ విభజన సాధ్యంకాదని నా నమ్మకం. సాధ్యమని నిరూపించాల్సిన బాధ్యత శ్రీ సంపత్కు మార మీదే ఉంది. కేవలం భావస్ఫూర్తిని బట్టి అంటే చాలదు. వ్యాకరణ విరహితంగా భావస్ఫూర్తి ఎట్లా కలుగుతుందో కూడా ఆయన నిరూపించాలి.

సంపత్కుమార భావ గణాల సంఖ్యను గురించిన నా సందేహానికి సమాధానం ఇయ్యటానికి ప్రయ త్నించారు. 'దూరము—దుఃపలు — దుఃఖము — దుర్గతి' అన్నమాటలను ఉదాహరించి వాటిల్లో

మొదటి గుర్వక్షర స్వరూపంలో మార్పున్నా 'భగణం' అనే ఒకే పేరుతో పిలుస్తున్నాం కాబటి 'భావాన్ని ఆధారం చేసుకొని పదాల స్వరూపంలో వాటి కలయి కల్లో ఎన్ని తేడాలున్నా గూడా అది భావ గణమే. అది ఏకైకం' అని వివరించారు. పైన ఇచ్చిన మాటల్లో మొదటి అక్షర స్వరూపంలో భేదం ఉన్నా, సామ్యం కూడా ఉందని మరిచి పోగూ డదు. అంతేకాదు ఆ సామ్యాన్ని హేతుబద్ధంగా నిరూపించవచ్చు. గురు లఘు నిర్ణయం అక్షర (Syllable) పరిమాణాన్నిబట్టి జరిగింది. వ్యంజ నాన్ని C అనే గుర్తుద్వారాను, హ్రస్వాచ్చు V అనే గుర్తుద్వారానూ, దీర్ఘాచ్చును $\bar{V}$ అనే గుర్తుద్వారానూ సంకేతిస్తే గురు స్వరూపాన్ని ఈ కింది విధంగానూ చూపించవచ్చు.

$$C \bar{V}$$

$$C V C$$

పూర్వాపర వ్యంజనాలతో సంబంధం లేకుండా దీర్ఘాచ్చుకాని, పర వ్యంజనంతో మూతబడిన హ్రస్వాచ్చు గాని గురువు అవుతుంది. దీన్నే ఇంగ్లీషులో Long Syllable అని వ్యవహరిస్తారు. తక్కినవి లఘువులు. అక్షర పరిమాణాన్ని (Syllabic quantity) ని ఏర్ప డింది గురు లఘు విభేదం. ఇట్లాంటి నిశ్చితమైన సూత్రాలమీద ఏర్పడ్డ గురు లఘు క్రమాన్ని అనుస రించి తయారయిన గణాలకూ, భావగణాలకూ పోలికే లేదు. భావగణాలను పరిగణించటానికి వీల్లేదంటే అది వేరే మాట. కాని భావగణాల అపరిగణనకు ప్రాచీన ఛందస్సామ్యం ఇక్కడ అతకదు.

శ్రీ సంపత్కుమార ఇప్పటి వ్యాసంలోనయినా వచన పద్యాన్ని అంతర్నిర్మాణమూ బాహ్య పరిమితి ఉన్న పాదాలుగా విభజించటానికి స్పష్టమైన ప్రతిపాదన ఏదీ చెయ్యలేదు. ఆయన ఉన్నయ్యంటున్న భావ గణాలు వ్యాకరణాంశాలమీదనే ఆధారపడ్డ గనక అవి వ్యాక రణ గణాలే అవుతై. ఆయన భావ గణ పద్ధతికి వచన పద్యాన్ని గద్యం నుంచి వేరుచేసే శక్తి 'భావస్ఫూర్తి' ఆధారంగా విభక్త మవుతయ్యని సంపత్కుమార అంటున్న భావ గణాలు అన్నిరకాల భాషా వ్యవహారా ల్లోనూ ఉంటై. అయినప్పుడు ఆయన పద్ధతి ననుస రించి ఒక వ్యాసంలోని వాక్యాలను గూడ భావ భావాం శాల పద్ధతిలో పాద విభజనచేసి వచన పద్యంగా నిరూ పించవచ్చు. అచ్చులోగాని, రాతలోగాని కవి పాద విభ జనని సూచించటం ప్రమాణంగా తీసుకుంటే ఆ పని వ్యాసకర్త కూడా చెయ్యవచ్చు. ఈ నాటి కొన్ని ప్రకట నల్లో కూడా పాదవిభజన కనిపిస్తున్నది. భావ భావాంశ నిరూపణ అక్కడా చెయ్యవచ్చు. ఇకపోతే వచన పద్యంలో ఉండే కవితా పదార్థం దాన్ని వ్యాసాల నుంచి ప్రకటనలనుంచి వేరుచేస్తుంది కదా అంటే కవిత్వానికి గద్యంలో స్థానంలేదని అనాల్సి ఉంటుంది. రసహీనమైన పద్యాలు, రసవంతమైన గద్యం ఉంటయ్యని అందరూ ఒప్పుకుంటారు. కవిత్వం ఉన్నదల్లా ఛందో విభాగం అని, ఛందస్సులో ఉన్న దల్లా కవిత్వం అవుతుందని శ్రీ సంపత్కుమార అంటారనుకోను.

ఈ చిక్కులన్నిటికీ కారణం మనకు ప్రసిద్ధంగా ఉన్న ఛందస్సంప్రదాయంలో ఎక్కడోచోట ఈ వచన పద్యానికి చోటు కల్పించటంకోసం ప్రయ త్నించటం. ఏదోరకమైన ఛందస్సూ గణవిభజనా ఉన్నయ్యంటే వచన పద్యానికి అదనంగా ఏదో గౌరవం వస్తుందనుకోటం.

ఏవిధంగా చూసినా సంపత్కుమార చెప్పిన లక్షణాలు వచన పద్యాన్ని ఛందోవిభాగంగా నిలబెట్ట లేవు. అందువల్ల 'వచన పద్యం' పద్యంకాదని గద్యమే నని నేను పూర్వంచేసిన నిర్ణయాన్ని మార్చుకో వలసిన అవసరం శ్రీ సంపత్కుమార వ్యాసం కలి గించలేదు.

మారుతున్న కాలం - 'మాలపల్లి'

శ్రీ రామమోహన రాయ్

వాడుకభాషలో పుస్తకాలే కఱవుగా ఉన్నరోజుల్లో మాలపల్లి నవల రచించటమంటే అసాధారణ మైన ప్రతిభతో కూడుకొన్న పని. దేశం బానిసత్వంలో క్రమగ్గుతున్నప్పుడు రాజకీయ స్వాతంత్ర్యాన్ని మాత్రమేగాక సంఘంలో అణగారిన ఆర్తుల దీనాలాపాలను వివిపించుకొని వారి విముక్తికి ముందుగా ప్రయత్నం చేయాలని ఆలోచించిన మహారచయిత, మహామనీషి కీ. శే. ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు. గాంధీజీ దక్షిణాఫ్రికానుండి భారతదేశం తిరిగివచ్చి సంఘ సంస్కరణకు పూనుకోక మునుపే అంటరాని వారుగా అవమానాలకు గురి అవుతున్న మనుష్యుల కన్నీళ్లను తుడిచి, వారికోసం కలం పట్టారు. అటు బ్రిటీషు ప్రభుత్వానికిగాని, యిటు అగ్రవర్ణాల వారమనుకొనే వారికిగాని భయపడక ఆంధ్రజాతిని కదలించిన నవలను వ్రాశారు. ఉన్నవ వారు ఎం. ఏ. బార్—ఎట్‌లా చదివారు. బ్రిటీషు కొలువులో చేరి ఉంటే ఎంతో ఉన్నతోద్యోగి అయ్యే వారు. తనకు తానుగా ఎన్నుకొన్న దీనజన సేవలోనే కాలం గడిపారు. గుంటూరు జిల్లాలో పన్నుల నిరాకరణోద్యమాన్ని నడపటంలో వారిపాత్ర మరువరానిది. తెలుగు నవలకు నూరేళ్లు నిండిన తరుణంలో మంచి నవలలను లెక్కించాలను కుంటే మున్ముందుగా జ్ఞాపకానికొచ్చేది మాలపల్లి నవలే.

కీ. శే. వీరేశలింగం పంతులుగారు రాజశేఖర చరిత్రమ రచించి తెలుగు నవలకు ఒరవడి పెట్టారు గాని ఆయన భావ విప్లవాన్ని ప్రోత్సహించినంతగా భాషా విప్లవాన్ని ప్రోత్సహించ లేదు. ఇక ఉన్నవ వారు సవ్యసాచిగా భావ, భాషా విప్లవాలను ఏక కాలంలో నడిపించి దేశానికి, సారస్వతానికి గణనీయమైన సేవ చేశారు. దేశస్వాతంత్ర్యాన్ని కళ్లారా చూసిన తరువాత గూడ నిష్కామకర్మ చేసినట్లుగా పదవుల కెగబడలేదు. భాషా విప్లవాన్ని ఒక సుస్పష్టమైన రూపంలో దర్శించక ముందే తాము తలపెట్టిన 'తిక్కన' రచనను పూర్తిచేయకుండానే తనువు చాలించారు.

మాలపల్లి వ్రాసే నాటికి వాడుక భాషలో నవలలు లేనే లేవు. తనకష్టాన్ని వివరిస్తూ ఉన్నవ వారు 'మాదిరికి తగిన గ్రంథములు కూడా లేవు. సంస్కృతభాషా పాండిత్యం గాని, తెలుగు ప్రబంధముల పరిచయంగాని వాడుక భాషలో గ్రంథములు వ్రాయటానికి విశేషం తోడ్పడవు. శుద్ధమయిన తెలుగు భాష రావడానికి సంస్కృతభాషతో సంబంధంలేని పల్లెటూరివారితో పరిచయ ముండాలె. మొదట సంస్కృత పండితులూ, ఇప్పుడాంగ్లభాషా పండితులూ తెలుగుభాషయొక్క స్వభావాన్ని మార్చారు. అనేక భావాలను తెలియజేసే అచ్చతెలుగు మాటలున్నా సంస్కృతము నుంచో, యింగ్లీషు నుంచో మాట లరువు దీసుకోపటం మామూలయింది. అందువల్ల చక్కని తెలుగు మాటలన్నీ మూలబడి భాషలో సాంకర్య మెక్కువయింది. వీలయినంతవరకు తెలుగుభాషయొక్క నడక కనుకూలంగా యీ గ్రంథం వ్రాయటానికి ప్రయత్నం చేశాను' అని వ్రాశారు. 'భాషయొక్క ప్రస్తుత స్థితిలో వాడుక భాషలో వ్రాయటం కంటె గ్రాంథిక భాషలో వ్రాయడం సులభముగా' కనపడ్డదని కూడ అన్నారు. మనస్సు నాకట్టుకొనే తేటమాటల తీరుతియ్యము లోకవైపునా, సంస్కృత పదాలతో కూడిన వేదాంతార్థాలను వివరించే పదా లొకవైపునా చదువరులకు చిత్రమనిపిస్తాయి. ఇప్పుడీ నవల చదివే వారికి కొన్నిచోట్ల 'యిదేమి వాడుకభాష?' అనే ప్రశ్న ఎదురౌతుంది. ఐతే నేం ఏ మాత్రమూ ఇంగ్లీషుగాని

సంస్కృత నుడికారంగాని లేని తెలుగును ఎంత సహజంగా ఎంత తియ్యగా పలికించవచ్చునో తెలుస్తుంది. జాతీయాలు, సామెతలు, తెలుగు పలుకుబళ్లు మాలపల్లిలో సార్థకతను పొందాయనటం అతిశయోక్తి కాదు. దేశోద్ధారకులు నాగేశ్వర రావు పంతులు గారు తమ 'తొలి పలుకు'లో 'శ్రీయుత ఉన్నవ లక్ష్మీనారాయణ గారు సుప్రసిద్ధాంధ్ర నాయకులు, సంస్కర్తలు, సాహిత్య విశారదులు, కార్య శూరులు. శారదా నికేతనము, మాలపల్లి లక్ష్మీనారాయణగారి మానవధర్మ పరాయణత్వమునకు నిదర్శనములు. ప్రభుత్వము చేసిన నిషేధమే మాలపల్లికి ప్రఖ్యాతిని కలుగజేసినది......మాలపల్లి నవరసభరితమై రసానందముతో తాండవమాడుచున్నది' అని నవలకు యోగ్యమైన ప్రశంసల నందజేస్తూ దీనిని ఆంధ్రగ్రంథమాలలో నొక కుసుమముగా జేర్చుకొని ఆనందించారు.

మన నవలల్లో పల్లెటూరును 'బాక్ — గ్రవుండ్'గా చేసుకొని వ్రాసినవి చాల తక్కువ. ఉత్తమ నవలల్లో మాలపల్లి, కీలుబొమ్మలవంటివి కొద్దిగానే వచ్చాయి. దానికి కారణం మన రచయితలకు పట్నవాసాలతో ఉన్న పరిచయం ఆ వాతావరణాన్ని వ్రాయటంలోని సులువూ, పల్లెటూళ్ల వర్ణనల్లో కన్పించక పోవటం. కార్మికుల కష్టాలకు సానుభూతి చూపిస్తూ రచనలు చేసినంతగా పల్లెటూళ్లలోని వ్యవసాయ కూలీలు, పేదరైతుల జీవితాలను పరిశీలించక పోవటము. రైతుకూలీల సంబంధాలను నవలలో వ్రాసేటప్పుడు గూడ కూలీలపక్షం వహిస్తున్నామని వాస్తవాలను మసిబూసి మారేడుకాయ చెయ్యటం రచయితలు చేసే సామాన్యమైన పొరపాటు. కాని ఉన్నవ వారు చౌదరయ్యవంటి భూస్వాముల తత్త్వం ఎంత కుత్సితంగా, స్వార్థపూరితంగా, పగ సాధించేదిగా అమానుషంగా ఉన్నదో చెప్తూనే కూలీల కష్టాలను తెలుసుకొని వాళ్ల మంచిచెడ్డల లోపాలు పంచుకోవాలనుకొనే రామానాయడివంటి తర్వాతి తరానికిగల భేదాన్ని సూక్ష్మంగా గమనించగలిగారు. చౌదరయ్యకు లక్ష్మమ్మవంటి దయగల యిల్లాలుండటంకూడ సంభవమేనని యెంచారు.

నవలకు బరువనిపించే వేదాంత చర్చలకూ, ఉపన్యాసాలకూ ఎక్కువ చోటిచ్చి కొన్నిచోట్ల శిల్పానికి భంగకరమైన రచన చేశారు. దీనివలన సామాజిక ప్రయోజనం వెనుకబడి రచయిత అంతర్ముఖులై మరో మంచిలోకాన్ని అన్వేషిస్తున్నట్లు కనిపిస్తుంది. ముందు వ్రాయదలచుకొన్న మాలపల్లి నవల పోనుపోను ధర్మం జయించి, మంచి మనిషికి ముక్తిమార్గం చూపించిన 'సంగ విజయ'మని పిలవాలనిపించింది వారికే.

పల్లెటూళ్లలో ఆ నాటికి దుర్భరంగా ఉన్నాయని వర్ణించిన పరిస్థితులు నేటికీ మారలేదు. మాలమాదిగలను హీనంగా చూడటమూ, భూస్వాములు అయినదానికీ కానిదానికీ వాళ్లమీద చేయి చేసుకోవటమూ చిట్టచివరకు దుర్మార్గంగా వాళ్లను కొట్టి చంపినా కోర్టుల్లో ఏ శిక్షా పడకుండ తప్పించుకు పోవటమూ యీనాటికీ సాగుతూనే ఉన్నాయి. స్వాతంత్ర్యానికి పాతికేళ్లకు పూర్వమే వ్రాసిన మన సంఘంలోని ఘోరమైన స్థితిగతులు పాతికేళ్ల స్వాతంత్ర్యం తరువాత గూడ అట్లాగే సాగుతున్నాయి. ఈనవలలో ప్రధాన పాత్ర రామదాసుకు చెల్లెలైన సుబ్బలక్ష్మిని మునసబు గారి బసివిరెడ్డి కట్టి తీసుకొని కొడ్తే ఆమె ఆ తరువాత ఆస్పత్రిలో చేరుతుంది—ఆ తరువాత చచ్చిపోతోంది. ఆ దౌర్జన్యాన్ని ఎదుర్కోవాలనే సంగతి ఆ గూడెంలో ఎవరికీ తోచదు. ఆ పరిస్థితులు మారాలన్నకోరిక మాత్రం సంగదాసుకు కలుగుతుంది. కాని ఏం లాభం?

మంగళాపురంలో భూస్వామి చౌదరయ్య మరికొందరు 'పెద్ద'లతో కలిసి ధాన్యపు కూలిని మార్చి డబ్బు కూలి యియ్యటానికి ఆలోచిస్తాడు. ధాన్యం ధర పెరగటంచేత డబ్బుయిచ్చి కూలీల కడుపు కొట్టడానికి ఆలోచిస్తాడు. దీనిని ఎదుర్కొన్నది సంగదాసే. 'మనదేశంలో భూమిలో స్వామ్యం వ్యవసాయదారులకు లేదు. అది ప్రభుత్వానికిగాని మందికిగాని చెంది వున్నది...ఆసామీల కున్నది జిరాయితీ హక్కే...పూర్వం మందివల్ల హక్కు బొందిన దేశముఖులు లేక జమీందార్లు కొన్ని భూములు స్వంత కమతం కింద వుంచు

కొని మిగిలినవి తయితులకు కౌలుకిచ్చే వారు. ఆ కాలంలో కమతగాళ్లుగావున్న వాండ్లు చాలమంది యిప్పటి భూస్వాములైనారు. పూర్వం కమతగాండ్లకు కొంత పాలి హక్కుండేది. ఆ పాలేరు మారి యిప్పుడు జీతగాడైనాడు. అందువల్ల భూమితో అతనికుండే సంబంధం పోయింది ...... వ్యవసాయ విషయంలో జీతగాండ్లూ కూలీలు ముఖ్యులు. చెమటోడ్చి జనానికి భోజన పదార్థాలు సృష్టిజేసే వాండ్లు వాండ్లు. స్వంతగా దున్నే కౌలుదార్లు సైతం వీండ్ల లోనే చేరుతారు. వందల కొలది యెకరాలకు మంది వల్ల కౌళ్లు పొందిన పట్టాదార్లు వట్టి తనిఖీదార్లు... వ్యవసాయంవలన వచ్చేలాభం విశేషంగా యీ తనిఖీ దార్ల జేబుల్లోకే పోతూ వున్నది. వ్యవసాయానికి కూలీ ముఖ్యుడు గాని మీరుచెప్పే భూస్వామికాదు'— ఇంత ఖండితంగా చెప్పగలిగిన సంగదాసు సంఘాన్ని మార్చ జూడటమేగాదు—కూలీలను సంస్కరించ టానికి, మాలగూడాల అపరిశుభ్రతను తొలగించ టానికీ, పుగాకు నమలడం, త్రాగుడు, పశువు లను కోయటంవంటి అలవాట్లను మాన్పి వాళ్లకు సంఘా లేర్పాటు చెయ్యటానికి పూను కొంటాడు. అతడికీ ఉద్యమంలో తన సాటి మనుష్యులు కలిసి రాకముందే వివేకవంతుడైన వాడు, చదువుకొన్నవాడు అయిన రామానాయడు తోడ్పడతాడు. దేశంలో వచ్చే ప్రగతికి ఎవరెవరు తోడ్పడతారో క్రాంతదర్శియై ఉన్నవ వారు చెప్పగలి గారు. ఫలితాన్ని గూడ ఆయన సరిగానే చిత్రించారు. ఏమిటా ఫలితం? తనకున్న ఆస్తిహక్కును, దోపిడీ శక్తినీ ప్రశ్నించిన, కూలీలను సంఘటితపరుస్తున్న సంగదాసును చౌదరయ్య రాగోల దీసుకొని చావ గొట్టాడు. కేసు రాకుండ డబ్బు సంచులతో తన తాబేదారైన పంతులుతో సంగదాసు 'ఆత్మరోగం'వలన చనిపోయినట్లుగా పంచాయితీ జరిపించి 'మాఫ్' చేస్తాడు. ఈ భూస్వామి కూలీల వ్యవహారంలో ఉన్నవ వారెవరి పక్షం? ఎవరి పక్షమో చెప్పాలంటే నేల కొరిగిన సంగదాసు 'తల దానిమ్మపండువలె బద్ద లయింది. లోకంలోని అక్రమాలను జూచి ఆక్రోశించిన రక్తం, ఉన్నత భావాలను ఉద్రేకించిన రక్తం, పరుల సేవలో పారిపోయిన రక్తం, పవిత్రభావాలచేత పావన మైన రక్తం గొట్టాన జిమ్మినట్లు ప్రవహిస్తున్నది. భూమి పావనమైంది' అని చెప్పిన వర్ణనను తలచు కొంటే చాలు. ఎవరు గెలుస్తారన్నది ఆయన నిర్ణయం? సంగదాసు చివరగా చెప్పిన 'మనం గెలుస్తాం'అన్న మాటలు ప్రశాంత విప్లవవాదులైన ఉన్నవ వారి హృదయంలో నుండి వెలువడినవే.

సంగదాసు తిరుగుబాటు అహింసాత్మకంగాను, కూలీలను విజ్ఞానవంతులనుచేసి వారికి న్యాయం జరిగేవిధంగా వారిని మేల్కొల్పాలనేదిగా ఉండగా సంగని అన్న వెంకటదాసు తత్త్వం విరుద్ధమైనది. అతడూ కాయకష్టం చెయ్యటంలో ఒళ్లు దాచుకోవటం ఎరగని వాడే. ఎంత కష్టపడ్డా కూలీల పొట్టలు ఎందుకు నిండటం లేదో గుర్తించాక అతడు భూస్వామ్య వ్యవస్థను ఎదుర్కోవటానికి దోపిడీ ఒక్కటే మార్గమని తలచి యిల్లు విడిచి వెళ్లిపోతాడు. దోపిడీ తన మార్గమని ప్రకటించే ముందు వెంకటదాసు తన తండ్రితోను, చుట్టపక్కాలతోను తనది ధర్మమార్గమని వాది స్తాడు. 'గరిమెళ్ల గంగరాజు మా గురువు. మాది తిరు మంగయ్య గోత్రం. ఋషులు తిరుమంగయ్య, కంచర్ల గోపన్న, సర్వాపాపడు' అని చెప్తాడు. చదువుకోని వెంకటదాసు యింత తెలివిగా వాదించటమేగాక తన నాయకత్వంలో గొప్పసైన్యాన్ని నమ్మిన ధర్మాన్ని విడిచి పెట్టకుండ నిలబడ గలిగిన వేలాదిమందిని తయారు చేస్తాడు. తన సిద్ధాంతాన్ని వివరిస్తూ వెంకటదాసు 'లోకాన్ని పీల్చి పిప్పిచేస్తున్న ధన పిశా చాలను సంహరింపవలె నంటే ధర్మశాస్త్రాలు చాలా తిరిగి వ్రాయవలసి వస్తవి. ఈ ధర్మశాస్త్రాల ఫలితమే యీ ధన పిశాచాలు...యీ పోరు రోజులలో నెలలలో,సంవత్సరాలలోగూడ తెమిలేది కాదు.శతాబ్దాలు పట్ట వచ్చు' అని చెప్తాడు. అతని స్నేహితుడొకడు 'మీ నాయనది సత్యవాక్యం. పితృవాక్య పరిపాలన చేస్తే అందరికీ క్షేమం' అని సలహా చెప్తాడు. వెంకటదాసు 'పితృవాక్య పరిపాలనం శ్రీరాములు వారు

చేసారు. దశరథుఁడు ధర్మమేమీ వదలుకో మనలేదు. అధర్మమేమీ చేయమనలేదు. రాములు స్వార్థ త్యాగం చేయవలసి వచ్చింది. చేశాడు. ధన్యుడైనాడు. ప్రహ్లాదు డెందుకు పితృవాక్య పరిపాలనం చేయలేదు? చేయ టానికి వీలులేకపోయింది. తండ్రి కోరింది కేవల స్వార్థత్యాగం కాదు. ధర్మత్యాగం. ప్రహ్లాదుడు తన ధర్మం విడువలేకపోయినాడు. అందువల్ల బాధలు వచ్చినవి. సహించాడు. వీరందరు ఆయనను ప్రశం సించారు.' అని మిత్రుని సలహాను తృణీకరిస్తాడు. తర్వాత తన వాదనలో దైవాన్ని నిరాదరించి 'నేను మీ రాజుమీదా, దేవుడిమీదా సవాలే. ఉభయుల చట్టాలకూ అతీతుణ్ణి' అని ఆ విధంగావే జీవితం చాలిస్తాడు.

వెంకటదాసు తక్కెళ్ల జగ్గడుగా మారిన తరు వాత జగ్గని ధర్మతత్వాలనే పేరుతో ఉన్నవ వారు వ్రాసిన తత్వాలు మరపు రానివి. అహింసామూర్తి గాంధేయ సిద్ధాంతాల తోను, ఆచరణలోను నమ్మకం ఉన్నవవారు జగ్గని దోపిడీ విధానాన్ని ధర్మాభిరతినీ ప్రశంసిస్తూ

'కూలికి విలువ గలదని మీరు—గుట్టు తెలుసుకొండి
కూలికి దగిన విలువ పుచ్చుకునె-కూలికి మరి పొండి
నీళ్లకూలికి వొప్పకుంటిరా—నెనరు చెరుపుకొండ్రు
పనివాండ్లందరు యేకమైతిరా ప్రపంచమే మీది'-

—అని వ్రాయటం ఆయన విశాలహృదయంతో సమసమా జాన్ని కోరే సామ్యవాద వ్యవస్థను సమర్థించ టానికి నిదర్శనం. అంతలోనే ఆచరణకు మాత్రం గాంధీజీ పద్ధతులే శ్రేష్ఠమని తలంచటంచేత గాబోలు

'అసహాయయోగము తరుణము చూచి అవలం బించండి.'

'సమతాధర్మం ప్రపంచమందున స్థాపింతురు గాని కృతయుగధర్మం లోకమంతటా కుదుటపెట్ట గలరు' అని వ్రాశారు.

తక్కెళ్లజగ్గడు ఉరఫ్ వెంకటదాసైతే కృత యుగ ధర్మాన్ని కోరడు. ఉన్నవవారిలోని గాంధేయవాది యీ మాటల్ని వ్రాసినట్లనుకోవాలేగాని వెంకటదాసు అనుచరు లీ మాటలను పలికినట్లనుకోలేం.

జగ్గడు ప్రభుత్వానికి దొరికి పోయిన తరువాత కోర్టులో యిచ్చిన వాఙ్మూలం మాక్సింగోర్కీ రచించిన 'అమ్మ' నవలలో పావెల్ వాఙ్మూలంవలె చిరస్మర ణీయమైనది. వెంకటదాసును ధీరునిగా చిత్రించి ఉన్నవ వారు తెలుగు సాహిత్యానికి మరపురాని పాత్రను సృష్టించి యిచ్చారు. చారిత్రకంగా జరిగిన అల్లూరి సీతారామరాజు పితూరీ, పలనాటి వీరహనుమంతు తిరుగుబాటు వారికీ పాత్రను తీర్చిదిద్దటానికి, వెంకట దాసు పోరాటాలను కళ్లకు కట్టినట్లుగా వర్ణించ టానికి తోడ్పడివుంటాయి. మరణశయ్యపైన వెంకట దాసు తండ్రితో భగవంతుడు దయామయుడు కాడంటాడు. లోకమంతటినీ పంచమహాపాతక పట్నం చేసిన దేవుడంటూ ఒకడుంటే జనమంతా ఆయన మీద తిరుగబడి సన్మార్గవర్తిని చేయుట మవసరం. 'మీ దేవుడు ఆలనాపాలనా లేని పరరాజువలె వున్నాడు గాని జనుల కష్టనిష్ఠూరాలు యోచించే స్వదేశీ ప్రభువుగా లేడు. ఎక్కడో స్వర్గంలో వున్నా డంటారు. చేతగాని వాడు అక్కడవుండి యీ ప్రపంచ పాలన యెందుకు నెత్తినబెట్టుకోవాలె? దేశంలో దుర్మార్గ మింత యెందుకు ప్రబలాలె?' నంటాడు. ఈ మాట లనే ఆనాటి బ్రిటీషు ప్రభుత్వానికి, బ్రిటీషు చక్ర వర్తికి అన్వయించుకొంటే ఉన్నవ వారి కలం ఎంత వాడియైనదో వ్యంగ్య రచనలో ఆయన గొప్పతన మేమిటో తెలుస్తుంది.

రామదాసు వెంకటదాసుకు నచ్చజెప్పబోతూ 'ఆస్తిక్య విషయంలో నీ కభిప్రాయభేద మున్నదనుకో. ఆ పవిత్రనామం స్మరించినందువల్ల నీకు నష్ట మేమున్నది' అని ప్రశ్నిస్తాడు.

'నష్టమా? అది ఆత్మవంచన అవుతుంది. 'బహుధా విభజ్య మప్యేవం ననమేయంతు కస్యచిత్' చేయి విరిగింది—కాలు తెగింది. మిగిలిన మొండాన్ని వేయిగా విభజించినా యెప్పుడూ నా శిరస్సు వంచను. చీలికలు గూడ వంగవు' అని దేహాన్ని త్యజిస్తాడు.

వెంకటదాసు నోటివెంట హిరణ్యకశిపుని మాటలను ఉదహరించటం సమయోచితంగానే గాక ఉన్నవవారు హిరణ్యకశిపుని పాత్ర నే విధంగా అర్థంచేసుకొన్నదీ తెలుస్తుంది. ఉన్నవవారి శిష్యులు ఆమంచర్ల గోపాల రావు గారు 'హిరణ్యకశిపుడు' నాటకం వ్రాయటానికి గురువుగారు చూపిన త్రోవ బాగా ఉపయోగపడింది.

సెటిల్మెంటు ఖయిదీల తోపాటు రామదాసుకు అతని కుటుంబాన్ని జయిలులో పెట్టినప్పుడు ఆనాటి జైళ్లలోని దుర్భర పరిస్థితులను సుదీర్ఘంగా వివరించారు. ఇది నవలా శిల్పాన్ని కొంతవరకు పాడుచేసినప్పటికీ ఆనాడు మన జాతి కెంతో మేలుచేసింది. బానిసత్వంతో బాధలు పడుతున్న ప్రజలకు జైళ్లలో దేశభక్తులు అనుభవిస్తున్న బాధ లేమిటో తెలిసి సానుభూతితో వాళ్ళూ కదిలారు. ఉన్నవ వారు స్వయంగా అనుభవించిన కష్టాలే చాల భాగం వా రీ నవలలో వర్ణించినవి. దేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత గూడ జైళ్ల స్థితి గతులు మారవలసినంత మంచికి మారలేదు. జైళ్లు నేరస్థులను మంచి మార్గానికి మార్చలేకపోగా జైళ్లలో జరుగుతున్న దురాగతాలు పత్రికలలో మనం తఱచుగా చదువుతూనే ఉన్నాం. ఉన్నవ వారు జీవించి ఉంటే మళ్లీ కార్యాచరణకు పూనుకొని రచనల ద్వారాను, సత్యాగ్రహాల ద్వారాను కదలి ఉండేవా రనిపిస్తుంది. జైళ్లను గుఱించిన విపులమైన వర్ణన నవలా శిల్పానికి భంగమని తలచేటప్పుడు దేశోద్ధారకులు 'మాలపల్లియందు వర్ణించిన సెటిల్ మెంట్లు, జైళ్లు, కోర్టులు, బడులు, పోలీసు, ఖద్దరు, సహాయ నిరాకరణము, ధర్మదోపిడులు, స్వరాజ్యము, పని పాటలు, అహింసా ధర్మము మొదలగు విషయములకు సంబంధించిన ఆఖ్యానోపాఖ్యానముల మూలమున మాలపల్లి ఒక మహా భారత మయినది. ఈ విషయముల పరిశీలనము జ్ఞానదాయకము. మాలపల్లి యందలి ప్రతి పుటయందును, భాషయందును, భావముల యందును, రచన యందును నవజీవనోద్యమములు గోచర మగుచున్నవి. చదివిన కొలది యును పాఠకులు నవజీవన సాహిత్య ప్రభావమును గ్రహింపగలరు.' అని చెప్పిన మాటలను మననం చేసుకోవటం మంచిది. ఒక్కొక్కప్పుడు రచయిత బాధ్యతను గుర్తిస్తే సామాన్య లక్షణాలను తృణీకరించే గొప్ప కళాఖండం వెలువడుతుంది—మాలపల్లి అటువంటి కళాఖండం.

హింసాహింసలు విప్లవానికి రెండూ రెండు త్రోవలు. ఉన్నవ వారు అహింసామార్గాన్ని అవలంబించినా నవలలో మాత్రం సంగదాసు, రామదాసులు నడిచిన అహింసామార్గమూ, వెంకటదాసు నడిచిన హింసామార్గమూ రెండూ కూడ మంచివేనని నిపుణంగా చిత్రించారు. ఆయన ఆస్తికులైనప్పటికీ, నాస్తికులు పవిత్రులూ ధర్మమార్గగాములు అయినప్పుడు మెచ్చేవారు. కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరిగారి గ్రంథాలను, సిద్ధాంతాలను ఆయన అభిమానించటమే గాక వారి వాదనలలోని సామంజస్యాన్ని గుర్తించి గౌరవించే వారు.

జ్యోతి అప్పాదాసుల ప్రణయం ఉదాత్తమైనది. పాలు అనే దుర్మార్గుడు బలాత్కరింప బోగా జోతి కృష్ణలో పడి ఆత్మహత్య చేసుకొంటుంది. అప్పాదాసు 'సహగమనం' చేస్తాడు. జోతిని పూలతో అలంకరించి

'నీకూ నీవారు లేరు నాకూ నావారు లేరు
యేటి వొడ్డున యిల్లు గడదాం పదరా'

—అని పాడుతూ కృష్ణలోకి నడిచి వెళ్లిపోతాడు. అప్పుడు కృష్ణ గుసగుసలాడుతూ సంగీతం పాడిందట. ఇంకా పాడుతూనే వున్నదట. ఈ నవల కీ ప్రణయగాథ నిండుదనాన్నిస్తున్నది.


మాలపల్లి నవలలో చెప్పుకోవలసింది ఉన్నవ వారి కృషీవల జీవిత పరిశీలనమూ, తేటతెలుగు మాటలలో జాతీయాలతో నుడికారపు సొంపులతో పల్లీయుల మాటలను సహజంగా రచించటమూ. నిఘంటువులలో సామాన్యంగా కానరానివీ, దేశీయుల సొత్తైనవీ వ్యవసాయదారుల నోళ్లలో నిత్యమూ నలిగేవీ వీరి కలంలో జీవం పోసుకొని నవలలో నాట్యం చేశాయి.

ఆ మాటల అందచందాలను గుర్తించి భద్రపరచుకో వలసిన అవసరం ఎంతైనా ఉన్నది. రేగడి చేలో దుక్కి దున్నుతున్న రామదాసు తలంపులతో నవల ప్రారంభమై చేను, దొడ్డి, ఇల్లు, కుటుంబము, బర్రె, గొడ్లకాపరులు—ఇట్లా వరుసగా సుదీర్ఘంగా సాగిన యీ నవల రామదాసు యతియై విజయ కళాశాల కులపతియై పరబ్రహ్మముతో ఐక్యం కావటంతో ముగుస్తుంది. 'ఎద్దుల కెండ తగులుతున్నది. ఇంకా ఒకటి రెండేండ్లకు గాని తుమ్మపికె యెక్కిరాదనే' రైతు తలపు, బంగారపు రాగిరేకల గుత్తులవలె సొంపు గులుకుతూ కంకులు పచ్చనిసుంకు పోసుకోవటమూ; ఊచ బియ్యమూ, తియ్య దోసకాయల రుచి, మజ్జిగన్నం దాగి చేతులూ, దుత్త కడిగి గుడ్డవుసిమి దుత్తలో వెయ్యటమూ, ఉప్పునీళ్లలో కలిపి తాగిస్తే గేదెలు కట్టటమూ ఒకటేమిటి రచయితకు వ్యవసాయ దారుల జీవితంలో అనుభవానికి రాని విషయం లేదు.

వేదాంత విషయాలను లోతుగా చర్చించగలిగిన పరిజ్ఞానం ఉన్నవారు—ఉన్నవవారు. 'ప్రేమ రహితమైన జ్ఞానం చవిటిసేల వంటిది.' అని ఆయనే ఒకచోట చెప్పినట్లు ఆయన జ్ఞానులను, అజ్ఞానులనూ కూడ ప్రేమించారు. పామరులలోనుండి వెలసిన తత్త్వవేత్తలైనవారు వ్రాసిన గ్రంథాలను—వెంకమ్మగారి రాజయోగసారమూ, శేషాచల నాయుడుగారి గురు కీర్తనలూ, శివరామ భాగవతులవారి తత్త్వ కందార్థాలూ, పీరయ్యగారి యేలలూ, సీతారామాంజనేయమూ, బుచ్చయ్యగారి సాధన చతుష్టయమూ, శ్రీరామ శాస్త్రులవారి భక్తియోగము—ఇంకా పోతులూరి వీరబ్రహ్మము, ఎడ్ల రామదాసు మొదలైనవారి తాత్త్విక రచనలను ఉపనిషత్తులూ, పురాణాలూ, భాష్యాలూ, ఇతిహాసాలతో సమానంగా గౌరవించి ఆదరించారు. జానపద గేయాలలో ఉన్న మాధుర్యాన్ని చక్కగా అనుభవించి నవలలో తగిన విధంగా ఉపయోగించారు. 'భారత కృష్ణుడు—భాగవత కృష్ణుడు' అనే విషయాన్ని గూర్చి చర్చించగలిగిన ఐతిహాసిక విజ్ఞానం

వారి కున్నది. ఇంత విపులంగా చర్చలను నడిపించటం పతితలను విజ్ఞానులను చేస్తుందేగాని విసిగింపదు. అక్కరలేనివారు ఆ భాగాలను విడిచిపెట్టి చదివినా నవల గొప్పదనమేమీ తరిగిపోదు. ఉన్నవ వారు శుష్క వేదాంతి కారు. కారు గనుకనే కూలీల కడుపులోని ఆకలిని, ఆ ఆకలిని తీర్చుకోలేక పొద్దుగూకులూ పని చేసి గూడ వాళ్ళు రాత్రికి కడుపులో కాళ్ళెట్టుకొని పడుకొని, అట్లా పడుకోవటాన్ని మడత కుడుములని పిలుచుకుంటారని తెలిసి, నిలువెల్లా కరిగిపోయి మనలను కదలించిన కరుణామూర్తి ఆయన.

మాల మాదిగలను సంఘంలో తమతో సమానంగా చూడలేక హరిజనులని మహాత్ముడిచ్చిన ముద్దుపేరును ముద్దు ముద్దుగా పిల్చుకుంటూ, తమ అత్యాచారాలను మునుపటిలాగే కొనసాగిస్తున్న ప్రబుద్ధులను చూచినప్పుడు 'మాలపల్లి' నవల నాటి పరిస్థితులేమీ మారలేదనిపిస్తుంది. పరిస్థితులను బాగు చెయ్య జూస్తున్న ప్రభుత్వం గాయాన్ని మాన్పడానికి మందు వెయ్యకుండ, గాయం కనిపించకుండ ఉండాలని రంగు పులుముతున్నట్లున్నది. 'భక్తివీది వలపు బ్రాహ్మంబుతో పొత్తు బాయలేను నేను బసవలింగ' అని యీ శతాబ్దంలో గూడ వర్ణభేదాలను పాటించే కుహనా గాంధేయవాదుల్ని చూసినప్పుడు నిజమైన సంస్కర్త, త్యాగమూర్తి, ప్రజాసేవకుడూ లక్ష్మీనారాయణ పంతులుగారు తమ సమకాలికులలో హృదయ పరివర్తనం కొంత కలిగించినా, బ్రిటీషు ప్రభుత్వాన్ని బెదిరించగలిగినా, సంఘం ఎప్పటి మోస్తరుగానే ఉన్నది. బ్రిటీషు ప్రభుత్వం ఉన్నవ వారిని చెఱసాలలో బంధించి, మాలపల్లిని నిషేధిస్తే తరువాత మన ప్రభుత్వం ఆయనను ఉపేక్షించటం ద్వారా మరింత తప్పుచేసింది. 'జాత్యాధిక్యత అహంకారమునకు హేతువగుటచే సవర్ణులు భగవంతునకు దూరమగుచున్నారు. కడజాతివారికి మే మెక్కువను అభిమానముండదు గనుక వారికి ముక్తి సమీపము. సవర్ణులకు అహంకారము ఆ జన్మసిద్ధము. కడజాతికి అనహంకారము జన్మసిద్ధము.' అని ఉన్నవ వారు చెప్పిన మాటలను జ్ఞాపకానికి తెచ్చుకొంటే సవర్ణుల అహం కొంతైనా తగ్గుతుంది. ప్రగతిని కోరేవారూ, సాహిత్యంలో వెలుగును కోరేవారూ లక్షలాది కడజాతివారి గుండె వెతలను విన్పించే 'మాలపల్లి' మన జాతి గర్వించదగిన నవల అని గుర్తింప గలరు.



భయం

శ్రీ కె. యస్. వి. నరసింహం

చిట్టిబాబుకు పుట్టు మతిమరుపు.

ఆ సంగతి తెలీనివాళ్లు ఆ వూళ్లోనేకాదు, ఆ చుట్టుపక్కల వూళ్లలో కూడా లేరు.

కాశేశ్వర్రావుగారి నెరిగిన వాళ్లందరికీ చిట్టిబాబు సంగతి తెలుసు. చిట్టిబాబు మతిమరుపు సంగతీ తెలుసు.

'ఇంతకీ ఈ కాశేశ్వర్రావుగా రెవరయ్యా?' అనడుగుతారా?

చంపేశారు.

మీకు కాశేశ్వర్రావుగారే తెలీదా? — అయితే మీకు కృష్ణాపురమే తెలీదన్నమాట. కృష్ణాపురం పంచాయితీ సమితిలో కొచ్చే ఆ చుట్టుపక్కల వూళ్ల గురించి కూడా మీకు తెలీదన్నమాట! ఆ వూళ్ల లోంచి ఎప్పుడో ఆర్నెల్లకో సంవత్సరానికో ఒకసారైనా మీవద్దకు వచ్చిపోగల పరిచయస్థులుగాని, బంధువర్గంగాని, ఎవ్వరూ లేరన్నమాట! అయితేనేం?— మీకు కాశేశ్వర్రావుగారే తెలీదా? చంపేసి పోయారే! బాబ్బాబూ—ఆ సంగతి ఎక్కడా గట్టిగా అనకండి. నన్ను కాబట్టి ఏదో గుట్టుగా అడిగారు గాని, మరెక్కడా ఈ సంగతి గురించి వాకబు చెయ్యకండి.

కాశేశ్వర్రావుగా రెవరంటే ఏమని చెప్పను? ఆయన్ని వర్ణించి చెప్పాలంటే నేను నేర్చిన మాటలు చాలవు. ఆయన వంశవృక్షం ఏకరువుపెడితే, వినే ఓపిక మీకు తప్పకుండా ఉంటుందనే చెప్పగలను— కాని, అసలే శక్తిచాలని నా కలం మధ్యలో అలసటతో ఆగిపోకుండా ఉండదని హామీ ఇవ్వలేను. అందుచేత, అలవిగాని పనుల్లో తలదూర్చకుండా, నా ఓపినంతమట్టుకు కాశేశ్వర్రావుగారిని మీకు పరిచయం చేస్తాను (—అదీ, ఇలా నేను వారిని 'పరిచయం' చెయ్యడానికి సాహసించానని మీరెక్కడా అనకుండా ఉంటారని బాస చేస్తేనే సుమండీ—)

దగ్గరకెళ్లి కొలిచే తెంపరితనం ఎవ్వరికీ లేదుగాని, ఉంటే— కొలిచి, ఆయన ఛాతీ గజమున్నరని చెప్పవచ్చు. ఆరడుగులో— అంతకుపైన మరో అరడుగో—ఎత్తు. పంచాస్యం అనే మాటకి వ్యుత్పత్తితో అర్థం చెప్పేట్టుండే ముఖం. ఆ ముఖం అంతటిలోకీ, ఆ మాటకొస్తే మనిషి మనిషంతటిలోకీ, కొట్టొచ్చినట్టు కనిపించే బొద్దుమీసాలు. నిప్పు కణికల్లాంటి కళ్లు. నడిపాపటతో పక్కలకి ఎగదువ్విన తలవెంట్రుకలు. గోచీపోసికట్టిన ఎర్రంచు తెల్లపంచె. పులిచారల పసుపులాంటి రంగులో సిల్కు జుబ్బా. దానిపైన—మడత నలగని సరిగ ఖండువా.— అలా ఉంటారు కాశేశ్వర్రావుగారు. ఉంటారు, ఏం చేస్తుంటారు?

తల్లి కడుపులోంచి కాకుండా మరోలా ఎలాగైనా మీరు భూమ్మీదికి రాగలరేమోగాని, కాశేశ్వర్రావుగారి భూములు తొక్కకుండా మాత్రం కృష్ణాపురంలోకి రాలేరు. వారి వంశపు వృత్తి వ్యవసాయం. వంశాచారాలను కాశేశ్వర్రావుగారు ఎన్నటికీ అతిక్రమించరు. అలాగని ఆయన వ్యవసాయంతో ఆగిపోమా ఆగిపోలేదు.

కాశేశ్వర్రావుగారికి రాజకీయాల పిచ్చి ఉంది. కాని, ఆయన పిచ్చికో పద్ధతి ఉంది. ఆయనకు చదరంగం ఆడడం బాగా వచ్చు; జీవితంలో కూడా. ఆయనకు మంచిపలుకుబడి ఉంది. పలుకుబడిని ఉపయోగించుకునే చాకచక్యం కూడా ఉంది. ఆ సంగతి; ఆయన మొట్టమొదటిసారిగా రాజకీయాల్లో ప్రవే

శించి, రెండు నెలలకల్లా సమితి ప్రెసిడెంటై కూర్చునే సరికే బుజుజ్వైంది.

అన్నింటినీమించి, కాశేశ్వర్రావుగారిలో ఒక రాజ ఠీవి ఉంది. ఒక దర్పం ఉంది. ఒక కరుకుదనం ఉంది. ఆయన మాటకు వేటకత్తికున్నంత పదును ఉంది; కమాండర్ జనరల్‌గారి తుపాకీ తూటాకున్న పవరూ ఉంది. ఆయనకు అగ్నిహోత్రంలా ధగధగలాడే పెర్స నాలిటీ ఉంది. ముందుకాలంలో చక్రవర్తులన్నా, రాజు లన్నా జనం ఎలా భయపడేవారో—ఇప్పుడూ కాశే శ్వర్రావుగారంటే అలాగే భయపడతారు, ఆ చుట్టు పక్కల చాలామంది. ఆయన అకారణంగా ఎవ్వరికీ అపకారం చెయ్యరు—అని అందరికీ తెలుసు. అయినా ...యం.

ఆయన పేరు చెబితే చాలు, ఎంతగా మారాం చేసే పిల్లలైనాసరే, టక్కున అల్లరి మానుకుంటారు. ఆయన పేరు వినబడితే, పిట్టలు నీళ్లు తాగవు—తాగ బోయేవి ఆ ప్రయత్నం మానుకుంటాయి–తాగిన పిట్ట లైనా నీళ్లు కక్కేస్తాయి.

—అయ్యా! — వారు, కాశేశ్వర్రావుగారు—ఆయన్నిగురించి, ఇహ, ఇక్కడితో ఆపుదాం.

పులుల్ని చూసిన వాళ్లుండొచ్చు. పులి పిల్లల్ని చూసిన వాళ్లుండొచ్చు. కాని, పులి కడుపున పుట్టిన మేకపిల్లని, దానిగురించి వినడమేగాని, ఎవరైనా నిజంగా చూశారా? కాశేశ్వర్రావుగారు పులిఅయితే, చిట్టిబాబు మేక.

పుట్టినప్పుడు–మామూలుగా ఉండవలసిన పరి మాణం కన్నా కొంచెం చిన్నగా ఉన్నాడు చిట్టిబాబు. అప్పుడతణ్ణి చూసినవాళ్లందరూ అతణ్ణి చిట్టిబాబు చిట్టిబాబని పిలిచారు. తమ తండ్రిగారైన భుజంగరావు బహద్దరు వారి పేరే కొడుక్కి కూడా పెడదామను కున్నారు కాశేశ్వర్రావు గారు. అనుకోవడ మేమిటి?—ఆ నామధేయమే పెట్టారు కూడా. కాని, ఎందు చేతనో ఏమో—చిట్టిబాబుని ఆ పేరుతో ఎవ్వరూ పిలవలేదు. రోజులు గడిచినకొద్దీ అతనికి చిట్టిబాబనే పేరే స్థిరపడిపోయింది. ఈ పద్ధతి నచ్చని కాశేశ్వర్రావు గారు, ఇందుకు అడ్డుతగలబొయ్యారుగాని—తరువా త్తరువాత, 'జనవాక్యంతు కర్తవ్యం'—అను కున్నారో ఏమో, తాముకూడా చిట్టిబాబుని చిట్టిబాబనే పిలవ డం ఆరంభించారు.

ఇంతకీ మనం ఎక్కడ ఆరంభించాం?—ఓ—మరిచే పోయాను—

'చిటి బాబుకు పుట్టుమతిమరుపు' దగ్గర—అవును —అక్కడ ఆరంభించాం.

అవునౌను, చిట్టిబాబుకు పుట్టుమతిమరుపు!

పుట్టుగ్రుడ్డి వాళ్ళనీ, పుట్టు చెవిటివాళ్ళనీ, పుట్టు అవిటి వాళ్ళనీ—ఎలాంటి వాళ్ళనైనాసరే—మనం కొంచెం ప్రయత్నంమీద వెంటనే తెలుసుకో గలం. కాని, పుట్టు మతిమరుపువాళ్ళని తెలుసు కోవడం ఎలా? — అసలు, పుట్టు మతిమరుపు వాళ్ళుంటూ ఎవరైనా ఉంటారా?

ఉంటారనడానికి ప్రస్తుతానికి చిట్టిబాబుని మినహాయించి వేరే ఉదాహరణ అవసరం లేదు.

మతిమరుపూ పరధ్యానమూ ఒకటి కావు.

చంటి బిడ్డలందరూ అసలు, పరధ్యానంలో ఉండే వాళ్ళే! కాని, వాళ్ళది మామూలు పరధ్యానం కాదు. 'బొటన్రవేల ముల్లోకములు చూచి లోలోన—ఆనందపడు నోరులేని యోగి' అని వర్ణించారే—అలా—అది ఒక యౌగికమ్మైన ధ్యానమేకాని, పరధ్యానం ఎంత మాత్రమూ కాదు. నోట్లో బొటనవ్రేలు పెట్టుకుని, ఇంటి పైకప్పుకేసి చూస్తూ, బోసి నవ్వులు చిందిస్తూ ఉన్న చిట్టిబాబును చూసిన వాళ్ళందరూ, అందరి బిడ్డల్లాగే అతడూ పరమాత్మ స్వరూపమే అనుకున్నారు గాని; దేవ దేవుడు చిట్టిబాబు రూపంలోఉన్న తన స్వరూపానికి కొంచెం బలహీన మ్మైన జ్ఞాపకశక్తిని పెట్టాడని ఎవ్వరూ అనుమా నించలేదు. ఇంకా మాటలైనా తిరగని ఆ పిల్లణ్ణి గూర్చి అలా అనుకోవలసిన అవసరమూ, అవకాశమూ కూడా అప్పట్లో కలగలేదు.

అయితే—అసలు సంగతి ఎన్నాళ్లని దాగుతుంది? బుడిబుడి నడకల ప్రాయం దాటుతూ దాటుతూ ఉండగానే చిట్టిబాబు మతిమరుపుతనం మెల్లమెల్లగా బయటపడిపోయింది. ఆడుకునే బొమ్మల్లో ఏదో ఒక దాన్ని ఎక్కడో ఒకచోట వదిలి మరిచిపోయేవాడు. మళ్లీ దానికోసం ఇల్లంతా తిరుగుతూ వెదుకుతూ ఉండేవాడు. పెద్దలెవరైనా వెతికి అందిస్తే పుచ్చుకుని, వాళ్లకేసి చూసి కిలకిలా నవ్వేవాడు. అయితే ఆ ధోరణిని చూసి, పిల్లడికి ఇంకా జ్ఞానం పూర్తిగా రాలేదని అనుకున్నారేగాని, దాన్ని మతిమరుపని ఎవ్వరూ అనుమానించలేదు. కాని, ఆ వూళ్లో స్కూల్లో చేరిన కొద్దిరోజులకే ఆ సంగతి తేటతెల్లమైపోయింది. చదువుల్లోనూ, ఆటపాటల్లోనూ చాలా చురుగ్గా ఉండేవాడేగాని, హఠాత్తుగా ఎప్పుడో ఒకప్పుడు—మతిమరుపుగా ప్రవర్తిస్తుండేవాడు చిట్టిబాబు. టైంటేబిలు చూసికూడా, ఒకరోజు తీసుకుపోవలసిన పుస్తకాలు మరో రోజు తీసుకు పోయేవాడు. ఆటల్లో పడి పుస్తకాల సంగతి మరిచి పోయే వాడు. స్కూలునుంచి ఇంటికి వస్తూ—పెన్సిలో, కలమో, పుస్తకాలో, చెప్పులో—రోజుకు కనీసం ఒకటైనా—స్కూల్లోనే మరిచిపోయి వచ్చేవాడు. కాశేశ్వర్రావుగారి యెడల గల భయంవల్ల—మేష్టార్లో, పిల్లలో, బంట్రోతులో—ఆ వస్తువుని మళ్లీ ఇంటికి తెచ్చి అప్పగించేవారు—'చిన్నయ్యగారికి మరీ ఇంత మతిమరుపేంటండీ బాబుగారూ!—', అని సాశ్చర్యంగా విన్నవించుకునేవారు.

కాశేశ్వర్రావుగారు కూడా చిట్టిబాబుయొక్క ఈ ధోరణిని గమనించక పోలేదు. కాని, విషయాన్ని ఆయన అంతగా పట్టించుకోలేదు. మతిమరుపులేని దెవరికి? మనుషులన్న తరువాత అందరూ అప్పుడు కాకున్నా ఇప్పుడు—ఎప్పుడో ఒకప్పుడు — పప్పులో కాలేసే వాళ్లే కదా!

అంతే అయితే చిక్కులేదు. కాని,

అందరు మానవుల్లోనూ అంతో ఇంతో ఉండగల మతిమరుపు చిట్టిబాబులో కొంచెం ఎక్కువగా ఉన్నేంది. అబ్బాయి గారు పెరిగి పెద్దవారౌతూ వచ్చే సరికి, రోజు రోజుకూ తగ్గడానికి బదులుగా—అది దినదిన ప్రవర్థమానమౌతూ వచ్చింది.

ఒకసారి కొడుకును కూడా తనతో పొలం తీసుకెళ్లి, ఏదో పనిబడి ఏదో విషయం—ఇంట్లో చెప్పి రారా—అని పంపిస్తే, ఇంటికైతే వచ్చాడుగాని చిట్టిబాబు—తండ్రి చెప్పమన్న విషయ మేమిటో పూర్తిగా మరిచిపోయాడు. ఇంకొన్ని దినాలకు, దగ్గరి మిత్రులు కొందరితో కలిసి పొరుగూరి సంతకు వెళుతూ, ఇంట్లోంచి పాతిక రూపాయలు తీసుకెళ్లి, సంతలో డబ్బెవరో కొట్టేశారంటూ ఏడుస్తూ తిరిగొచ్చాడు. తీరా చూసుకుంటే—ఆ డబ్బు అసలతను తీసుకునే వెళ్లలేదు—ఇంట్లోనే ఉంది! ఇంకా కొన్నిరోజులకు—టౌన్ హైస్కూల్‌నుంచి శెలవులకు ఇంటికొస్తూ, రైలు దిగి సంచీతో చక్కా ఇంటికొచ్చి, కొంతసేపటికి కెవ్వున కేక వేశాడు—

హోల్డాలు రైల్లోనే మరిచిపోయాడు! అర్జెంటు పనిమీద వెళుతూ, కవర్లలోపెట్టి పోస్టు చెయ్యమని ఒకసారి తండ్రి రెండుత్తరాలు ఇచ్చివెళ్ళగా వాటిని అర్జెంటుగానే పోస్టుచేశాడు చిట్టిబాబు. ఒకరికి వెళ్ళాల్సిన ఉత్తరం మరొకరికి వెళ్ళిందని పదిహేనురోజుల తర్వాతగానీ తెలిసిరాలేదు!

నిన్న సాయంత్రం చేసినపని, ఇవాళ ప్రొద్దునయేసరికి మరిచిపోయి ఉండేవాడు. ఒకరికి ఏదైనా ఒకవస్తువు ఇస్తే, అంతే, ఇంక ఆ సంగతి మరిచిపోయేవాడు, అవసరం వచ్చినప్పుడు ఆ వస్తువుకోసం ఇల్లంతా వెదికి, ఎక్కడో పోగొట్టుకున్నానని అంగలార్చేవాడు. రెండు మూడు పనులేవైనా చెబితే, తప్పనిసరిగ్గా ఏదో ఒకటి మరిచిపోయేవాడు—ఎలా మరిచిపోయావని అడిగితే—'అప్పటికీ నాకు అనుమానంగానే ఉంది – ఇంకా ఏమిటో చెప్పారు గదా అని, కాని, ఎంతబుర్ర బద్దలు కొట్టుకున్నా ఏమీ జ్ఞాపకం రాలేదు' అనేవాడు.

ఇన్ని సంగతులు మరిచిపోయినా, చదువు విషయంలో మాత్రం మతిమరుపులేదు చిట్టిబాబుకు, క్లాసువెంట క్లాసు ఫస్టున ప్యాసౌతూ కాలేజీ చదువు

పూర్తి చేశాడు. యూనివర్శిటీ మెట్లు కూడా ఎక్కాడు. ఎమ్మేపట్టా పుచ్చుకున్నాడు. 'చదివేదేమో సరదాకి చదివావు—ఇంకేం చేస్తావు? వ్యవసాయం చేస్తావా? ఉద్యోగం చేస్తావా??' అనడిగారు కాశేశ్వరరావు గారు.

కిక్కురుమనలేదు చిట్టిబాబు. తండ్రిముఖం చూస్తేనే గుండెల్లో అదురువస్తుంది. ఆయనమాట వింటే, పిడుగులమోత వింటున్నట్టుంటుంది. అసలే భయస్థుడు చిట్టిబాబు. ఇంక అలాంటి తండ్రి ముందు నిలబడి, నోరువిప్పి మాట్లాడ్డం కూడానా?

కొడుకును వ్యవసాయంలో పెట్టాలను కున్నారు కాశేశ్వరరావుగారు. 'కాని, చిట్టిబాబు తల్లి అందుకు ఒప్పుకోలేదు. 'ఇంతచదువూ చదివి వృధా చెయ్యడమెందుకు? ఇప్పు డిప్పుడే వ్యవసాయంలో దిగితే సుఖపడ్డం ఏముంది? బస్తీ చదువులు చదివినవాడు—వాడు వ్యవసాయం మాత్రం ఏం చేస్తాడు?—ఎక్కడైనా ఉద్యోగం దొరుకుతుందేమో చూడండి—' అందావిడ.

కాశేశ్వరరావు గారికి్కూడా లోపల్లోపల అలాంటి ఉద్దేశ్యమే ఉన్నట్టుంది—వెంటనే ఒప్పుకున్నారు. కొడుక్కి ఉద్యోగం దొరుకుతుందేమోనని ప్రయత్నించారు. కాశేశ్వరరావుగారు ప్రయత్నించడమూ—దొరక్కపోవడమూనా? దొరికింది. కాని, ఎక్కడ?—హైదరాబాదులో. జీతం కూడా చిట్టిబాబు చదివిన చదువు తాహతుకు తగ్గట్టుగానే వస్తుంది.

'హైదరాబాదులో దొరికింది ఉద్యోగం—వెళతావా?', అనడిగారు కాశేశ్వరరావుగారు.

చిట్టిబాబు ఏమీ మాట్లాడలేదు. తండ్రి పంపిస్తూంటే హైదరాబాదేమిటి—అండమాన్సయినా సరే...ఎదురుచెప్పే దేముంది?

ఆ ధకంగా హైదరాబాదు వెళ్ళాడు చిట్టిబాబు.

కాని, అతడటు వెళ్ళిన వారం రోజులకల్లా చిట్టిబాబు తల్లి కొక అనుమానం పట్టుకుంది. అసలే అతి మహానగరం, పైగా కొడుకు మతిమరుపు వాడు. ఏ క్షణాన ఏ ఆపదకు గురి అవుతాడో ఏమో—తల్లి మనసు ఆకులా వణికిపోయింది. మరేం ఫర్వాలేదు- అలాంటి భయమేం లేదు—అన్నారు కాశేశ్వరరావు గారు. తన భయం తనదంది చిట్టిబాబు తలి. కొడుకు క్షేమ సమాచారాలు ఎప్పటికప్పుడు తెలుస్తూ ఉండక పోతే, తను ఒప్పుకోనంది. సరే నన్నారు కాశేశ్వరరావు గారు. కొడుక్కొక ఉత్తరం రాశారు. పక్షం రోజుల కొకసారి తన క్షేమ సమాచారాలు తెలుపుతూ చిట్టిబాబొక ఉత్తరం రాయాలి. ఏమాత్రం ఆలస్యమైనా, కాశేశ్వరరావుగారే హైదరాబాదు వచ్చేస్తారు!

తండ్రి మాట జవదాటడు చిట్టిబాబు. అలాగే రాస్తానన్నాడు. అలాగే రాస్తూ ఉన్నాడు. పక్షం రోజులకు కాదు—పదమూడో రోజుకల్లా చిట్టిబాబు దగ్గర్నుంచి ఉత్తరం అందుతోంది.

అంతా ఇలా ఉండగా ఒకనాడేమైందయ్యా అంటే......

* * *

'నమస్కారాలండయ్యగారూ!'..., అన్నాడు ఆ వూరి పోస్టుమాస్టరూ పోస్టుమ్యానూ అయిన వెంకట సుబ్బయ్య.

చదువుతూన్న పేపర్లోంచి తల తిప్పకుండా, తలను అలాగే ఊగించి నమస్కారాన్ని అందుకున్నారు కాశేశ్వరరావుగారు. చదువుతూన్న 'కాలం' పూర్తిగా పూర్తిచేసి, అప్పుడు తల తిప్పారు.

'ఓ—నువ్వా—ఏమొచ్చాయి ఉత్తరాలు?'—

'చి—చిత్తం. చిత్తూరు ఎమ్మెల్యేగారు కాబోలు—జాబు రాశారండీ...అనంతపురంనుంచి ధనంజయరావు గారు కాబోలు—క్షమించాలి...ఈ ఫ్రం అడ్రస్‌లో అక్షరాలు కొంచెం చెదిరిపోయున్నాయి—వారు రాశారండీ—మదరాసు ఎరువుల కంపెనీనుంచి కూడా ఉత్తరం వచ్చిందండీ...పోతే......కార్డొకటి వచ్చిందండీ...అయ్యొ నా మతిమండా...మరిచేపొయ్యాను...హైదరాబాదునుంచి జాబొచ్చిందండీ...చిన్నబాబుగారు రాశారు—',

వినయంగా వంగి ఉత్తరాలు స్టూలుమీద పెట్టాడు వెంకటసుబ్బయ్య.

'ఎలా ఉంది నీ ఉద్యోగం', అన్నారు కాశేశ్వ్రరావుగారు.

'బాగుందండీ.. తమ దయ—'

'సరే—మంచిది—'

'చి—చిత్తం—మరి నే నెళ్ళొస్తానండీ—నమస్తే...'

వెంకటసుబ్బయ్య వెళ్ళిపోయాడు.

వాలు కుర్చీలోంచి చేయి సాచి ఉత్తరాలు అందుకున్నారు కాశేశ్వ్రరావుగారు. కొడుకు రాసిన జాబుకాక మిగతా జాబులన్నీ ముందు చదివారు. అలా కొడుకు రాసిన ఉత్తరాన్ని మాత్రం చివ్వరికి కేటాయించడానికి కారణం ఏమిటి? కొడుకు ఉత్తరం కాబటి —తీరిగ్గా చదువుకో వచ్చుననా? పదిహేను రోజులకోసారి వచ్చే మామూలు ఉత్తరమేగా—అందులో కొత్త ఏముంటుందిలే—అనా? కారణం ఏదైనా కావచ్చు; కాశేశ్వ్రరావుగారు కొడుకు ఉత్తరాన్ని మాత్రం అన్నింటికన్నా ఆఖరుగా చేతుల్లోకి తీసుకున్నారు.

అది కవరు, దానిమీద ముత్యాల్లాంటి అక్షరాలలో కాశేశ్వ్రరావుగారి పేరూ, చిరునామా వ్రాసి ఉన్నాయి. ఎడమవేపు దిగువన, కొంచెం చిన్న అక్షరాలలో—చిట్టిబాబు పేరూ విలాసమూ ఉన్నాయి. 'ఫ్రం' అడ్రెస్‌ను మిగతా అడ్రస్‌నుంచి విడదీస్తూ చక్కటి వంపులతో బ్రాకెట్టు ఒకటి వేసి ఉంది. కవరువేపు నిమిషకాలం అలాగే చూశారు కాశేశ్వ్రరావుగారు. కొడుకు దగ్గర్నుంచి జాబువస్తూనే దానికేసి అలా చూడ్డం ఆయనకు అలవాటు, అందమైన ఆ చేతివ్రాత చూస్తే ఆయన కళ్లలో సన్నని గర్వరేఖ కదలాడుతుంది. గుబురు మీసాల వారగా పదునైన చిరునవ్వు మెరుస్తుంది.

కవరును వెల్తురు కడ్డంగా పెట్టిచూసి, చించారు కాశేశ్వ్రరావుగారు. కాగితాన్ని చేతుల్లోకి తీసుకుని మడతలు విప్పారు. కళ్ళను అక్షరాలవెంట నడిపించారు.

ఉలిక్కిపడ్డారు.

నుదుటిమీద ప్రశ్నార్థకంగా ముడతలు పడ్డాయి.

మరోమారు కాగితంకేసి చూశారు. కవరుకేసి చూశారు. రెంటినీ రెండు రెండుసార్లు మార్చి మార్చి చూశారు.

ఆయన కళ్లు కుంచించుకు పోయాయి.

కవరుకేసీ, కాగితంకేసీ ఇంకోసారి చూశారు. మెల్ల—మెల్ల—మెల్ల—మెల్ల—గా ఆయన కుడి కనుబొమ పైకి లేచింది.

ఏదో అర్థమౌతూన్నట్టు ఆయన తల అప్రయత్నంగా చిన్నగా ఊగింది.

ఆయన పెదవులు అనుకోకుండానే అతికఠినమైన వంపు తిరిగాయి.

తొందర తొందరగా కాగితాన్ని చదివారు కాశేశ్వ్రరావు గారు—

'డియర్ గిరిజా!—

నీ ఉత్తరం నిన్ననే అందింది. జవాబు రాయడానికి ఇప్పటిదాకా తీరిక దొరకలేదు—Excuse me.

నే నిక్కడ ఒంటరిగా ఉన్నాను. ఎప్పుడూ నువ్వే జ్ఞాపకం వస్తున్నావు. కాలేజీ దినాల్లోనే నయం—మనం రోజూ ఒకర్నొకరు చూసుకుంటూ అయినా ఉండేవాళ్లం. మాటలతో వీల్లేనప్పుడు కనీసం చూపులతోనైనా పలకరించుకుంటూ ఉండేవాళ్లం. ఇప్పుడదీ లేదు.

ఎంత మహానగరంలో ఉన్నా అడివిలో ఉనట్టుగా ఉంది. ఈ ఉద్యోగం నా పాలిట శాపంలా దాపురించింది. ఏం చెయ్యమంటావు చెప్పు? 'మేఘసందేశం'లో యక్షుడు అనుభవించిన విరహం ఎంత విషాదంగా ఉంటుందో నా కిప్పుడే అర్థమౌతోంది.

మీ వాళ్లు నీకు సమ్మంధాలు చూస్తున్నారని

రాశావు. ఆ సమ్మంధాల నన్నింటినీ కొట్టిపారెయ్య డానికి నువ్వెన్ని అవస్థలు పడుతున్నావో తలుచుకుంటే నాకు చాలా బాధ కలుగుతోంది. మన విషయం మీా అమ్మా నాన్నలతో నువ్వింకా చెప్పలేదా? వీలు చూసుకుని చెప్పగలవేమో ప్రయత్నించు—

నీ విషయం ఇంత చెప్పినా, నా సంగతి కొచ్చే సరికి కథ మొదటికి వస్తుంది. మా నాన్నగారి విషయం నీకు చెప్పానుగా—ఆయన ముక్కోపి. ఆయనతో ఏం మాట్లాడాలన్నా నాకు భయంగా ఉంటుంది—

వెంటనే ఉత్తరం రాయగలవు. నేను జాబు రాయలేదని నువ్వు లేటు చెయ్యకు. నీ దగ్గర్నుంచి జాబు రాకపోతే నాకు పిచ్చెత్తినట్టుగా ఉంటుంది.

నీ,
చిట్టిబాబు.

ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు—ఆ ఉత్తరాన్ని అలా ఎన్నిసార్లు చదివారో తెలీదు—కాశేశ్వరరావు గారి ముఖం ఎర్రగా ఎర్రబడి పోయింది. కళ్లు మరీ పెద్దవై భీకరంగా తయారయ్యాయి. ముఖంలో ఆవేశంతో కూడిన వణుకు ప్రారంభమైంది.

వాలు కుర్చీలోంచి దిగ్గుమని లేచారు కాశేశ్వరరావుగారు. కాగితాన్ని పట్టుకున్న చెయ్యి అప్రయత్నంగా బిగిసింది.

బోనులో పులిలా, నడవలో అటూ ఇటూ తిరుగుతున్నారు కాశేశ్వరరావుగారు.

ఆయనవేసే అడుగు అడుగుకూ నేల బెదిరి అదురుతోంది.

సూర్యుడు నడినెత్తి కొస్తున్నాడు.

కాశేశ్వరరావుగారిలో క్రోధం సలసలమని కాగుతోంది.

ప్రక్కగదిలోకి వెళ్లబోతూ ఇటు వచ్చింది చిట్టిబాబు తల్లి. భర్తవైపు ఖరిచూసి ఆశ్చర్యపోయింది. ఎంతో ప్రమాదకరమైన విషయమైతే తప్ప, అలా పచార్లు చెయ్యడం ఆయనకు అలవాటు లేదు. ఆ సంగతి ఆమెకు బాగా తెలుసు.

ఇప్పుడేం ప్రమాదం జరిగింది?

—ఆమె ఊహకు అందలేదు.

భర్తను అడగడానికి ఆమెకు ధైర్యం చాల్లేదు. నిశ్శబ్దంగా ప్రక్కగదిలోకి వెళ్లబోయింది.

'ఇదిగో—'

ఆయన గొంతువిని ఆమె ఆగిపోయింది.

'చూశావా సుపుత్రుడు చేసిన ఘనకార్యం?—ఉద్యోగం ఎంత చక్కగా వెలగబెడుతున్నాడో—చూడు—' ఉత్తరం భార్య చేతుల్లో పెట్టారు కాశేశ్వరరావుగారు.

ఆశ్చర్యపోతూ ఉత్తరం అందుకుని, మొదటి నుంచి చివరిదాకా చదివింది చిట్టిబాబు తల్లి.

ఆమె ముఖం తెల్లగా పాలిపోయింది. నమ్మకం లేని తనాన్ని సూచిస్తూ ఆమె కళ్లు పెద్దవై పోయాయి. ఆమె కంఠం రుద్ధమైపోయింది—'బాబు—మనబాబు—మనబాబు— ఇది రాశాడా?—ఇంతకీ—ఈ పిల్ల ఎవరు?—అసలీ ఉత్తరం—మీా కెలా వచ్చింది?'

'రావాల్సి ఉండే వచ్చింది—ఆ వెధవ మతి మరుపే ఈ ఉత్తరాన్ని మనకు పంపించింది.. వాడికిది అలవాటే గా—మనకు రావాల్సిన ఉత్తరం ఆ పిల్లకు వెళ్ళుంటుంది...ఆ పిల్లకు వెళ్ళాల్సిన ఉత్తరం మన కొచ్చింది. వెధవ—వెధవ—చూశావా, ఏం రాశాడో ఆ పిల్లకు? నేనట—ముక్కోపినట...', కాశేశ్వరరావు గారి ముఖం రౌద్రంగా తయారైంది.

చిట్టిబాబుతల్లి భయపడింది—'అయితే ఇప్పుడు—ఇప్పుడేం చేద్దామంటారు?'—

ఊపిరి బిగించారు కాశేశ్వరరావు గారు. అప్రయత్నంగా ఆయన పళ్లు పటపట లాడాయి.

'ఏం చెయ్యాలా? చేస్తాను—ఆ వెధవని ఇక్కడికి పిలిపించి, ఇదుగో—ఇదే దూలానికి కోదండం వేయిస్తాను—నా కడుపున చెడబుట్టాడు — ఉద్యోగం చెయ్యరా అని పంపుతే ప్రేమకలాపాలు చేస్తాడూ—రానీ చెప్తాను—'

'ఏమండీ...'

ఏదో అనుమానం వచ్చినట్టు ఆగారు కాశే శ్వర్రావుగారు. భార్యకేసి హెచ్చరికగా చూసి అన్నారు— 'ఇదుగో—ఇప్పుడే చెబుతున్నాను—వాడిక్కడికి రాగానే—ఈ ఉత్తరం సంగతీ, నే నసలు వాణ్ణిక్కడికి ఎందుకు పిలిపించానో ఆ సంగతీ—ఏమీ చెప్పకు — వాడంతకు వాడే అడిగినాసరే—నాకు తెలీదను—అంతే—'

భర్త మాటంటే రాజాజ్ఞకన్నా ఎక్కువని చిట్టిబాబు తల్లికి తెలుసు, భర్తకేసి బేలగా చూసి, 'అలాగే—', అని, అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది ఆమె.

ఆ మధ్యాహ్నమే చిట్టిబాబు పేర ఒక అర్జంట్ టెలిగ్రాం వెళ్ళింది.

*　　*　　*

బండీ ఆగిన చప్పుడు వినిపించగానే వాకిట్లోకి ఎదురువెళ్ళింది చిట్టిబాబు తల్లి. బండి దిగి వస్తూన్న కొడుకును చూడగానే, 'వచ్చావా నాయనా!—', అంది విప్పారిన ముఖంతో?

'ఏమిటమ్మా—అర్జెంటుగా రమ్మని టెలిగ్రాం ఇచ్చారు?—'

ఆ మాటతో, మౌనంగా లోపలికి నడిచింది తల్లి.

చిట్టిబాబు ఆమె వెంటే నడిచాడు. ఏమిటమ్మా మాట్లాడవు — ఇంతకీ, ఏమైందమ్మా ఇక్కడ?...'

నేరుగా వంటింట్లోకి నడిచింది తల్లి. 'అవన్నీ తరువాత మాట్లాడుదాం—ముందు నువ్వెళ్ళి స్నానం చేసిరా—'

'అదేమిటమ్మా—అర్జెంటుగా రమ్మని టెలిగ్రాం ఇచ్చి—'

'ఆ సంగతులన్నీ నన్నడుక్కు — కాస్సేపట్లో మీ నాన్నగారొస్తారు - వారినే అడుగు.

చిట్టిబాబు వంటింటి గుమ్మంలోంచి కదల్లేదు. తల్లి అతడి ముఖంలోకి చూసింది.

అమాయకమైన ముఖం చిట్టిబాబుది. అమాయకమైన కళ్ళు. ప్రయాణపు అలసట తెరవెనుక నుంచి దోబూచు లాడుతూన్న ముఖంలోని కాంతి—అంత ఆశ్చర్యకరమైన పరిస్థితిలో అతనున్నా కూడా, అతని పెదవులమీద, చిన్నపిల్లలు నిద్రలో నవ్వే నవ్వు లాంటి నవ్వు—

'ఏమిటమ్మా—అలా చూస్తావు'...?

'ఏమీ లేదు నాయనా—వెళ్ళు-వెళ్ళి వేగిరం స్నానం చేసిరా—వేడివేడిగా అన్నం తిందువు గాని—'

అన్నం తిని, మేడమీది తనగదిలోకి వెళ్ళిపోయాడు చిట్టిబాబు.

ఎండ కరకరలాడి పోతూండగా ఇంటి కొచ్చారు కాశేశ్వర్రావుగారు—'వాడొచ్చాడా?'

అడుగుతున్నది చిట్టిబాబు గురించేనని తల్లికి తెలుసు. వచ్చాడని చెప్పింది.

భోం చేశాడా?

చేశాడంది.

మౌనంగా భోజనం ముగించి లేచారు కాశేశ్వర్రావుగారు. నడవలో, విక్రమార్క సింహాసనంలా గంభీరంగా ఉన్న వాలుకుర్చీలో కూచున్నారు—'పిలు వాణ్ణిలా—'

వెళ్ళి పిలిచొచ్చింది తల్లి.

'నువ్వెళ్ళవతలికి—'

ఆమె అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

గుమ్మం దగ్గర నిలుచుని ఉన్నాడు చిట్టిబాబు.

'రారా లోపలికి—'

'వచ్చాడు చిట్టిబాబు.

'ఇక్కడ మేమంతా ఉన్నామనుకున్నావా—చచ్చామనుకున్నావా?'

'నాన్నా!!!'—

'నోర్ముయ్! — ఎవర్రా గిరిజ?' గద్దించారు కాశేశ్వర్రావు గారు.

ఉలిక్కిపడ్డాడు చిట్టిబాబు. ఎర్రటి అతని ముఖం తెల్లగా పాలిపోయింది. భయంతో కళ్లు బెదిరాయి. 'ఏ—ఏమిటి నాన్నా?' అన్నాడు తడబడుతూ.

'గిరిజ ఎవరూ అనడుగుతున్నాను—'

'గిరిజ—గిరిజ ఎవరు నాన్నా?'

'నన్నా అడుగుతావు? గిరిజెవరో తెలీకుండానే గిరిజకు ఈ ఉత్తరం రాశావు(టాఫూల్!' రౌద్రంగా అరిచి, కాగితాన్ని చిట్టిబాబుకేసి విసిరారు కాశేశ్వరరావుగారు.

ఉత్తరంచూసి నిర్ఘాంతపోయాడు చిట్టిబాబు.

'మాట్లాడ వేంరా ఇడియట్'—

'నాన్నా—ఇది—ఇది'

'నా చేతికెలా వచ్చిందా? రావాల్సిండే వచ్చిందిరా రాస్కెల్! కనిపెంచిన వాళ్ల కంట్లో కారం కొట్టి పోదామనుకున్నావు కదూ?—భగవంతుడు లేడూ పైన?—వాడే చేయించాడు నీచేత ఈ పని—మతిమరుపు వెధవా—నీ ఘనతను నీ చేతులారా నువ్వే నాకు తెలియజేశావు—చెప్పు-ఎవరా గిరిజ?'—

తల వంచుకున్నాడు చిట్టిబాబు—'ఎం. ఏ చదివేప్పుడు—'

'నీతో కూడా చదివి అఘోరించిందా?'

'అ—అవును...'

'ఎన్నాళ్లగా సాగుతోందీ వ్యవహారం?—'

'నాన్నా!...'

'అడిగిందానికి బదులు చెప్పు—'

'అంతకుముందు, కాలేజీలో కూడా—'

'పూసుకుతిరిగేవాళ్లన్న మాట—ఇద్దరూ కూడబలుక్కునే ఎమ్మేలో చేరారన్న మాట—ఏ ఊరు వాళ్లది?'

'విజయవాడ—దగ్గర—'

'వాళ్ల నాన్నెవడు?—'

'తెలీదు—'

'పోనీ—ఏం చేస్తుంటాడు?

'తెలీదు—'

'ఆస్తిపాస్తు లున్నాయా?'

'తెలీదు—'

'వాళ్ల కుల మేమిటి?'

'తెలీదు—'

'ఆ పిల్ల చెప్పలేదా?'

'అవన్నీ నేను—అడుగలేదు—'

'ఇంకేం అడిగావు?—'నన్ను ప్రేమిస్తావా?', అనడిగావా? అది ప్రేమిస్తానందా? ఇద్దరూ ఇలా బరితెగించి ప్రేమలేఖలు రాసుకుంటున్నారా? స్కాండల్—స్కాండల్—నిన్నూ ఆ పిల్లనూ నిలబెట్టి గుండెట్టి పేల్చేస్తాను — అసలిదంతా ఆపిల్లవల్ల జరిగింది. ఎర్రగా బుర్రగా ఉన్నాడూ, తండ్రికి ఒక్కగా నొక్క కొడుకూ, వెనకాల కొండంత ఆస్తీ—అని తెలివిగా నీ చుట్టూ వలవేసింది—'

'ఆమె—అట్లాంటిది—కాదు నాన్నా—'

'షటప్—నిన్నగాక మొన్న కళ్లు తెరిచిన గుడ్డువి—ఆడపిల్ల లెల్లాంటివాళ్లో నువ్వు నాకు చెబుతావు(ట్లా—అదేం కుదరదు—ఒరే — నేనిదే చెబుతున్నాను—ఆ పిల్ల సావాసం ఇంతటితో మానెయ్యి—ఆ పిల్ల సంగతే మరిచిపో—'

'క్షమించండి—నాన్నా — నాకది చేతగాదు—', తలవంచుకునే చెప్పాడు చిట్టిబాబు.

'ఏమిటీ!—', గుడ్లురిమారు కాశేశ్వరరావుగారు.

'అవున్నాన్నా—నేను— ఆమెను— మరిచిపోలేను'

'ఏమిట్రా నువ్వనేది? — బుద్ధున్నమాటే మాట్లాడుతున్నావా?— బాగా ఆలోచించే మాట్లాడుతున్నావా? నువ్విప్పుడు మాట్లాడుతున్నది ఎవరితోనో తెలిసే మాట్లాడుతున్నావా?—నేనే గనక ఒకసారి ఒకమాట అన్నానంటే—అంతే—హరిహర బ్రహ్మాదులైనా మార్చలేరు—నువ్వాపిల్లను మరిచిపోవాలి—

మరిచి పోయి తీరాలి — లేకుంటే — లేకుంటే నేనేం చేస్తానో తెలుసా?'—

తలవంచి నేలచూపులు చూస్తూనే ఉన్నాడు చిట్టిబాబు—'ఇంట్లోంచి వెళగొడతారు. మీా ఆస్తిలోంచి చిల్లిగవ్వకూడా నాకు రాకుండా చేస్తారు— అంతే గా?'—

నడవనడవంతా నవ్వుతో దద్దరిల్లిపోయింది.

హఠాత్తుగా నవ్విన నవ్వు, ఇంకా నవ్వుతూనే ఉన్నారు కాశేశ్వరరావుగారు—

నివ్వెరపోయి తలెత్తాడు చిట్టిబాబు.

చిట్టిబాబు కళ్లలోకి చూశారు కాశేశ్వరరావు గారు—

తికమక పడిపోయాడు చిట్టిబాబు.

నవ్వు ఆపి అన్నారు కాశేశ్వరరావుగారు —

'అలా చెయ్యను నా ఫూల్ — మర్యాదగా నువ్వ ఆ పిల్లను మరిచిపోకపోతే—ఏం చేస్తానో తెలుసా?— ఏం చేస్తానంటే—వెర్రి నాగన్నా—నువ్వాపిల్లను మరిచి పోకపోతే- ఆ పిల్లతోనే నీ పెళ్లి జరిపిస్తాను!!' -

'నాన్నా!', అన్నాడు చిట్టిబాబు, తన చెవులను తానే నమ్మలేనట్లు.

ఇంకా నవ్వుతూన్నారు కాశేశ్వరరావుగారు. నవ్వు ఆపి అన్నారు—'కాశేశ్వరరావు మాటంటేవమాటే— మాకు తెలీకుండా ఆ పిల్లను ప్రేమించిన నేరానికి, ఆ పిల్లనే ఇచ్చి నీకు పెళ్లి చెయ్యడమే సరైన శిక్ష— ఏమే—విన్నావా?'

భార్య ఇంతసేపూ తలుపు చాటున ఉందని కాశేశ్వరరావుగారికి తెలుసు. ఆమె ఇవతలికి వచ్చింది. వచ్చి, కొడుకు తలమీాద చెయ్యివేస్తూ, నవ్వింది.

'అమ్మా—నేను 'మరి—విజయవాడవెళ్లి--', అన్నాడు చిట్టిబాబు మెల్లిగా—

ఆ మాట కాశేశ్వరరావుగారికి వినపడింది - 'ఏమన్నాడే వీడు—చేసిన ఘనకార్యం చాలదూ— సిగ్గులేక ఇంకా ఆడపిల్లవాళ్లింటిమీాద పడతాడా?— ఆట్టే మాట్లాడితే గుండెట్టి పేల్చేస్తాను—ఆ పిల్ల తండ్రిగారి అడ్రసిలా ఇవ్వమను—'

*   *   *

అయ్యో! ఆ తరువాత జరిగిన కథ చెప్పవలసిన అవసరం కూడా ఆట్టే లేదు.

కాశేశ్వరరావుగా రిచ్చిన తీగటపా చూసుకుని రెక్కలు గట్టుకునొచ్చి వాలాడు విజయవాడనుంచి గిరిజ తండ్రి. మూడే ముక్కల్లో వ్యవహారం ఫైనల్ అయి పోయింది. పెళ్లి ఖర్చులు యావత్తూ కాశేశ్వరరావు గారే భరించి వారి స్వగ్రామంలోనే స్వగృహంలోనే పెళ్లి జరిపించ నిశ్చయించి నారు. పెళ్లికి సుముహూర్తం కూడా నిశ్చయించడం జరిగిపోయింది.

కాశేశ్వరరావుగారింటి పెళ్లంటే మాటలా?

దేశం నలుమూలలకీ—మీాగడతో చేసినట్టున్న కాగితంమీాద, బంగారపు అక్షరాలతో, పసుపురాసిన కొసలతో, పెళ్లి పిలుపులు వయ్యారంగా వెళ్లాయి. పెళ్లి ఏర్పాట్లకోసం ఎలా లేదన్నా ఎంత కాదన్నా నూరు—నూటయాభైమంది నెలరోజులపాటు అహో రాత్రాలూ శ్రమించారు. కృష్ణాపురం అంతా పందిళ్ల ఊరైపోయింది. ఊళ్లో చిన్నా పెద్దా అంతా కలిసి తలో చెయ్యా వేశారు. కాశేశ్వరరావుగారింటి పెళ్లంటే— ఊరంతటి శుభకార్యమే — ఊరంతటికీ వేడుకే అయింది.

పట్నంనుంచి నాటకాలవాళ్లు వచ్చారు. మ్యాజిక్ షోలవాళ్లు వచ్చారు.

కూచిపూడినుంచి, నాజూకుల దొరసానులైన నట్టువకత్తెలూ వచ్చారు.

విపులమైన నెన్నుదుటిమీాద విభూతికట్లు దాల్చి తంజావూరునుంచి మహానాదస్వర విద్వాంసులు వచ్చారు.

వైణికులు, వైణవికులు — అహో ఒక్క రేమిటి-సకలసంగీతసాగరం సమ్మోహనకరంగా తర్లి వచ్చింది.

పెళ్లి మూడురోజులైతే, పెళ్లివేడుకలు పది హేను రోజులు జరిగాయి.

ఆ అన్నిదినాలూ కృష్ణాపురంలో వేరే పొయ్యి రాజుకోనవసరం లేకపోయింది — భోజనాలు, అల్పాహారాలు, మృష్టాన్నాలు, పిండివంటలు, పాయసాలు, చిత్రాన్నాలు, మైసూరీ వంటకాలు— ఓహో — ఒక టేమిటి—మహావైభవంగా వడ్డించారు. పెళ్లిభోజనం ఆరగించనివాడు దురదృష్టవంతుడు, ఆరగించి గ్రున త్రేన్చనివాడు పాపాత్ముడు.

ఇక పెళ్లిపందిళ్లు, మంటపాలు, ఊరేగింపులు - ఆ మాట చెప్పేదేముంది?

ఏ వంక జూచినా పువ్వులు—ఏ చాయ జూచినా సుగంధాలు—

పందిరి గుంజలకు కట్టిన పచ్చికొబ్బరి మట్టల వింత వాసనలతో గాలిగాలంతా పరిమళించి పోయింది.

ఇంక ఆ పెళ్లికూతురూ—ఆ పెళ్లికొడుకూ—

మధుపర్కాలతో వాళ్లను చూసేందుకు రెండు కళ్లుకావుకదా—రెండు రెండువందల కన్నులైనా చాలవు......

ఆహా—వధూవరులంటే వాళ్లు—ఈడూ జోడూ అంటే అదీ—

పెళ్లి వేడుకలు జరిగినన్ని దినాలూ కృష్ణాపురం స్వర్గంలో ఒక భాగంగా వెలిగిపోయింది.

ఏ నోటవిన్నా ఆ పెళ్ళి ముచ్చటే!—ఏ మాట విన్నా ఆ పెళ్లి గురించి అచ్చటే!!—

ఇటువంటి పెళ్లి అటు మూడు తరాల దాకా ఎన్నడూ ఈ గడ్డమీద జరగలేదన్నారు.

ఇలాంటి పెళ్లి ఇటుమూడు తరాల దాకా ఇక జరగదు కాక జరగదన్నారు.

పెళ్లి వైభవాన్నంతా సగర్వంగా చూస్తూ, ఠీవిగా మీసం మీద చేయివేసి దువ్వుకున్నారు కాశేశ్వరరావుగారు.

పెళ్లి తర్వాత మూడు నిద్రలూ అయాక. భార్యతో హైదరాబాదువెళ్లి కొత్త కాపురంపెట్టాడు చిట్టిబాబు. అటు తర్వాత మూడు రోజులకే కొడుకు దగ్గర్నుంచి ఒక ఉత్తరం అందుకున్నారు కాశేశ్వరరావు గారు.


'పూజనీయులైన తండ్రిగారికి—

తమ ప్రియపుత్రుడు అనేకానేక నమస్కారములుచేసి చాయంగల విన్నపములు—

నేనున్నూ మీ కోడలు చి॥ సౌ॥ గిరిజయున్నూ క్షేమముగా హైదరాబాదు చేరినాము. క్రొత్తఇంటిలో మాకు ఏ ఇబ్బందులున్నూ లేవు. అంతా సౌకర్యంగా ఉన్నది..

....

నా మతిమరుపే మీకు నా ప్రేమ రహస్యాన్ని వెల్లడి చేసింది. కాని, మీరు క్షమిస్తారంటే, ఒక్క సంగతి మనవి చెయ్యడానికి సాహసిస్తాను—ఆ వేళ చి॥ సౌ॥ గిరిజకు నేను వ్రాసిన జాబు—మీకు చేరడంలో... నా మతిమరుపు ఏమీలేదు...అప్పుడు దాన్ని నేను కావాలనే మరిచిపోయినాను...'



తెలుగులో ఉన్నత విద్యాభ్యాసం

డా. గవరసాన సత్యనారాయణ

ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము డిగ్రీ తరగతులలో తెలుగును బోధనభాషగా ప్రవేశపెట్టింది. పలువురు విద్యార్థులు, విద్యాధికులు, అధ్యాపకులు ఈ చర్యను నిరసించారు ఆలోచనా పద్ధతుల్లో సులువులు, భావప్రకటనలో మెలకువలు, మాటలు పలకటం మొదలుపెట్టిన దగ్గరనుండి ప్రారంభమవుతాయి. మాతృభాషలో తీర్చిదిద్దబడిన ఆలోచనా రీతులు విద్యాభ్యాసంతో మరింత బలపడతాయి. ప్రైమరి, సెకండరి విద్యాదశలలో మాతృభాషలో విద్యాభ్యాసం చేసిన వారికి యూనివర్సిటి స్థాయిలో పరభాషలో బోధన సాగిస్తే, వెనుక నేర్చుకొన్నదంతా మూలపెట్టి, కొత్తభాషలో ప్రావీణ్యం సంపాదించి, పాఠ్యవిషయాలను తిరిగి నేర్చుకోవాలి. పరభాషను నేర్వటంలో కొన్ని సంవత్సరాలు ధారపోయాలి. ఈ పరభాషా భారం క్రింద ఎన్ని సున్నితమైన మేధలు క్రుంగిపోయాయో ఎవరికి ఎరుక?

ప్రపంచపు పోకడ

సాంకేతికంగా అభివృద్ధిచెందిన దేశాల్లో అన్ని స్థాయిలలోను మాతృభాషలో విద్యాబోధన చేస్తారు. మనదేశంలో వలెనే సోవియటు రష్యాలోకూడా చాల భాషలున్నాయి. రష్యను భాష అందరు నేర్చుకొన్నా, కొన్ని భాషల్లో (యుక్రేనియను, బైలోరష్యను) ఈనాటికి సైన్సు, సాంకేతిక విషయాలను యూనివర్సిటి స్థాయిలోను బోధిస్తారు. రెండవ ప్రపంచయుద్ధంలో ఓడిన తర్వాత బలాన్ని పుంజుకుని ముందంజవేసిన జపాను, జర్మనీలలో విద్యార్థులు మాతృభాషలోనే విద్యాభ్యాసం గరుపుతారు. ఆంగ్లం, రష్యను, జర్మనుభాషలలో ఉన్నతస్థాయిలో సాంకేతిక, విజ్ఞాన సాహిత్యాలున్నాయి. అందువల్ల ఆ భాషలను బోధనాభాషలగా పరిగ్రహించి మాతృభాషను మూలపెట్టవలసిన అవసరంలేదు. అలా అని పరభాషలను విడువరాదు. గత యాభై సంవత్సరాలలో సోవియటురష్యా సాధించిన సాంకేతిక విజయాలను చూస్తే నేడు సైన్సు విద్యార్థులు రష్యను భాషను నేర్వవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రపంచంలో గ్రంథస్థమయిన విజ్ఞానం చాలవరకు ఆంగ్లంలో లభిస్తుంది. అంతర్జాతీయ వాణిజ్యానికి, దౌత్యకార్యకలాపాలకు, శాస్త్రపరిశోధకులకు ఆంగ్లభాషతోపాటు ఫ్రెంచి, జర్మను, స్పానిషు, అరబిక్ భాషలు వచ్చితీరాలి. సర్వతోముఖముగా భారతీయులు విజయాన్ని సాధించాలంటే పరభాషలన్నిటిని నేర్చుటకు అవకాశాలు కల్పించాలి. పరభాషలతో సంపర్కము లేనిదే ఏ భాష ఆధునిక విజ్ఞానావసరాల దృష్ట్యా అభివృద్ధి చెందదు.

కంఠస్థం–అర్థగ్రహణ లోపం

చెప్పిన పాఠం అర్థం చేసుకొనుటకు మాతృభాష ఉపయోగపడినంత పరభాష ఉపయోగపడదు. పరభాషలో చెప్పిన పాఠాలు అర్థంకాక కంఠస్థం చేయుట జరుగుతున్నది. వెనుకటికి ప్రొఫెసరు జె. బి. యస్. హాల్డేను కలకత్తాలో నివసిస్తున్న రోజుల్లో వేదపన్నాలు వల్లించినట్లు రసాయన సూత్రాలను, రసాయన క్రియలను విద్యార్థులు వల్లించి కంఠస్థం చేస్తున్నారని చెప్పారు. సృష్టి రహస్యాలను అర్థం చేసుకుని ఆనందించే బదులు, పరభాషలో సూత్రీకరించిన సిద్ధాంతాలను కంఠస్థం చేయుటలో అపసోపాలు పడుతున్నారు.

పరభాష ఎవరికోసం?

శ్రామికులు, వ్యవసాయదారులు, వృత్తి వ్యాపారాలు చేసుకునే వారికి కావలసింది వృత్తి విద్యలో నైపుణ్యం కాని పరభాషలో ప్రావీణ్యంకాదు. వీరికి కావలసినదల్లా పరభాషల్లో ఉన్నవిజ్ఞానం. ఈ

విజ్ఞానాన్ని ప్రజలకు అందచేసే బాధ్యత విశ్వవిద్యాలయాలు వహించాలి. పరభాషను నేర్చుకొనుటకు వెచ్చించే శ్రమను, కాలాన్ని, వృత్తివిద్యాభ్యాసంలో వినియోగిస్తే డిగ్రీ పుచ్చుకున్న యువతీ యువకులు నిరుద్యోగులు కానక్కరలేదు.

తెలుగు డిగ్రీలు—ఉద్యోగాలు

తెలుగులో డిగ్రీ తీసుకున్న విద్యార్థులకు పర రాష్ట్రాల్లోనూ, పరదేశాల్లోనూ ఉద్యోగాలు దొరుకుతాయా అన్నది చిక్కుప్రశ్న. ఇంగ్లీషు మీడియంతో డిగ్రీలు పుచ్చుకున్న ఆంధ్రులు పరరాష్ట్రాల్లో ఎంత మంది పనిచేస్తున్నారు? ప్రాంతీయ భాషరానిదే ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఆంగ్లభాషలో పట్టభద్రులయిన ఆంధ్రులకు ఉద్యోగాలు ఇస్తున్నాయా? నిరుద్యోగ సమస్య తీవ్రంగాఉన్న ఈ రోజుల్లో ఏ భాష నేర్చినా ఉద్యోగం రాదు. ప్రాంతీయ భాషలను రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలకు వాడుతున్న ఆంధ్రేతర రాష్ట్రాలలో ఆంధ్రుల ఉద్యోగావకాశాలను పెంపొందించదలచుకొన్నవారు హిందీ, తమిళం, కన్నడం, బెంగాలీ మొదలగు దేశభాషలను బోధించే ఏర్పాటు చేయాలి. ఈ భాషలను ఉన్నత పాఠశాలల్లో ఆప్షనలు సబ్జక్టుగా బోధించవచ్చును. లేదా యావద్భారతంలోను ఉద్యోగులకు ఆయా ప్రాంతీయ భాషలను నేర్పే అవకాశం కల్పించాలి. అధునాతన పరికరాలతో భాషలను నేర్వ వీలున్నరోజులివి.

గాంధీ ఉవాచ

గాంధి మహాత్ముడు ఫిబ్రవరి ఒకటి 1942 'హరిజన్' సంచికలో ఇలా వ్రాసాడు. 'జపానులో ఏమి జరిగిందో మీ కందరకు తెలుసు. జపాను దేశం గొప్ప దేశమని నేను అనుకోకపోయినా, పశ్చిమ రాజ్యాల బలాధిక్యాన్ని ఎదుర్కొ గలిగింది. జపాను పాఠశాలల్లో బోధన భాష ఆంగ్లభాష కాదు—జపానీసు మాత్రమే. జపానీసు అక్షరమాల క్లిష్టమయినా, తేలికయిన రోమను అక్షరాలను గ్రహించలేదు. అలాగని ఇంగ్లీషును కాని, యూరోపియను భాషలను వెలివేయలేదు. పరభాషలను నేర్చుకొనుటలో వారు వృధాగా శక్తిని ఖాతపోయరు. జపానీయుల ఆలోచన సామర్థ్యాన్ని, విజ్ఞానాన్ని పెంచుటకు వీలుగా తగినంతమంది పర భాషలను నేర్చుకొంటారు. ఉపయోగపడే విషయాలన్నిటిని పరభాషనుండి గ్రహించి జపానీసులో పొందు పరుస్తారు. జపాను యువతీ యువకులు అప్రమత్తులు కావటం వల్లనే ఇది సాధ్యపడింది. ఈ విధంగా ఆర్జించిన జ్ఞానము ప్రజల సొత్తు అయింది. గవర్నమెంటు ఆఫీసుల్లో గుమస్తాలుగాను, న్యాయవాదులుగా, జడ్జీలగా కావాలని కోరుకుంటాము. అయినప్పటికి ఆంగ్లభాషలో ప్రావీణ్యము సంపాదించలేక పోయాము. ఇంగ్లీషు చదువుకున్నవారి దగ్గరనుండి నాకు చాల ఉత్తరాలు వస్తాయి. వీరిలో కొంతమందికి పెద్ద డిగ్రీ లున్నాయి. కాని వీరి భాషా జ్ఞానాన్ని పరిశీలిస్తే నాసి కట్టుగా కన్పిస్తుంది. మాలవీయులు, రాధాకృష్ణన్‌లు అరుదు. వారికున్న భాషాజ్ఞానము వేలాది ప్రజలకు ఉండదు.

ఈ విషయాన్నే రవీంద్రనాధఠాకూరు కలకత్తా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ముప్ఫైయిదు సంవత్సరాల క్రితం నొక్కి వక్కాణించాడు.

ఎడ్యుకేషను కమిషనువారి సిఫార్సులు

డి. యస్. కొఠారిగారి ఆధ్వర్యాన పనిచేసిన ఎడ్యుకేషను కమిషను (1964-66) వారు దిగువ సూచనలు చేశారు. 'భారతీయులు ముందంజవేయాలంటే, పండితుల పామరులమధ్య ఉన్న దూరం తగ్గాలంటే భారతీయ భాషలను అత్యవసరంగా, అర్జంటుగా అభివృద్ధి చేయాలి. వైజ్ఞానిక, సాంకేతిక విషయాలు మాతృభాషలో చెప్పుటకు వీలయినప్పుడు పారిశ్రామికంగా అభివృద్ధి పొందుటయేకాక, ప్రజల్లో వైజ్ఞానిక దృక్పథమును పెంచి, వైజ్ఞానిక విషయాలను ప్రజలకు అందుబాటులో ఉంచుటకు వీలవుతుంది. విద్యారంగంలో దేశభాషలకు తగినచోటు ఎల్లప్పుడు ఉంటుంది కాబట్టి వాటిని అభివృద్ధి పరచాలి. ఏ భాషలో విద్యాబోధన జరుగుతుందో ఆ భాషలో విద్యార్థి చక్కగా విషయాలను విడమర్చి చెప్ప గలగాలి. అలాగే సూక్ష్మంగా ఆలోచించే శక్తిని కలిగి ఉండాలి. ఈ రెండు సాధ్యమవాలంటే మాతృభాషలోనే పాఠాలను బోధించాలి.

ప్రజలు, భాష, ప్రభుత్వము

తెల్లదొర తనాన్ని తలదన్ని ప్రజాస్వామ్యాన్ని జీవితపథంగా స్వీకరించినప్పుడు పరిపాలకుల, పరిపాలితులమధ్య భాషలతో గోడలు కట్టకూడదు. ప్రజలు తమ వ్యవహారాలన్నిటిని మాతృభాషలో సాగించినంత కాలం అధికారులుకూడా ప్రజల భాషలోనే రాజ్యవ్యవహారాలు సాగించాలి. ప్రజాస్వామ్యమే ధ్యేయము అని చెప్పి పరిపాలికులు కాగోరేవార్కి ఒక భాష, పరిపాలితులకు మరో భాష ఉండాలని ప్రబోధించే వారు ఆత్మవంచనకు లోనవుతున్నారు.

రిఫరెన్సు సాహిత్యం

తెలుగులో రిఫరెన్సు సాహిత్యం లేదు కాబట్టి ఉన్నత విద్యాబోధన తెలుగులో జరపరాదని మరో వాదం ఉంది. తెలుగులో విద్యాబోధన చేయనిదే రిఫరెన్సు సాహిత్యం జనించే అవకాశం లేదు. రిఫరెన్సు సాహిత్యం లేనిదే తెలుగులో విద్యాబోధన చేయుటకు వీలులేదు. ఈ వాదం పెండ్లి కుదిరితేగాని పిచ్చికుదరదు, పిచ్చికుదిరితేనేగాని పెండ్లి కుదరదు అన్నట్లు ఉంది. ఈ విషవలయంనుండి బయటపడాలంటే మన ఆలోచనారీతులలో మార్పు అవసరం. రిఫరెన్సు సాహిత్య సృష్టి కష్టసాధ్యమేకాని దుర్లభముకాదు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నమూడు విశ్వవిద్యాలయాలలో, పలుపరిశోధనా సంస్థలలో పనిచేసే శాస్త్రజ్ఞులు, పండితులు కృషిచేస్తే కావలసినంత రిఫరెన్సు సాహిత్యం జనిస్తుంది.

మన కర్తవ్యం

రోగి తన బాధను తెలుగులో చెప్పితే ఎల్లోపతి వైద్యుడు ఆంగ్లములో ఆలోచించి వైద్యము చేస్తున్నాడు. కార్మికునికి యంత్రము ఎలా పనిచేస్తుందో తెలుగులో చెప్పుటకు ఇంజనీరు ప్రయత్నించి విఫలుడవుతున్నాడు. వాది, ప్రతివాది చెప్పినదంతావిని జడ్జి ఇంగ్లీషులో తీర్పు ఇస్తున్నాడు. ఈ ఉదాహరణలకు అంతులేదు. మాతృభాషలో విద్యాబోధన జరిగితే, పై విడ్డూరాలకు తావులేదు. పారిశ్రామికంగా వంద సంవత్సరాలు వెనుకపడ్డ మనకు, మన సమస్యలకు పరభాషా సాహిత్యంలో, సాంకేతిక విజ్ఞానంలో సమాధానాలు లేవు. ఉదాహరణకు మన సమస్య నొకదానిని పరిశీలిద్దాం. విశాఖపట్నపు సముద్ర తీరంలో కెరటాల ప్రభావానికి సముద్రపు టొడ్డున ఉన్నభవనాలు,రహదారి కూలిపోతున్నాయి. తెల్లదొరని ఒకాయనను పిలిచి దీని సంగతి ఏమిటని ప్రభుత్వం అడిగిందని వినికిడి. ఈ సముద్ర తీరానికి మూడుమైళ్ల దూరంలో ఆంధ్ర విశ్వవిద్యాలయము ఉన్నది. ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని శాస్త్రజ్ఞులు పరిశోధించవలసిన విషయమిది. ఈ సమస్యకు అమెరికానుండి, ఇంగ్లండు నుండి వచ్చే సాంకేతిక, వైజ్ఞానిక పత్రికల్లో సమాధానాలు దొరకవు. అందువల్ల మన బుద్ధి నుపయోగించి, మన కృషితో, మన సమస్యలను పరిష్కరించి అభివృద్ధిని సాధించాలి.



గ్రంథవిమర్శలు

అష్టదిగ్గజ కవి సమాజములో రాయల నాశ్రయించిన తొలి కవి యెవరు ?

(గ్రంథకర్త : శ్రీ కె. ఎస్. కోదండరామయ్య, ఎం. ఏ; బి. ఓ. ఎల్; బి. టి., ఎం. ఎల్. ఏ. హోసూరు — క్రౌను సైజు 32+80 పేజీలు. వెల రూ. 3. ప్రకాశకులు—శివదేవయాంధ్ర గ్రంథమాల, హోసూరు, ధర్మపురిజిల్లా.)

శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానంలో ఉండే అష్టదిగ్గజాల్లో అల్లసాని పెద్దనామాత్యుడే ప్రాధాన్యం వహించాడనీ, అతడే తొలికవి అనీ ఇప్పటివరకూ చాలామంది అభిప్రాయం. ఆ అభిప్రాయం సరికాదనీ అష్టదిగ్గజాలలోని ప్రథమకవి పారిజాతాపహరణకర్త అయిన నంది తిమ్మనకవియే అని శ్రీ కోదండరామయ్యగారు ఈ చిన్న విమర్శగ్రంథంలో సప్రమాణంగా వివరించడమే కాకుండా, విజయనగర చరిత్రకు సంబంధించిన పెక్కువిషయాలను వెల్లడించారు.

తిమ్మనకవి మైసూరు రాష్ట్రమునకు చెందిన కోలారు ప్రాంతంలోని నందిగ్రామ నివాసి. వరాహపురాణాన్ని రచించిన జంటకవులలో ఒకడైన మలయమారుతకవి ఘంట సింగయ్యకు మేనల్లుడు. అందువల్ల రాయలతండ్రి నరసనాయకుని కాలంలోనూ ఉండిన వాడే! నరసనాయకుడు తన దండనాయకుడైన కుమార వీరయ్య తోడ్పాటుతో హొయిసలేంద్రుణ్ణి జయించి, అతని శ్రీరంగపట్టణాన్ని స్వాధీనం చేసుకుని, దానికి వీరయ్యనే పాలకునిగా నియమించాడు. అంతే కాకుండా అతని కుమార్తె తిరుమల దేవిని తన పుత్రుడు కృష్ణరాయలకు వివాహం చేశాడు. వీరయ్య దండనాయకుడు కృష్ణరాయల కాలంలో కూడా రాయల తొలి దండయాత్రల్లో సహాయపడుతూ ఉండేవాడు. తిమ్మకవి కృష్ణరాయల వివాహం నాటికే శ్రీరంగ పట్టణాధిపతి వీరయ్య దండనాయకుని ఆస్థానంలోనే కాకుండా అంతఃపురంలో కూడా చాలా చనువుగా మెలగుతూ ఉండేవాడు. అందువల్లనే కుమారవీరయ్య తన పుత్రిక తిరుమల దేవికి తిమ్మకవిని 'అరణపు కవి'గా పంపే అవకాశం ఏర్పడింది. కృష్ణదేవరాయల పట్టాభిషేకం నాటికే ఆయన ఆస్థానంలో ఈ కవి ఉండడంవల్ల అష్టదిగ్గజాలలో తిమ్మకవి ప్రథముడని నిర్ణయించడంలో ఆక్షేపం ఉండదు.

పయి అంశాలను శ్రీ కోదండరామయ్యగారు గ్రంథ ప్రామాణ్యాన్నీ, శాసనప్రామాణ్యాన్నీ అనుసరించిన్నీ, స్థానిక వృత్తాంతాలను సంగ్రహించిన్నీ వివరించారు. ఇట్టి నిర్ణయాలకు గ్రంథాదులతో పాటు ఆయా ప్రాంతాలు తిరిగి వృత్తాంతాలను సేకరించడం ఎంతో అవసరం. రచయిత రాజకీయవేత్త; తమిళనాడు శాసనసభ్యులు. దక్షిణ భారతంలోని మైసూరు, తమిళనాడు ప్రాంతాల్లో ఉన్న 75 లక్షల ఆంధ్రుల అభ్యుదయ మార్గాలను ఆలోచించి, తగిన చర్యలను తీసుకొనుటకు పూనుకున్న దేశసేవా పరాయణులు. విద్వద్విమర్శకులు. ఆయన ఆయా ప్రాంతాలలో పర్యటించి, పరిశ్రమించి గ్రహించిన విషయాలకు ఫలరూపంగా ఈ ఉత్తమగ్రంథాన్ని వెలయించి క్రొత్తవిషయాలని సాహిత్యలోకానికి అందజేశారు. రాయల ఉమ్మత్తూరు, శివసముద్రాల విజయాలను, ప్రతిసంవత్సరం జరిపే వసంతోత్సవాలను పురస్కరించుకొని తమ సిద్ధాంతాన్ని నిర్ణయించారు. తిమ్మకవి పారిజాతాపహరణంలోని—

'చోళవల్లభునకు సుర వధూమధురాధ
రము లిచ్చె: మధురాపురంబు గొనియె'

[ఆశ్వా 1. ప. 13]

అనే సీసపద్యపాదంలోని 'మధురాధరము లిచ్చె' అనేది 'మధురాధరము లిచ్చి' అని మార్పు చెందడం వల్లనూ, ఆ పద్యంలోనే

'శ్రీరంగపట్టణ సీమ ఖడ్గన టేవి
నోదంబు హొయిసలేంద్రునకుఁ జూపె'

అనే చోట 'హొయిసలేంద్రునకు' అనే దానికి మారుగా 'యావనేంద్రునకు' అని మార్చి ముద్రించడం వల్ల చరిత్రాంశా లెంత తల్లకిందులైనదీ, యథార్థ విషయాలెలా మరుగుపడినదీ వివరించారు.

రచయిత శ్రీ కృష్ణదేవరాయల చరిత్రను తెలుగులో సమగ్రంగా వ్రాయాలనే సంకల్పంతో విషయాలను సేకరిస్తూ, పారిజాతాపహరణ ప్రబంధాన్ని పరిశీలింపగా కొన్ని కొత్త విషయాలు తోచాయి. కృష్ణరాయల నంది దుర్గాలయ శాసనం ఆయన అభిప్రాయాలను బలపరిచింది. పెక్కు ఆంధ్రగ్రంథాలనూ, ప్రత్యేక సంచికలనూ, ఆంగ్ల గ్రంధాలనూ, సంపుటాలనూ, శాసనాలనూ పరిశీలించి యీ గ్రంధాన్ని వీరు రచించారు. రాజకీయాలతోపాటు భాషా వాఙ్మయాల్లో అధికంగా ఆదరాభిమానాలూ, ఆసక్తి ఉన్నందువల్లనే దీని రచన ఈయనకు సాధ్య పడింది.

దీనికి విద్యారత్న నిడుదవోలు వేంకటరావుగారు ఆంగ్లంలోనూ, ఆంధ్రంలోనూ విపులంగా వ్రాసిన పీఠికలు మెరుగుపెడుతున్నవి. అందులో— రచయిత సల్పిన అపారమైన కృషి, వెలుగునకు తెచ్చిన చరిత్రాంశాలు, తెలుగు జాతికి దక్షిణ భారతంలో ఉన్న స్థానం ఇంకా ఆ ప్రాంతాలలో జరుగవలసిన కృషి, తాము తమ కవి చరిత్రలలో తెలిపిన విషయాలు, మున్నగు పెక్కు అంశాలను ఉటంకించి రచయిత కృషిని ప్రశంసించారు శ్రీ వెంకటరావుగారు.

ఈ గ్రంథం స్వరూపంలో చిన్నదయినా విలువలో పెద్దది. బహుముఖ ప్రజ్ఞాధురంధరులైన శ్రీ కోదండరామయ్య గారు దీని మూలంగా చరిత్రకు, భాషకు గొప్పసేవ చేశారని చెప్పవలసి ఉన్నది. వారు తలపెట్టిన శ్రీ కృష్ణదేవరాయల చరిత్ర కూడా శీఘ్రంగా వెలువడితే భాషా వాఙ్మయాలకూ, చరిత్రకూ ఎంతో మేలు సమకూరగలదని నా విశ్వాసం.

శ్రీ బులుసు వేంకటరమణయ్య.

అథ ప్రణవోపనిషత్

(మాండూక్యము)

వ్యాఖ్యాత: శ్రీ పండిత అన్నే కేశవార్య శాస్త్రి. ప్రకాశకులు: వ్యాఖ్యాత, 3-5-1003 నారాయణగూడ, హైదరాబాదు-29. క్రౌను $\frac{1}{8}$ పేజీలు 160 వెల అమూల్యము.

ఈ గ్రంథము చిన్నదైనను ముఖ్యముగా తొమ్మిది భాగములుగా విభజింప వచ్చును.

(1) పే. 1–3 మాండ్యూకోపనిషత్తు— మూలము.

(2) పే. 4–8 ఈశావాశ్యోపనిషత్తు— మూలము.

(3) పే. 9–26. స్వామి దయానందుల సత్యార్థ ప్రకాశములోని సప్తమ, అష్టమ, నవమ ఉల్లాసములలోని కొన్ని భాగములకు అనువాదము.

(4) పే. 27–59. సత్యార్థ ప్రకాశము ఏకాదశ సముల్లాసమునుండి నవీన వేదాంతుల మత ఖండనమను పేర శంకరమత ఖండనమునకు అనువాదము.

(5) పే. 60-84 పండిత భీమసేన శర్మ గారి మాండూక్యోపనిషత్ప్రస్తావః అను గ్రంథము లోని సంస్కృత మూలము, హిందీ వ్యాఖ్యకు అనువాదము.

(6) పే. 85-104 ఓంకార ప్రణుతి అనుపేర సత్యార్థ ప్రకాశికా మతానుసారము—మాండూక్యమునకు పీఠిక.

(7) పే. 105-'భద్రం కర్ణేభిః' ఇత్యాది శాంతిపాఠము.

(8) పే. 106-155 మాండూక్యమునకు ప్రతిపదార్థమును వివరణము శ్రీ దయానందులయు వారి శిష్యులగు శ్రీ గురుదత్త ఎం. ఏ., పండిత భీమసేన శర్మగారల వ్యాఖ్యానముల ననుసరించినది.

(9) పే. 156-160 రెండు శాంతి పాఠములు, రెండు పరిశిష్టములలో వాని అర్థ వివరణములు.

ఈ ఉపనిషత్తుకు పూర్వాచార్యులెందరో వ్యాఖ్యానములు వ్రాసిరి కాని ఇందులో ఆచార్య శంకరుల మతమే మాటి మాటికి ఖండింప బడినది. అందులకు రెండు కారణము లూహింపవచ్చును. (1) ఈ వ్యాఖ్యాత శ్రీ దయానందులు స్థాపించిన ఆర్యసమాజ మతస్థులు. వారి మతములో ఈశ్వరుడు, జీవుడు, ప్రకృతి—ఈ మూడును అనాదులు, నిత్యములు నవుటచేత వారి కద్వైతము సమ్మతము కాదు. ద్వైతమును, త్రిక మూలకములైన విశిష్టాద్వైతములును అంతటి శత్రువులు కావు. (2) ప్రధానమల్ల నిబర్హణ న్యాయము.

ఇందులో అవలంభించిన ఆర్య సమాజ మతము యొక్క ఖండనమును, శంకరుల మత సమర్థనమును ఈ సందర్భములో ప్రస్తుతములు కావు. ఎందరో పండితు లాపని చేసియే యున్నారు.

గత శతాబ్దములో క్రైస్తవ మహమ్మదీయ మతముల తాకిడిని ఎదిరించుటకు మన దేశములో ఎన్నియో మతములు పుట్టి ప్రతిపక్ష సిద్ధాంతము లను తమవిగా గ్రహించినది. అట్టివానిలో నెల్ల బలవత్తరమైనదీ, ఎక్కువమందిని ఆకర్షించినదీ ఆర్య సమాజము. అది తక్కిన మతములవలె గాక వేద ప్రామాణ్యమును కంఠోక్తిగా అంగీకరించుటయు, దానిని మొదట ప్రచారము చేసినది సన్యాసి యగుటయు ముఖ్య కారణములు. వారి సిద్ధాంతములలో కొన్నిటిని ఉదాహరించినచో మహమ్మదీయ క్రైస్తవముల ప్రభావ మెంత యున్నదో బోధపడును.

1. ప్రతీకారాధనము పనికిరాదు – అనగా భరత భూమిలో ఆ సేతుశీతాచలము వ్యాపించియున్న సమస్త దేవాలయములను, కోట్లమంది ఇండ్లలో నున్న గృహ దేవతార్చనములను వదలివేయవలెను.

2. పుణ్యతీర్థములను క్షేత్రములను సేవించుట నిరర్థకము. కన్యాకుమారినుండి మానస సరోవరము వరకును, ద్వారకనుండి పురి జగన్నాథము వరకును వ్యాపించి భరత భూమిని పుణ్య భూమినిగా చేసిన సమస్త తీర్థక్షేత్రములును గంగాది నదులును త్యాజ్యములు.

3. దేహి చనిపోయిన తర్వాత దేహమును దహనము చేయవలెను గాని ఆ పిమ్మట నెట్టి శ్రాద్ధ కర్మాదికమును చేయరాదు.

4. పశు యజ్ఞములు పనికిరావు. షరా: పై మూడు నాలుగు నిషేధములును సత్యార్థ ప్రకాశిక మొదటి కూర్పులో లేకుండుటేకాక, ప్రేతకర్మములును పశుయజ్ఞములును సమర్థింపబడినట్లు తెలియవచ్చుచున్నది. రెండవకూర్పులో అవి అచ్చుపొరపాట్లని ఉద్ఘాటింప బడినవి.

5. ఊర్ధ్వపుండ్ర ధారణముగాని తిర్యక్పుండ్ర ధారణము గాని నిషిద్ధములు.

6. మంగలాచరణముతో గ్రంథములు ప్రారంభించుటయు ముగించుటయు నిషిద్ధములు. 'హరిః ఓమ్' అని వేదపాఠ మారంభించుట గాని, శ్రీ మహాగణాధిపతయే నమః' ఇత్యాదిగా ఇష్టదేవతా స్మరణము చేయుటగాని నిషిద్ధములు.

7. ప్రసిద్ధమైన స్మార్తకర్మలు నిరసింపబడి నూతన షోడశకర్మలు విధింప బడినవి.

8. వర్ణాశ్రమము లంగీకరింపబడినవి కాని జన్మతః వర్ణము సిద్ధించుట నిరసింపబడినది.

(9) సిద్ధాంత కౌముది, రఘువంశము, కిరాతార్జునీయము, శిశుపాలవధము తుచ్ఛ గ్రంథములు.

అందువల్లనే ఈ మతము మహమ్మదీయ మతము విజృంభించిన దేశభాగములలో నెక్కువగా వ్యాపించినది. వేదోక్త కర్మలు ధర్మములు బలీయముగా లేని జాతుల నెక్కువగా ఆకర్షించినది. ఆంధ్ర దేశములో ఒకానొకప్పుడు నైజాము పరిపాలనములో నున్న భాగమందే ఈ మతము వేరు తన్నుకొని యుండుటయు, ఈ గ్రంథ ప్రకటనము కూడ అక్కడి నుండియే వెలువడుటయు విశేషము.

ఈ గ్రంథము తెలుగు భాషలోనే యున్నను సంస్కృతాంధ్రములు వచ్చినవారికి గూడ సుబోధకము కాని భాషలో నున్నది.

మాండూక్యోపనిషత్తుకు దాని పేరు 'ప్రణవోపనిషత్తు' అని మార్చుట సమంజసమని గ్రంథకర్త సూచన చేసినారు. వారు చూపిన ఉపపత్తి ఎట్లున్నను, పేరు మార్చి వ్యవహరించ మొదలిడినచో 'ప్రణవోపనిషత్తు ఉరఫ్ మాండూక్యోప నిషత్తు' అని వ్యవహరించవలసి వచ్చునేగాని పాతపేరు పోదు.

ఈ గ్రంథములో 4–8 పేజీలలో ఈశావాస్యోపనిషత్తు మూలము ఎందుకు ప్రచురింపబడినదో బోధపడకున్నది. కారణ మెక్కడను గ్రంథకర్త సూచింపలేదు. ప్రమాద పతితమని తోచుచున్నది.

శ్రీ నోరి నరసింహశాస్త్రి.

బూర్జువా పెళ్లికూతురు

(రచన: రంధి సోమరాజు, వెల: రెండు రూపాయలు. శశిధర పబ్లికేషన్సు, అన్నపూర్ణపేట, రాజమండ్రి—3.)

శ్రీ రంధి సోమరాజుగారు వ్రాసినదే ఈ కథాకావ్యం బూర్జువా పెళ్లికూతురు. అభ్యుదయ కర సామాజిక దృక్పథం, సర్వశూన్యం అయినా కవి హృదయం వుండొచ్చు ననడానికి ఈ కథాకావ్యం చదివేక పొద్దు రచయితను గుర్తుచేసుకోవచ్చు. వస్తువు దృష్ట్యా చూసినా, కథనం దృష్ట్యా చూసినా సోమరాజుగారి ఈ రచన పూర్తిగా అసంతృప్తి కలిగిస్తుంది. అసంతృప్తి అనడం మృదువుగా చెప్పడం.

ఉన్నత విద్యావంతుడైన హరిజన యువకుడు ప్రసాదు, పైకులం అమ్మాయి బుల్లిని పెళ్లిచేసుకోడానికి నిర్ణయం తీసుకొన్నాడు. తరవాత అతనికే ఆపెళ్లి ఒప్పందం నుంచి బయటపడాలనిపించింది. తనకు వధువు కావలసి నామెను బెదరగొట్టడానికి తానుద్యోగం వదిలేసి, తనకులం వాళ్ళసేవకు జీవితం ధారపోయదలచేనని ప్రకటించేడు. బుల్లి బెదిరిపోయి 'వుద్యోగంలేకుంటే నువ్వు నాకొద్దు' అంది. ప్రసాదు ఎత్తుపారి, ఆతడు తన కులపుడుచు పైడమ్మను పెళ్లాడుతాడు. ఇదీకథ.

స్థూలంగాచూస్తే 'ధనమూల మిదం జగత్' అనే భావాన్ని నిరూపిస్తుంది కథ—అనిపిస్తుంది. కాని, నిలబడి ఆలోచిస్తే కథలోనూ, దానిని చెప్పిన పద్ధతిలోనూ కూడ కవి సామాజిక దృక్పథం అనభ్యుదయ కరమని వ్యక్తమవుతుంది.

కులవ్యవస్థ నిర్మూలం కావడం, హరిజన గిరిజనాదులు సమాజంలో అంతర్భాగంగా లీనం అయిపోవడమూ నేడు దేశక్షేమం, ప్రజాభ్యుదయం కోరేవారూ, మానవతా దృక్పథాన్ని కనబరిచేవారూ కోరుతున్నారు. మనదేశ ప్రభుత్వం ఆ లక్ష్యంతో కొన్ని చర్యలు తీసుకొంటూంది. ఫలితాలెల్లా వున్నా యనేది తరవాత చూద్దాం.

ఆచర్యల ఫలితంగా హరిజనులు వగైరాలకు విద్యలో, వుద్యోగాలలో ప్రత్యేక సౌకర్యాలు ఏర్పడ్డాయి. ఆకులాల యువకులలో కొందరు పైకి వచ్చేరు.

అయితే వారిని 'పైకులాలవారు కలిపేసుకొంటున్నారు. వారు తమ పల్లెల వేపు చూడడంలేదు. హరిజన ప్రజా సామాన్యం ఎప్పటి స్థితిలోనేవుంది. ఇంక విద్యాదిసౌకర్యాలు కలిగించి లాభం ఏమిటని 1969 లో పార్లమెంటులో చర్చలు సాగేయి.

నిజానికి జరుగుతున్న దాంట్లో తప్పులేదు. ప్రసాదుకు పైకులంపిల్లను ఇవ్వడానికి అంగీకరించడం సమర్థనీయమే. హరిజనులు ఆర్థికంగా వెనకబడివున్న దశలో ఈమాదిరి సంఘటనలు పై పరిస్థితులు సందర్భపడినప్పుడే జరుగుతాయి.

'ఆ పిల్లను గున్నమ్మనా కూసో బెట్టి
పోసిత్తాడు'—అని ఆశపెట్టి,

'సత్తిగాడ్ని సేసుకోమను సూత్తాను' అని సవాలుచేస్తే సర్దుబాటుకావు, సామాజిక సంబంధాలు.

'కులాలమధ్య హెచ్చుతగ్గులు లేవు. అందరూ సమానమే'- అన్నభావం బూర్జువా సమాజానిది. ఈ అంతరం తెలుసుకోవాలి, రచయిత అన్న వాడు, ఈవేళ, సోమరాజుగారు ఆ ప్రయత్నమేనా చేసినట్లులేదు.

తాను చేసుకోదలచిన పిల్లను కనీసం చూడనన్నా చూడాలని లేని నవయువకుణ్ని మనకి కలక్టరుగా వూహించడం, అసలు తెలుగుదేశంలో వచ్చిన పరిణామాల్ని ఎరగకపోవడమేనా కావాలి. హరిజన యువకుల తెలివిని వెక్కిరించడమేనా కావాలి.

దీనిని కప్పిపుచ్చుకొనేందుకు కమ్యూనిస్టు నారాయణ వచోనైపుణ్యం ప్రసాదుని బోల్తా కొట్టించిందంటూరు, కవి.

'నువ్వు కుర్రోడివి, మాటిచ్చేత్తే పెమాదం
మళ్లీమళ్లీ ఇశారించు
యిప్పుడేమొచ్చిందని యింత తొందర?'

—అనే నారాయణ హెచ్చరిక రెచ్చగొట్టి, వేగిరించడానికే నన్నట్లు వ్యాఖ్య చేసేరు.

1969 లో పార్లమెంటులో పైన చెప్పిన చర్చ వచ్చినప్పుడు కొందరు కాంగ్రెసు సభ్యులూ, కమ్యూనిస్టు సభ్యులూ హరిజనాది కులాలు అభివృద్ధి పొందాలంటే వారి ఆర్థికస్థితి మారా లన్నారు. దానికి సమగ్ర భూసంస్కరణలతో ప్రారంభం జరగాలన్నారు.

మూడేళ్ల కీనాడు భూసంస్కరణలకై దేశం నడుంకట్టింది. హరిజనుల ఇళ్లస్థలాల గురించి గట్టి ప్రయత్నం జరుగుతూంది. గరిష్ఠ పరిమితులు నిర్ణయించి, అదనపు భూములు పంచాలని ఉద్యమమే నడుస్తూంది. దీనియెడ కవి అభిప్రాయం ఏమిటి?

ఈడ వొంద లెకరాలు
ఆడి మొగానేసుకొని
ఆడ వో పంచేత్తున్నట్టు
దొంగ పంపకాల రాడీ
దేముడై పోతాడు.

అంటూ కమ్యూనిస్టుగా, నక్సలైటుగా పేరెట్టిన నారాయణను తిట్టిస్తారు.

ఆల తాత కాంగి రేసు
బాబు కమ్మీ నిట్టు
మనవడు నక్సలేటు.

—అంటూ సమాజంలో, ప్రజలలో కొద్దిపాటి పురోగతినేనా వాంఛించే వారంతా అవాంఛనీయ వ్యక్తులుగా వర్ణిస్తారు.

భూముల్ని పంచడం అనేది జాతీయ సమస్య. అది వైయక్తిక స్థాయిలో చేస్తే సమస్యని పరిష్కరించదు. జాతి మొత్తంగా దానిని ఎత్తుకున్నప్పుడు వ్యక్తుల అంగీకారా నంగీకారాలతో నిమిత్తం వుండదు. అందుచేత వేలఎకరాల భూస్వామి తనభూమి మిగుల్చుకోడానికి గరిష్ఠ పరిమితుల శాసనం తెమ్మనడు. ఆ శాసనం వస్తే ఆతడూ దాని హద్దులోకే వస్తాడు. ఇంత సాధారణమైన విషయం కవికి అర్థంకాలే దనగలమా?

ఆమధ్య సోమరాజుగారి 'పొద్దు' మీద ఆలిండియా రేడియోలో సమీక్షిస్తూ సమీక్షకులు—

నల్లనిగాలి తాకిడికి
సుకంగ కరిగి పోతాది మబ్బు
గొప్పోలు అలా పేదల గుండెల్ని
కరిగిత్తే
నోకమంతా జౌద్దారే

దొకటే సేమంతిపువ్వు (పొద్దు)—అనే పద్యం చదివి ఈవర్గ సామరస్య భావం ఎల్లా వచ్చిందో అన్నారు. ఆయన ఈ బూర్జువా పెళ్లికూతురు

చదివి వుంటే ఆ అనుమానానికి తావుండేది కాదు. అంత చక్కని కవితచెప్పిన కవికి సాధారణమైన పాటి సామాజిక అభ్యుదయ దృక్పథం లేదనుకో గలిగేవారు.

జీవనాడి

(జీవనాడి మాసపత్రిక. నవోదయ, సాహిత్య సాంస్కృతిక సంస్థ, హైదరాబాదు. సంవత్సర చందా— 5 రూ.లు. విడిప్రతి—50 పైసలు.)

హైదరాబాదు, సాహితీ, సాంస్కృతిక సంస్థ, నవోదయ 'కళల్నీ, సాహిత్యాన్నీ ఏ ప్రజలగూర్చి సృష్టిస్తున్నామో ఆ ప్రజల దగ్గరకు తీసుకు వెళ్లడం అవసరం'అనే లక్ష్యంతో ప్రారంభించిన మాసపత్రిక— జీవనాడి.

ఈ నాడు దేశంలోవున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిణామాల్ని విశ్లేషణాత్మకంగా చిత్రించే వ్యాసాలు, కథలతో పత్రిక తన లక్ష్యానికి దగ్గరగానే వుంది.

పిక్‌పాకెటర్ కథలో రచయితకు ఇంగ్లీషుమీద వున్న మోజు కేవలం అనవసరంగా (తప్పుగా కూడా) వుంది.

'ఆకలితో చావడం కాదు స్వేచ్ఛ. హక్కులు సాధించుకోడమే స్వేచ్ఛ'—అన్న వసంతగీతం నేటి తెలుగుదేశపు యువక మనస్స్థితికి ప్రతీక.

నగారా

నగారా—వెల— 2. 50 రూ. లు రచన— అరుణోదయం. అరుణోదయ ప్రచురణలు, వేటపాలెం, ప్రకాశంజిల్లా, ఆం. ప్రదేశ్.

కవి ప్రారంభంలోనే నాపాటగా చెప్పకొన్నట్టు వుత్సాహమేగాని ఉపకరణాలేవీ లేకుండా వ్రాసిన 112 పుటల, 23 కవితల సంపుటి.

దేవుడున్నాడనే భ్రమా, మతం మానవుని ఎన్నివిధాల నష్టపరుస్తున్నదా తెలపడం, గ్రహాంతర గమనం సాధించగలిగిన స్వశక్తిమీద ఆతనికి విశ్వాసం కలిగించడం, సంఘంలో మనిషి మనిషిపై సాగించే దోపిడినీ, పీడననూ నిగసిస్తూ—

చీకటిలో నివశించే
ఖర్మెందుకు?
కళ్లుతెరు
....
శపించు

సంపదల సంతానాన్ని— అంటూ 'దీన జనావళిని ముందుకు నడవమని' పురిగొల్పడం కవి అరుణోదయం లక్ష్యం.

అయితే ఇదే విషయాన్ని వచనంలో, క్లుప్తంగా చెప్పగలుగుతే ఇంతగన్న అందంగా వుండేది. ఏవో కొన్ని పదాల్ని గుంపులుగా పోగుపెట్టి వానిని వాక్యాలలో దూర్చే ప్రయత్నంలో వచన కవితా సంపుటి తయారు రయిందని పిస్తుంది.

బిడ్డ పుట్టడానికి
దుడ్డు రావడానికి
గద్దె నెక్కడానికి
మిద్దె కట్టడానికి
... .
దణ్ణం పెట్టుకో
ముడుపు కట్టుకో
మనసున తలుచుకో

—ఇల్లాగే నడుస్తాయి చాలపుటలు.

రక్తగానం

(కవితా సంకలనం)

ప్రతులకు—ముడార్ వేణుగోపాల్ 14–400 కమలానగర్, అనంతపురం. (వెల ఒకరూపాయి)

శ్రీ శ్రీ రచన 'పేదవాళ్ళ ఆగ్రహం'తో ప్రారంభమయి—

'మాజిల్లా, మారాముడినే
గోళ్ళలోకి సూదులు గుచ్చి
కళ్లలోకి కారం చల్లి
చిత్ర హింసల పాల్జేసి
చచ్చిన శవాన్ని కాల్చి
దేవీకుంట అడవుల్లో

ఆత్మరక్షణ కోసం చంపామంటే

ఎలా నమ్మను?'—అని ప్రశ్నిస్తూ నర సప్పగారు తెలిపిన—

—'క్రాంతి రాక పోతుందా'

అనే ఆశతో ముగుస్తున్న ఈ కవితా సంపుటిలో 14 మంది కవుల 24 కవిత లున్నాయి.

ప్రజలు గురి అవుతున్న బాధలు చూస్తూ, ఓపలేని సహృదయోద్వేగం ఈ సంపుటిలోని ప్రతి కవితలో కనిపిస్తుంది.

రాళ్లకు స్వర్ణ కవచాల్ని
వజ్రా భరణాల్ని కూరుస్తూ
చలికి బిగుసుకు పోతున్న
మనిషిని గమనించని ఈబద్మాష్ వ్యవస్థలో
రుధిర గీతం గాక
మధుర గీతం ఏలా ఆలపించను—

—అని వ్యధ చూపుతారు, ముడార్ వేణు.

జాలి, దయ
నదులుగా ప్రవహించే
ఈ దేశం లో
సామాన్యులకు
మనుగడ లేదు—అని నిరుత్సాహ పడతారు,
ప్రేమ్‌సాగర్.

శాంతి, అహింస అంటూ కూచుంటే ఆత్మరక్షణే లేదు నీకు—అని తెగేసి చెప్తారు నాగే శ్వర్రావు.

'ఆకలి మరణం దారుణం
తరుణం మించందే
రణ రంగంలో దూకు—' మని

వీపు తడుతున్నారు సారంగ మూర్తి.

'నీచూపు వాలవలసింది
మానినీ కాను కేంద్రాలపైకాదు
అసమ సమాజంలోని
అవినీతి పైన'—అని చెవి మెలి

పెడుతున్నారు అరుణకుమారి.

ఎన్నాళ్ళీ దోపిడి విధానాన్ని
సహిస్తావు?లే, తిరగబడు...

—అని జాలిచూపుతారు డేనియల్.

మానవున్ని మానవుడు దోచుకునే
మనిషినిమనిషి ఈసడించుకొనే

ఈ బూర్జువా సమాజాన్ని భూస్థాపితం చేస్తారు.

'సమసమాజాన్ని నవసమాజాన్ని స్థాపిస్తార'ని విశ్వాసం కనబరుస్తారు జి. ఎస్. కృష్ణమూర్తి.

'రక్తంపాడే సమయం వస్తే అది ఎల్లా నిన దిస్తుందో ఈ రక్త గానంలో వింటాం' అన్న శ్రీ శ్రీ వాక్యం ఉత్సాహంతో పలికిన అతిశయోక్తిగా తీసుకొన్నా పూర్తిగా అసత్యం మాత్రం కాదు.

అయితే ఆ వుత్సాహాతిశయంలో శ్రీ శ్రీ ఈ కవిత్వంలో 'గణయతి ప్రాసల సర్కస్‌మొగ్గలూ, రసాలంకారాల విస్కీపెగ్గులూ' వెతికేవారిని 'పోలీసులకు రిపోర్టులు దాఖలు చేసుకోవచ్చ'ని అనుమతించడం, 'ఆచోకీ అందించే పురుగుల'ని నిందించడం చూస్తే దేవతావస్త్రాల కథ జ్ఞాపకం వస్తుంది. ఈకవితలలో శిల్పం పూర్తిగా లోపించిందని ఆ మాటల్లో తానే వొప్పుకొన్నారు.

సాహిత్యంలో వస్తువుకున్నంత ప్రాముఖ్యం శిల్పానికి వుంది. ఒక్కొక్కదశలో పరిస్థితుల ప్రాబల్యంలో మానవుడు ఏదో ఒక దానికి ప్రాముఖ్యం ఇవ్వడం, త్వరలోనే మోహంమొత్తి రెండోదానికి వెంపరలాడడం జరుగుతూ 'వస్తువా, శిల్పమా' అనే తగువు చావకుండా నిత్యనూతనం అవుతూంది. ఇప్పుడు తెలుగుదేశంలోవున్న పరిస్థితులు వస్తు ప్రాధాన్యతకి పట్టం కట్టేయి. శ్రీ శ్రీ గారి సమర్థన అందుకే. కాని శిల్పం పూర్తిగా లోపించినప్పుడు ఆ సాహిత్యాన్ని జనం ఆట్టేకాలం హర్షించరు. ఇదే పద్ధతి కొనసాగితే పూర్తిగా వైముఖ్యం కలుగుతుంది. అసాధారణ శిల్ప ప్రతిభగల శ్రీ శ్రీ కి ఈ విషయం వేరే చెప్పనక్కర్లేదు.

ఎంతో ఉత్తమమయిన ఆశయాలతో కవితా రంగంలోకి వచ్చిన యువకవుల్ని ఉత్తమ తరగతి

కవుల్నిగా పరిణతి పొందించవలసిన బాధ్యత ఉద్యమ నాయకత్వం వహిస్తున్న శ్రీ శ్రీ మీాద వుంది. యువ కవులుచేసే పొరపాట్లకు విమర్శరాకుండా తిట్ల గొడుగు అడ్డుపెట్టడం వలన ఆయన తన బాధ్యతను నెరవేర్చినట్లు కాదు. అలా చేయడంవలన ఆయన పెద్దరికం నిలబడుతుంది. కాని యువకవులు ఎదగరు. విమర్శ రావాలి. అప్పుడే దిద్దుకొంటారు. సమర్ధవంతంగా వ్రాస్తారు. అతి ప్రాథమికమయిన ఈ అవకాశాన్ని వారికి లేకుండా చేస్తున్నా రనాలి, శ్రీ శ్రీ; తమ వుత్సాహాతి రేకంలో.

'అవంతి'

గోపీచంద్ ఆర్ట్స్

(నాలుగవ వార్షిక ప్రత్యేక సంచిక)
(ప్రచురణ : గోపీచంద్ ఆర్ట్స్, హైదరాబాద్ 500029.)

సర్వశ్రీ అక్కినేని నాగేశ్వరరావు, బి. నాగిరెడ్డి, చక్రపాణి, ఠాకూర్ హరిప్రసాద్ పోషకులుగా, జస్టిస్ ఆవుల సాంబశివరావు, శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు, శ్రీ దేవులపల్లి రామానుజ రావు, శ్రీ వెంకట రమణా రెడ్డి సలహాదార్లుగా గోపీచంద్ ఆర్ట్స్ పనిచేస్తున్నది హైదరాబాదులో. నాలుగవ వార్షికోత్సవం సందర్భంలో యీా (సువనీర్) ప్రత్యేక సంచికను ప్రచురించారు.

స్వర్గీయ గోపీచంద్ బొమ్మలను ప్రముఖంగా ప్రచురించారు. 200 పుటలతో ఇంత అందంగా, ప్రయోజన లక్ష్యంతో యీా ప్రత్యేక సంచికను ప్రచురించ గలిగినందుకు గోపీచంద్ ఆర్ట్స్‌ను ప్రశంసించుతున్నాను. గోపీచంద్ అభిరుచులకూ ఆసక్తులకూ అనుగుణంగా ఉన్నది ఈ సంచిక అంతే కాదు. మొదటి పేజీనుంచి ఆఖరి కవరు పేజీ వరకూ గోపీచంద్‌ను గుఱించిన వ్యాసాలను కాక సరికొత్త పద్ధతిలో పలువ్యాసాలను ప్రచురించడం ద్వారా యీా సంచిక కొక ప్రత్యేకత కలదని స్ఫురింపజేశారు.

'మా జీవితయాత్ర' అనే శీర్షికన శకుంతలా గోపీచంద్ వ్రాసిన వ్యాసంలో వ్యాసావళిని ప్రారంభించడం సమంజసంగా ఉన్నది. గోపీచంద్ జీవితంలో ఎన్నో తుఫానులు వచ్చినయ్. మరెన్ని సమస్యలనో ఎదుర్కొన్నారు గోపీచంద్, 'మా ఆవిడ నాకు పెద్ద ఓదార్పు' అన్నారొకప్పుడు గోపీచంద్.

'తను జీవిత సమాప్తి వరకూ పుంఖాను పుంఖమైన రచనలను గోపీచంద్‌గారు వెలుగు రేకలుగా వెదజల్లినారు' అన్నారు (18 వ పుట) శ్రీ దేవులపల్లి రామానుజరావు 'సహృదయుడు' అనే వ్యాసంలో.

దేబె మొగాలతో నిండిన
'దేశం ఏి మయ్యేట్టు'
'అసమర్థుని జీవితయాత్ర'
కాత్మహత్యేన గట్టు
మాసిపోని రాత కాడ
మా రాతేమైనట్టు

అన్నారు (20 పుట) కాళోజీ నారాయణరావు. అవును గోపీచంద్ కూడా ఇదే సమస్య గురించి చాలా సంవత్సరాలు ఆలోచించారు. ఆ ఆలోచనలనే కథలుగా, నవలలుగా చిత్రించారు.

రంగభూమి అనే విభాగంలో కావ్యేషు నాటకం రమ్యమ్, నాటక కళ, నాటకం, నటనా తన్మయత్వం ఆంధ్ర నాటక రంగం, తెలుగులో నాటక కళ, నాటక రచయితలలో చైతన్యం రావాలి. పోటీ నాటకాలు— నాటక రంగాభివృద్ధి, నాటక సమాజ సమిష్టి, నటులకు రాజమార్గం ఏకపాత్రాభినయం—చదివి ఆలోచించదగిన వ్యాసాలు.

వీటన్నింటితో సరితూగ గల వ్యాసం నాటక రంగంలో మార్కెటింగ్ సమస్యలు. 'హేతువాదానికి ప్రోదిచేసిన రెండు నాటకాలు' అనే వ్యాసంలో 'ఏమైనా 'ఖూనీ' నాటకం మూఢాచారాలలో మునిగి తేలేవారికీ, కాలంతోపాటు మారలేనివారికీ కనువిప్పు' (68 వ పుట) అన్నారు రచయిత్రి. నిజమే ఇంతకు ముందు చాలాసార్లు చాలామంది యీా నాటకం గుఱించి ఇటువంటి అభిప్రాయాన్నే ప్రకటించారు. కానీ 'ఆ కనువిప్పు' అనేది ఇంతవరకూ కూడా జరగలేదంటే దానికి కూడా బలీయమయిన కారణమేదో ఉంటుంది. ఆ కారణాన్ని చిత్రించి, భేదించగల నాట

కాలను వ్రాయగలవా? వ్రాస్తే ప్రేక్షకులు ఆదరించు తారా? ఆదరించక పోయినా ఫరవాలేదనుకుందావా ?

'నాటకాలుకన్నా సినిమాలకు మరింత విస్తృతమయిన ప్రజాదరణ ఉన్నా నాటకరంగాన్ని నాశనం చేయటం సినిమా రంగానికి సాధ్యంకాదని నా నమ్మకం' అంటారు మన నాటకరంగంఅనే వ్యాసంలో (73 వ పుట) రచయిత. 'నాటకాలకుగల ప్రత్యక్ష మానవులతో స్వభావం ఇందుకు కారణాలు' (73 వ పుట). ఇది చర్చనీయాంశం కాదా?

'ఏ నాటకానికైనా నాటకీయ భ్రమ అత్యవసరం. దాని నిర్వహణానికి ప్రేక్షకులలో ఒకవిధమైన అపోహావేశమే జీవగఱ్ఱ' (75 వ పుట) అంటారు నాటకము నిర్వహణము అనే వ్యాసంలో రచయిత. ఈ కొలత బద్దతో కొలిస్తే యీ రోజులలో వస్తున్న నాటకాలలో ఎన్ని నాటకాలు—నాటకాలనిపించుకుంటయ్? నాటక రచయితకు నిర్మాత న్యాయం చెయ్యాలంటే—నిర్మాత సాధించవలసిన అయిదు ఆశయాలను పేర్కొన్నారు ఈ రచయిత.

ఈ విధంగా పరిశీలించుతూ పోతే యీ సంచికలోని వ్యాసాలలో — చర్చించదగిన అంశాలు చాలా ఉన్నాయ్.

'తెలుగు నాటక రచయితలు కళను ప్రజాయత్తం చేయటం విషయంలో సందేహించినట్లయితే తెలుగు నవలకు భవిష్యత్తు మూసుకుపోయినట్లుగానే నాటకానికి కూడా గతమే కాని భావి అనేది ఉండదు' (115 వ పుట) సాహిత్య కళారంగాలలో కుడి ఎడమల దగా దగా 'అనే వ్యాసంలో అంటారు రచయిత. ఇటువంటి అభిప్రాయాలు ఈ రచయితకు ఎలా కలిగినవో? తెలుగు నవలకు భవిష్యత్తు మూసుకుపోయిందా? అయితే యీనాడు వస్తున్న నవలలన్నీ గతానికి సంబంధించినవేనా? కళను ప్రజాయత్తం చెయ్యడం అనేది కొత్త ఆదర్శమా? ఇప్పటికే యీ ఆదర్శం చాలా రచనలలో—నవలల్లో కూడా కనిపించడం లేదా? ఉండవలసిన తీరున లేదంటే అది వేరే సంగతి. తెలుగు నవలకు భవిష్యత్తు మూసుకుపోయిందనడానికి ఆధారా లేమిటి?

'పశ్చిమోదయ నాటకం,' 'ఆర్ ఎక్టర్స్ టుడే ఆక్టింగ్' 'సంగీత కళా విశిష్టత' 'తెలుగు నాటక రంగం ప్రోత్సాహకరంగా లేకపోవడానికి ప్రజలే కారణం' అనే వ్యాసాలు బాగున్నాయ్. అంత మాత్రాన ఆ వ్యాసాలలోని అభిప్రాయా లన్నింటితో అందరమూ ఏకీభవించాలనేమీ లేదుగదా !

మొత్తంమీద ఈ సంచిక చక్కగా ఉన్నది. ఉత్సాహ పరులూ, అభిమానులూ మాత్రమే కాక, ఆలోచించగలవారందరూ కూడా చదివి, ఆలోచించ దగినదిగా ఉన్నది. ఇంత చక్కటి సంచికను ప్రచురించి నందుకు గోపీచంద్ ఆర్ట్స్‌కు అభినందనలు.

— శ్రీ వి ఎస్ అవధాని.

ప్రకృతి ప్రబంధము

(తెలుగు కావ్యాలలో ప్రకృతి వర్ణన)

(రచయిత : చేకూరి చెన్నకృష్ణయ్య. పేజీలు : 33+296; వెల రూ 10 లు. ప్రతులకు: చేకూరి చెన్నకృష్ణయ్య; లక్ష్మీకేశవ నిలయం; 12 బారాగలీ కాలనీ; హైదరాబాద్—2.)

'ప్రకృతి ప్రబంధము' అనే పేరు వినంగానే పద్య కావ్యం అని భ్రాంతిపడే అవకాశం ఉంది. 1969—70 సంవత్సరములో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారి రెండువేల రూపాయల బహుమతి నందుకున్న 'కావ్యాలలో ప్రకృతి వర్ణన' అనే సమీక్షా గ్రంథమిది. ప్రాచీనకాలంలోగాని, ఇప్పుడుగాని ప్రకృతిని ఏదోవిధంగా తన కవిత్వంలో వర్ణించని కవి లేడనడం నిర్వివాదమైన విషయం.

మహాకావ్యానికి అష్టాదశ వర్ణనలు ప్రధానమన్నారు ఆలంకారికులు. శ్రీనాథుడి తరువాత పెద్దనతో ప్రారంభమయిన ప్రబంధయుగానికి అష్టాదశ వర్ణనలు ప్రాణభూతమైన లక్షణాలుగా పేర్కొనబడ్డాయి. పుర, సముద్ర, శైల, ఋతు, సూర్యోదయ, చంద్రోదయ, సరః క్రీడా, వనక్రీడా, వసంత, రతి ప్రసంగ, విరహ, పరిణయ, పుత్రోదయ, నయ

విరచన, దండయాత్ర, యుద్ధ, దౌత్య, ప్రభు వర్ణనలు అష్టాదశ వర్ణనలు. ఈ సంఖ్యను పెంచినవాళ్లూ ఉన్నారు. ఉదాహరణకు అప్పకవి—

'పురమును, ఋతుషట్కమును ప్రయాణంబును
శైలంబు, వేటయు, సాగరంబు
మౌనీంద్ర పుణ్యాశ్రమంబును, మంత్రంబు
ద్యూతంబు పిదప నద్భుత రణంబు
విజయంబు, మధ్యపానజ వికారంబును
వనవిహారంబును, వారి కేళి
కన్యాంగ సౌందర్య కథనంబు, హిమకరా
భ్యుదయంబు విప్రలంభోచితంబు
పద్మమిత్రోదయంబును, బరిణయంబు
సురతమును, దౌహృదంబును, సుత జననము
ననగ నిరువదిరెండు వర్ణనలు గూర్చి
చెప్పవలయుఁ బ్రబంధంబు శ్రీనివాస!'

అంటూ ఇరవై రెండు చేశాడు.

సంస్కృత లాక్షణికులు ఈ సంఖ్యను ఇంకా పెంచారు.

'వర్ణ్యాశ్చ రాజా దేవీచ
దేశో గ్రామః పురీ సరత్!
సరోఽబ్ధ్యరణ్యో ధ్యానాద్రి
ప్రయాణ రణ రాగినః!
హస్త్యర్క చంద్రా వృతవో
వివాహోఽథ స్వయం వరహః!
సురా పుష్పోంబు సంభోగః
విశ్లేష మృగ యాశ్రమాః!
కలా ఋతు వయస్సంధీ
ధాతు వృక్షాభి సారికాః!'

ఇలా అలంకార శాస్త్రజ్ఞులు మహాకావ్యవర్ణనల విషయంలో ఎవరికి తోచిన విధంగా వారు సంఖ్యలను పెంచుకుంటూ పోయారు. ప్రస్తుత సమీక్షా గ్రంథము ప్రకృతి వర్ణన కాబట్టి తత్ గ్రంథ రచయిత తన వ్యాసాల్లో ప్రకృతికి సంబంధించినంత వరకూ ఏ ఏ కావ్యాల్లో ఏ ఏ విధంగా ప్రకృతి దర్శన మిచ్చిందో వివరించారు. చెన్నకృష్ణయ్యగారు ఈ గ్రంథాన్ని రాయడానికి సుమారు 500 కావ్యాలు పరిశీలన చేసినట్లుగా చెప్పుకున్నారు. వృత్తిరీత్యా చెన్నకృష్ణయ్యగారికి తెలుగు సాహిత్యానికి ఏమీ సంబంధంలేదు. అయితే ఆయన సాహిత్యాన్ని అమితంగా అధ్యయనం చేసిన వారు కావడం వలన ఈ గ్రంథాన్ని రాయమని మిత్రులు ప్రోత్సహించడంతో ఈ గ్రంథరచన సాగింది. రచయిత అభినందనీయులు.

ఒక్కొక్క కావ్యంలో ఒక్కొక్క కవి ప్రకృతిని వర్ణించిన పద్యాలు ఉదహరిస్తూ వాటి తాత్పర్యాలు రాసి ఉన్నట్లయితే చెన్నకృష్ణయ్యగారిపేరు ఎక్కువగా చెప్పవలసిన అవసరం ఉండేదికాదు. ప్రకృతిని వర్ణించడంలో కవియొక్క ప్రధాన ఉద్దేశం, తత్‌వర్ణనవల్ల కథాపరంగా కావ్యానికి చేకూరే పరమార్థం ఈ రెండిటినీ ఎక్కడికక్కడ ఆయన వ్యాఖ్యానం చెయ్యడంవలన గ్రంథం పొడుగునా ఆయన వ్యక్తిత్వం కనబడుతుంది. ప్రకృతి వర్ణనలను గురించి చెబుతూ ఆయన అభిప్రాయాన్ని కూడా వివరించారు. 'ప్రకృతి వర్ణనలను గూర్చి ముచ్చటించునపుడు తాత్విక వివేచనతో మనకు నిమిత్తము లేదు. దృశ్యమాన జగత్తునందలి చెట్లు చేమలు, లతాగుల్మములు, కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, పూలు, కోకిలలు, గోరువంకలు, తుమ్మెదలు, చిలుకలు, సూర్య చంద్రాదులు, నక్షత్రములు, ఆకసము, సముద్రము, సరస్సులు, నదీనదములు మున్నగునవియే ప్రకృతి పరిధిలో చేరునవి. వాని వర్ణన విషయమే ప్రస్తుత చర్చనీయాంశము.'

కావ్యయుగము, ప్రబంధయుగము, ఆధునిక యుగము, పల్లీయప్రకృతి, గోగోప జీవనము, ప్రకృతి జానపద సాహిత్యము, ప్రభాత సూర్యోదయ వర్ణన, చంద్రోదయ చంద్రికా వర్ణన, ఆశ్రమ వర్ణన, ఋతువర్ణన ఇత్యాదిగ గ్రంథాన్ని కొన్నిభాగాలుగా విభజించి రాయడం జరిగింది. ఆ యా భాగాల్లో ప్రాచీన, ఆధునిక కవుల కావ్యాలలో కనిపించే ప్రకృతి వర్ణనలను సమీక్షించడం జరిగింది. 'ఆరూఢ స్థితి జంద్రికా ధవళితాజాండంబులో చంద్రుడొప్పెన్' అనే ప్రబంధ కవిత్వంలో

చంద్రోదయ వర్ణనకి 'నవీన విశ్వవిద్యాలయాల్లో పురాణకవిత్వంలా, శ్రవణ యంత్రశాలల్లో శాస్త్రీయ సంగీతంలా, ఇలా వచ్చావేం వెన్నెలా?. ఎలా వర్ణించను నిన్ను?' అంటున్న శ్రీ శ్రీ శరశంద్రికలోని చంద్ర వర్ణనకి కవి భావనలోఉన్న భేదాన్ని రచయిత వివరించి ఉన్నట్లయితే బాగుండేది. అసలు 'శరశ్చంద్రిక'నే తలవలేదు రచయిత.

పూర్వకావ్యాల్లో ప్రకృతి వర్ణన కావ్యనియమాను గుణంగా తప్పని సరైంది. అందుచేత కావ్యాల్లో అవసరం ఉన్నా లేకపోయినా ప్రకృతి వర్ణనలు తప్పలేదు. కథాగమనానికి, ప్రకృతి వర్ణనకి సంబంధం ఉన్నా లేకపోయినా ప్రాచీన కవిత్వంలో పద్యానికి ఛందస్సు ఎంతముఖ్యమో ఒక కావ్యంలో ప్రకృతి వర నకూడా అంతే ముఖ్యమైంది. ప్రాచీన కావ్యాల్లో కావ్యగతమైన శిల్పంలో ఒక భాగంగా కనిపించే ప్రకృతివర్ణనలకు, కథలో అతికించినట్లుగా కనిపించే ప్రకృతి వర్ణనలకు, ప్రాచీన ఆధునిక కవుల దృక్పథాల్లో ప్రకృతి వర్ణన పరంగా ప్రదర్శితమయ్యే భావ వైవిధ్యానికి ప్రత్యేక భాగాలు కేటాయించి ఉదాహరణ సహితంగా వివరించి ఉన్నట్లయితే గ్రంథం ఇంకా బాగుండేది. రచయిత నన్నయనుండి, నారాయణ రెడ్డివరకు అని ఒక నియమం పెట్టుకున్నట్లున్నారు. నారాయణరెడ్డిగారినిమించి ఆధునిక కవిత్వం ముందుకు వచ్చేసి చాలా కాలమయింది. శ్రీ మాదిరాజు రంగారావు, శ్రీ వేగుంట మోహన ప్రసాద్ మొదలైన వ్యక్తివాద కవులు ప్రకృతిని చాలా కొత్తగా చిత్రించారు. వాటిని రచయిత గమనించలేదు. అభ్యుదయ కవిత్వకాలంలో ఒక శాఖగా ఉద్భవించిన సర్రియలిస్టు కవిత్వంలో ప్రకృతి వికృతంగా దర్శనమిచ్చింది. రచయిత ఆ అంశాన్నికూడా విస్మరించినట్లున్నారు. అయితే గ్రంథ విషయంయొక్క విస్తీర్ణత విశాలమైంది కనుక అందర్నీ పరిశీలించే అవకాశం ఉండక పోవచ్చు. తెలుగు కవిత్వంలో ప్రకృతి ఏ విధంగా వర్ణితమైందో తెలుసుకునే ఆసక్తి గలవారు తత్కవిత్వాన్ని అంతటిని చదివే అవకాశం ఎటూ ఉండదు కనుక ఈ గ్రంథం ఆలాంటివారి ఆసక్తిని సంతృప్తి పరుస్తుందనడంలో సందేహం లేదు.

—శ్రీ టి. ఎల్. కాంతారావు.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by
S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street,
Madras-1, Editor : S. Radhakrishna.